ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 11.07.2025 | సంపుటి :11 సంచిక : 353 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు ఆర్డినెన్స్

### ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తాం

### తెలంగాణ కేబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు

- అమిటీ, సెంటినరీ రిహాబిలిటేషన్ విద్యాసంస్థలకు యూనివర్సిటీ హోదా ఇచ్చేందుకు ఆమోదం
- కేబినెట్ వివరాలను వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- 17వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చేందుకు జాబ్ క్యాలెండర్ సిద్ధం :మంత్రి పొన్నం

హైదరాబాద్, జూలై 10 (జనంసాక్షి) : తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలుకు ఆర్డినెన్స్ ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. రిజర్వేషన్ల అమలుకు 2018లో తెచ్చిన చట్టాన్ని సవరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో మిగతా 2లో..



## ఈత, తాటి వనాల్లేవు.. హైదరాబాద్‌లో కల్లు ఎక్కడిదీ?

## అంతా రసాయనమే..



"కల్లు మానండోయ్.. కండ్లు తెరవండోయ్" అంటూ స్వతంత్ర్య ఉద్యమ కాలంలోనూ వినిపించిన నినాదం. ప్రజలను మత్తు నుంచి దూరం చేసి దేశాభివృద్ధికి పాటుపడాలని స్ఫూర్తినిచ్చిన పిలుపు ఇదీ..! కానీ, ఏడు దశాబ్దాలు దాటినా కల్తీ కల్లు కాటు నిరుపేదల ఇండ్లల్లో కల్లోలం రేపుతూనే ఉన్నది. అమాయకుల రక్తమాంసాలను బలి తీసుకుంటూ యథేచ్ఛగా సొమ్ము చేసుకుంటున్నది. ఏదోక మూలన కల్తీకల్లు ప్రజల ప్రాణాలు బలిగోరుతూనే ఉన్నా.. ఈ కల్లు మాఫియా సామ్రాజ్యం మాత్రం కొందరు 'పెద్దల' అండతో పెట్రేగిపోతున్నది. స్వచ్ఛమైన కల్లు లేనిచోట రసాయనాలు కలిపేసి పేదలు, కార్మికులు, కూలీల ఒంట్లోకి పంపించి కోట్ల రూపాయల వ్యాపారం చేసుకుంటున్నారు. తాటి, ఈత వనాల్లేని హైదరాబాద్ నగరంలో ఇబ్బడిముబ్బడిగా ఉన్న దుకాణాలు ఎక్కడినుంచి కల్లు గీస్తున్నదనేది ఇప్పుడు ప్రశ్న..!

### కూకట్‌పల్లి ఘటనతో బయటపడ్డ మాఫియా దుర్మార్గాలు

### పారిశుధ్య కార్మికులు, అడ్డాకూలీల, పేదల రక్తం తాగుతున్న వ్యాపారులు

- నగరవ్యాప్తంగా కల్లు దుకాణాల్లో అంతా రసాయనమే..
- కల్తీ కల్లు కాటుతో ప్రతియేటా పదుల సంఖ్యల్లో మృతులు
- నాడు కిరణ్‌కుమార్ రెడ్డి సర్కారు రద్దు చేసినా నేటికీ యథేచ్ఛగా దందా
- జనావాసాల్లో ఉన్న కల్లు దుకాణాలను తొలగించాలని పెరుగుతున్న డిమాండ్లు

హైదరాబాద్, జూలై 10 (జనంసాక్షి) : గ్రేటర్ హైదరాబాద్‌వ్యాప్తంగా కల్లు కాంపౌండ్‌లు పదుల సంఖ్యల్లో ఉండగా ప్రధానంగా బస్తీలు, స్లమ్స్ ప్రాంతాల్లో ఇవి దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల ప్రధాన రహదారులపైనా కనిపిస్తున్నాయి. నగర విస్తరణకు ముందు కొంత ఇతర జిల్లాల నుంచి చెట్ల కల్లును దిగుమతి చేసుకున్నప్పటికీ.. పట్టణీకరణ పెరిగిన తర్వాత గీత కార్మికులు ఎక్కడికక్కడ కల్లు అమ్ముకుంటున్నారు. హైదరాబాద్ నగరానికి క్రమంగా దిగుమతి తగ్గిపోయింది. కల్లు లభ్యత లేనిచోట దుకాణాలు ఉన్నాయని గుర్తించిన నాటి కిరణ్‌కుమార్ రెడ్డి సర్కారు.. కల్లు దుకాణాలను పూర్తిగా రద్దు చేసింది. ఆల్ప్రాజోలం, సోడియం బై కార్బోనైట్, డైజోఫాం, క్లోరల్ హైడ్రేట్ వంటి ప్రమాదకర నిషేధిత మత్తు పదార్థాలు, రసాయనాల మిశ్రమాలను మిగతా 2లో..

### అంతా కూలీలు, కార్మికులే..

బతుకుదెరువు నిమిత్తం వివిధ జిల్లాలు, ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వస్తున్న నిరుపేదలు బస్తీలు, స్లమ్ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటూ కూలీ పనిచేసుకుంటున్నారు. జీహెచ్ఎంసీ కార్మికులు, అడ్డా కూలీలు, దినసరి కార్మికులుగా పనిచేస్తూ పొట్టపోసుకుంటున్నారు. ఇలాంటి మిగతా 2లో..

### కల్తీ కల్లు ఘటనలో భారీ మోతాదులో 'ఆల్ప్రాజోలం' గుర్తింపు



- బాధితుల సంఖ్య 44కి చేరిక..
- పలు దుకాణాల లైసెన్సులు రద్దు
- బాధ్యులను విడిచిపెట్టేదిలేదు
- మంత్రి దామోదర రాజనర్సింహ
- మృతుల కుటుంబాలకురూ.20 లక్షలు చెల్లించాలి
- ఆస్పత్రిలో బాధితులకు మెరుగైన చికిత్స అందించాలి
- ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి: కేటీఆర్
- ఘటనకు బాధ్యత ప్రభుత్వానిదే..: రామచందర్‌రావు

హైదరాబాద్(జనంసాక్షి): నగరంలోని కూకట్‌పల్లి పరిధిలో జరిగిన కల్తీ కల్లు ఘటన నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఐదు బృందాలుగా ఏర్పడి వివిధ కల్లు దుకాణాల నుంచి నమూనాలను సేకరించి.. నారాయణగూడలోని ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించారు. కొన్ని దుకాణాల్లో ఆల్ప్రాజోలం మత్తుమందును కలిపి కల్లు కల్తీ చేసినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో పలు దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేసినట్లు బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా ఘటనలో బాధితుల సంఖ్య 44కి చేరింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు– తెలంగాణ వైద్యారోగ్యశాఖ మిగతా 2లో..

## అమెరికాతో వాణిజ్య చర్చల్లో పురోగతి



### వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):అమెరికాతో వాణిజ్య చర్చలు నడుస్తున్నాయని వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ గురువారం తెలిపారు. భారతదేశం–అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో అగర్వాల్ ముఖ్య సంధానకర్తగా ఉన్నారు. ఇప్పటికే పలుమార్లు అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపారు. త్వరలోనే ఒక కొలిక్కి అవకాశం ఉన్నట్లు– కనిపిస్తోంది. వాస్తవానికి ట్రంప్ విధించిన డెడ్‌లైన్ గడువు జూలై 9తో ముగిసిపోయింది. అయితే కొన్ని దేశాలకు ఆగస్టు 1 వరకు గడువు పొడిగించారు. అయితే అమెరికా.. భారత్‌లో వ్యవసాయం, పాడి పరిశ్రమపై మినహాయింపులు కోరుతోంది. ఈ రెండు కూడా భారతదేశంలో చాలా సెంటిమెంట్. ఈ నేపథ్యంలోనే ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు సందిగ్ధంలో పడ్డాయి. తాజాగా ఇదే అంశంపై గురువారం రాజేష్ అగర్వాల్ స్పందించారు. ఎగుమతి లాజిస్టిక్స్‌పై జరిగిన కార్యక్రమంలో అగర్వాల్ వాణిజ్య ఒప్పందాలపై మాట్లాడారు. అమెరికా–భారత్ మధ్య వాణిజ్య ఒప్పం మిగతా 2లో..

### ఇందిరమ్మ ఇళ్లలో ఎంపీ కోటా పెట్టాలి

ముఖ్యమంత్రి రేవంత్‌కు రఘునందన్ లేఖ

### కేసీఆర్‌కు మళ్లీ వైద్యపరీక్షలు

యశోద ఆసుపత్రిలో చేరిన మాజీ సీఎం

యెమెన్‌లో కేరళ నర్సుకు మరణశిక్ష..

### కేసు విచారణకు సుప్రీం కోర్టు అంగీకారం

పై వార్తల వివరాలు 2లో



## ఈసీ నిర్ణయం సమర్థనీయమే

### రాజ్యాంగం ప్రకారమే ముందుకెళ్తోంది

### బీహార్ ఓట్ల వ్యవహారంపై సుప్రీం సమర్థన

న్యూఢిల్లీ(జనంసాక్షి):అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయం బిహార్ రాజకీయాల్లో వివాదాస్పదమవుతోంది. దీనిని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. అక్కడ చుక్కెదురైంది. ఈసీ చర్యను సుప్రీం ధర్మాసనం సమర్థించింది. ఇది రాజ్యాంగం ప్రకారం జరుగుతోన్న ప్రక్రియేనని వ్యాఖ్యానించింది. అయితే ఎన్నికల ముందు నిర్వహించడాన్ని మాత్రం ప్రశ్నించింది 'ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పు లేదు. అయితే.. ఇక్కడ సమస్యంతా చేపడుతున్న సమయం.. దాని చెల్లుబాటు గురించే. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మిగతా 2లో..


## కాంగ్రెస్, కమ్యూనిస్టుల అనుబంధం విడదీయరానిది

### బిహార్లో ఎలిమినేషన్ ప్రక్రియ ప్రజాస్వామ్య విరుద్ధం

- బీజేపీ అధికారంలో వచ్చాక రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తోంది
- దేశంలో ఎలక్షన్ కమిషన్ కొందరి వ్యక్తులకు లాభం చేసే సంస్థగా మారడం దౌర్భాగ్యం
- దేశ భవిష్యత్ కోసం లౌకికవాద శక్తులు బలపడాలి
- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది
- మఖ్దూమ్ కార్యాలయం పునః ప్రారంభ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్(జనంసాక్షి):సీపీఐ మఖ్దూమ్ కార్యాలయ పునః ప్రారంభ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మఖ్దూమ్ జీవితం, భావజాలం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తీవ్రంగా స్పందించారు. మఖ్దూమ్ జీవితం తెలుగు నేలకే కాదు, దేశ ప్రజలకు గొప్ప సందేశమని ఆయన అన్నారు. మఖ్దూమ్‌సాహితీ, రాజకీయ వైభవానికి ప్రతీకగా నిలిచారని మహేష్ గారు గుర్తుచేశారు. "సింగరేణి కార్మికులతో ఆయనకు ఉన్న అనుబంధం ఎనలేనిది. బద్దం ఎల్లారెడ్డి, వెంకట్ రెడ్డి లాంటి యోధులతో కలిసి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన ఘనత మఖ్దూమ్‌ది" అని ఆయన చెప్పారు. కేవలం కవి మాత్రమే కాక, మంచి నటుడిగా కూడా మఖ్దూమ్ పేరు తెచ్చుకున్నారన్న విషయాన్ని మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రముఖ విదేశీ రచయిత జార్జ్ బెర్నార్డ్ షా నాటకాలను ఉర్దూలోకి అనువదించిన వారిలో మఖ్దూమ్ ముఖ్యులని చెప్పారు. 1974 ఫిబ్రవరి 17న ప్రారంభమైన ఈ కార్యాలయానికి మిగతా 2లో..




### ఉత్తరాదిలో స్వల్ప భూకంపం

### ఐదేళ్ల పాటు నేనే సీఎం..

స్పష్టం చేసిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

### హసీనాను అప్పగించండి

మనస్సాక్షితో నిర్ణయం తీసుకోండి..

భారత్‌కు బంగ్లాదేశ్ మరోసారి అభ్యర్థన

వార్తల వివరాలు 2 లో..

## అసెంబ్లీ సమావేశాల్లో మీడియాదే కీలకపాత్ర

### ఉభయ సభలు సజావుగా సాగడానికి సహకరించాలి

### మీడియా సలహా కమిటీ భేటీలో స్పీకర్ ప్రసాద్ కుమార్



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ఉభయ సభలు సజావుగా జరగడానికి అందరూ సహకరించాలని, ముఖ్యంగా మీడియా ప్రతినిధులు ఇందులో కీలక పాత్ర పోషించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ లేజిస్లేటివ్ మీడియా అడ్వైజరీ నూతన కమిటీ– మొదటి సమావేశం గురువారం శాసనసభ భవనంలోని కమిటీ హాల్ లో జరిగింది. ఈ సమావేశంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు, కమిటీ చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కో చైర్మన్ పరిపూర్ణాచారి,కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా కమిటీ– చైర్మన్, కో చైర్మన్ కమిటీ సభ్యులకు స్పీకర్, చైర్మన్, మంత్రి, సెక్రటరీలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ లేజిస్లేటివ్ మీడియా అడ్వైజరీ నూతన కమిటీ– చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస రెడ్డి , కో చైర్మన్ పరిపూర్ణాచారి మరియు సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మిగతా 2లో..

## 2027 నాటికి దేశంలో బుల్లెట్ రైలు



న్యూఢిల్లీ(జనంసాక్షి): రైల్వేలపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఐదేళ్లలో కొత్తగా వెయ్యి రైళ్లను పట్టాలు ఎక్కించాలని భారతీయ రైల్వే నిర్ణయించిం ది. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం న్యూఢిల్లీలో వెల్లడించారు. రానున్న ఐదేళ్లలో ఈ కొత్త రైల్వే సర్వీసులు ప్రారంభిస్తామని అన్నారు. 2027 నాటికి దేశంలో బుల్లెట్ రైలు ప్రారంభించడమే భారతీయ రైల్వే లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. రైల్వే ఎగుమతులు ద్వారా ప్రపంచంలోనే భారత్ కీలక పాత్ర పోషించనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక రైల్వే ద్వారా సరుకు రవాణాలో ఇది దేశానికే వెన్నుముకగా నిలవనుందన్నారు. గత 11 ఏళ్లలో దేశ వ్యాప్తంగా 35 వేల కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాక్‌ను నిర్మించామని వివరించారు. ఇది జర్మనీ దేశంలోని మొత్తం రైల్వే ట్రాక్‌తో సమానమని సోదాహరణగా చెప్పారు. ఒక్క ఏడాదిలోనే 5,300 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను భారతీయ రైల్వే నిర్మించిందని చెప్పారు.ఏడాదిలో 30 వేల వ్యాగిన్లు, 15వందల లోకోమోటివ్ లను భారతీయ రైల్వే తయారు చేస్తుందని పేర్కొన్నారు. ఇది ఉత్తర అమెరికా, యూరప్ తయారు మిగతా 2లో..

## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు రిమాండ్

నకిలీ పత్రాలు సృష్టించి,ఫోర్జరీ చేసినట్లు సీఐడీ ఆరోపణ

రెండేళ్లలో 170 కోట్ల గోల్‌మాల్

మల్కాజ్‌గిరి(జనంసాక్షి):హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్ష ఎన్నికలో అక్రమాల కేసులో అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు మల్కాజ్‌గిరి కోర్టు మిగతా 2లో..





## ట్రంప్‌ను చంపేస్తాం

### ఇకపై ఆయన ఫ్లోరిడా నివాసం కూడా సురక్షితం కాదు

### ఆయన సన్‌బాత్ చేసేటప్పుడు డ్రోన్‌తో దాడి చేస్తాం.. ఇరాన్ వార్నింగ్

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇకపై ఆయన ఫ్లోరిడా నివాసం కూడా సుర క్షితం కాదని ఇరాన్ పేర్కొంది. ఈసందర్భంగా ఆయన అక్కడ సన్‌బాత్ చేసే సమయంలో లక్ష్యంగా చేసుకుం టామని ఆ దేశ సీనియర్ అధికారి ఒకరు హెచ్చరిం చారు. ఇటీవల ఇరాన్ అణుకేంద్రాలపై మిగతా 9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
11.07.2025

## 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు ఆర్డినెన్స్

కలిసి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను ఆయన వెల్లడించారు."ఇవాళ్టితో కలిపి 19 క్యాబినెట్ భేటీలు నిర్వహించాం. ఇప్పటి వరకు జరిగిన భేటీల్లో 321 అంశాలను మంత్రివర్గం ఆమోదించింది. గత మంత్రివర్గ సమావేశాల్లో ఆమోదించిన అంశాల అమలుపై సమీక్ష నిర్వహించాం. ప్రతిష్ఠాత్మక అమిటీ, సెంటినరీ రిహాబిలిటేషన్ విద్యాసంస్థలకు యూనివర్సిటీ హోదా ఇచ్చేందుకు ఆమోదం తెలిపాం. ఈ వర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయిస్తారు. దేశానికే ఆదర్శంగా రాష్ట్రంలో కులగణనను విజయవంతంగా పూర్తిచేశాం" అని పొంగులేటి తెలిపారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 17వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చేందుకు జాబ్ క్యాలెండర్ సిద్ధంగా ఉందన్నారు. మార్చిలోపు లక్ష ఉద్యోగాలు ఇచ్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయించామని తెలిపారు.

## హసీనాను అప్పగించండి

ఢాకా(జనంసాక్షి):భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తమ మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం మరోసారి కోరింది.సుదీర్ఘంగా చేస్తున్న ఈ అభ్యర్థనపై న్యూదిల్లీ మనస్సాక్షితో వ్యవహరించి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఈమేరకు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనస్ పేరుతో ఆయన ప్రెస్ సెక్రటరీ సామాజిక మాధ్యమాల్లో ఓ ప్రకటన విడుదల చేశారు."షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ పలుమార్లు విజ్ఞప్తి చేస్తున్నా దీనిపై భారత్ స్పందించడం లేదు. ఈ విషయాన్ని సుదీర్ఘకాలం పొడిగించడం సబబు కాదు. మానవాళిపై నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి భారత్ రక్షణ కల్పించకూడదు. పౌరులను ఉద్దేశపూర్వకంగా హత్య చేసిన వ్యక్తులను ఏ ప్రాంతీయ బంధం, ఏ రాజకీయ వారసత్వం కాపాడలేదు. చట్టబద్ధ పాలన, ప్రజాస్వామ్య సమగ్రత ఉమ్మడి విలువను భారత్ గౌరవించాలని కోరుతున్నాం" అని యూనస్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంతటి శక్తిమంతమైన నాయకులైనా చట్టానికి అతీతం కాదని, బాధితులకు న్యాయం జరగాల్సిందేనని స్పష్టంచేశారు.విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధాని పీఠం నుంచి దిగిపోయిన షేక్ హసీనా గతేడాది ఆగస్టు 5 నుంచి బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌లో తలదాచుకుంటున్నారు. నిరసనల సమయంలో ఆమె పార్టీ అవామీ లీగ్ మద్దతుదారులైన హిందూ మైనారిటీలు, వారి ప్రార్థనా మందిరాలపై పెద్దఎత్తున దాడులు జరిగాయి. ఈ అల్లర్లలో 1400 మంది ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది.దీంతో యూనస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హసీనాపై హత్య సహా పలు అభియోగాలపై కేసులు నమోదు చేశారు. ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రైబ్యునల్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష వేసింది. కోర్టు ధిక్కరణ కేసులో ఈ తీర్పు వెలువరించింది. ఈ క్రమంలోనే ఆమెను స్వదేశానికి రప్పించేందుకు బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.

హసీనాపై తీవ్ర నేరాభియోగాలు

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మానవాళికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ గురువారం అభియోగాలు మోపింది. వీటిపై ఆగస్టు 3వ తేదీన విచారణ చేపట్టనుంది."బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా, మాజీ హోం మంత్రి అసదుజ్జామన్ ఖాన్ కమల్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చౌధ్రీ అబ్దుల్లా అల్ మమున్‌పై ఐసీటీ నేరాభియోగాలు మోపింది" అని ప్రాసిక్యూషన్ లాయర్ మీడియాకు వెల్లడించారు.విద్యార్థుల ఆధ్వర్యంలో జులై-ఆగస్టులో జరిగిన ఉద్యమాన్ని అణచివేసేందుకు ఆమె ప్రయత్నాలు చేసినట్లు ప్రాసిక్యూటర్ వెల్లడించారు. ఉద్యమకారులను భారీ సంఖ్యలో చంపించడం, హింసించడం వంటి నేరాభియోగాలు కూడా ఆమెపై ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ విచారణకు మమున్ మాత్రమే వ్యక్తిగతంగా హాజరుకానున్నారు.ఉద్యమకారులను అణచివేయమని హసీనా ఆదేశిస్తున్నట్లు చెబుతున్న ఓ ఆడియో క్లిప్‌ను పశ్చిమ దేశాలకు చెందిన మీడియా సంస్థ వెలుగులోకి తెచ్చింది. సీనియర్ పోలీసు అధికారికి ఈ ఆదేశాలు జారీ చేసినట్లు సదరు సంస్థ పేర్కొంది. గతేడాది ఆగస్టులో జరిగిన విద్యార్థి ఉద్యమం కారణంగా హసీనా ప్రభుత్వం అధికారం కోల్పోయింది. ఆ తర్వాత ఆమె భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందారు.

## అమెరికాతో వాణిజ్య చర్చల్లో పురోగతి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అమెరికాతో వాణిజ్య చర్చలు నడుస్తున్నాయని వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ గురువారం తెలిపారు. భారతదేశం-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో అగర్వాల్ ముఖ్య సంధానకర్తగా ఉన్నారు. ఇప్పటికే పలుమార్లు అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపారు. త్వరలోనే ఒక కొలిక్కి అవకాశం ఉన్నట్లు- కనిపిస్తోంది. వాస్తవానికి ట్రంప్ విధించిన డెడ్‌లైన్ గడువు జూలై 9తో ముగిసిపోయింది. అయితే కొన్ని దేశాలకు ఆగస్టు 1 వరకు గడువు పొడిగించారు. అయితే అమెరికా.. భారత్‌లో వ్యవసాయం, పాడి పరిశ్రమపై మినహాయింపులు కోరుతోంది. ఈ రెండు కూడా భారతదేశంలో చాలా సెంటిమెంట్. ఈ నేపథ్యంలోనే ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు సందిగ్ధంలో పడ్డాయి.తాజాగా ఇదే అంశంపై గురువారం రాజేష్ అగర్వాల్ స్పందించారు. ఎగుమతి లాజిస్టిక్స్‌పై జరిగిన కార్యక్రమంలో అగర్వాల్ వాణిజ్య ఒప్పందాలపై మాట్లాడారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి భారతదేశం ప్రయత్నిస్తోందని చెప్పారు.

## ఐదేళ్ల పాటు సీఎం నేనే..

బెంగుళూరు(జనంసాక్షి):కర్ణాటకలో సీఎంగా ఐదేళ్ల పాటు తానే కొనసాగుతానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తేల్చి చెప్పారు. ఓ ఆంగ్ల ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై వస్తున్న ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిగా చేయడం కోసం తనను కాంగ్రెస్ హైకమాండ్ రాజీనామా చేయమని కోరినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు."సీఎంగా నేను ఐదేళ్లూ ఉంటాను. ఈ విషయాన్ని నేను ఎప్పుడో స్పష్టంగా చెప్పాను. జులై 2వ తేదీన కూడా దీనిపై ప్రకటన విడుదల చేశాను. ఆ సమయంలో డీకే శివకుమార్ కూడా అక్కడే ఉన్నారు. ఆయన కూడా పోటీదారే. అందులో తప్పు ఏముంది. 'కుర్చీ ఇప్పుడు ఖాళీగా లేదు' అని ఆయనే అన్నారు" అని పేర్కొన్నారు.నాయకత్వం రొటేషన్‌పై పార్టీ హైకమాండ్ టైమ్‌లైన్ లేదా సూచనలు ఏమీ చేయలేదని సిద్ధరామయ్య వెల్లడించారు. రెండున్నర సంవత్సరాల అంశాన్ని ఎవరూ నిర్ణయించలేదన్నారు. హైకమాండ్ నిర్ణయం తీసుకొంటే తమకు చెబుతుందని.. వాటిని తాము అమలుచేస్తామన్నారు.

## అసెంబ్లీ సమావేశాల్లో మీడియాదే కీలకపాత్ర

ప్రజాస్వామ్యంలో కీలకమైన శాసనసభ, మండలి గౌరవం, ప్రాధాన్యతలను కాపాడుతూ మీడియా సలహా మండలి ద్వారా మీ వంతుగా సేవలను అందించడం మంచి అవకాశం అని చెప్పారు. సీనియర్ జర్నలిస్టులుగా మీరు ఎంతో అనుభవం ఉన్నవారని, ఉభయ సభలు సజావుగా జరగడానికి తమ వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందించాలని కోరారు. మనందరం కలిసి శాసనసభ, శాసనమండలి సమావేశాలు సజావుగా జరిగి, అర్థవంతమైన చర్చల జరిగే విదంగా చేయడం ద్వారా రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలని అందరి ఉద్యేశం అని వ్యాఖ్యానించారు. శాసనసభ సమావేశాల సమయంలోనే కాదు, ఇతర సమయాలలో కూడా శాసనసభ కు సంబంధించిన వార్తలకు తగు ప్రాధాన్యత ఇవ్వాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. శాసనసభ ,శాసనమండలి సమావేశాలు సజావుగా నడవాలి అంటే మీడియా పాత్రనే కీలకమని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ- సభను హుందాగా నడవడానికి అన్ని విధాలుగా సహకారం అందించాలన్నారు.

### ఈత, తాటి వనాల్లేవు.. హైదరాబాద్‌లో

# కల్లు ఎక్కడిదీ?




కలపడంతో వాటిని కూడా నిషేధించారు. ఆ తర్వాత దీనిపై పర్యవేక్షణ కొరవడటంతో కొందరు పెద్దల అండతో కల్లు వ్యాపారులు మళ్లీ తమ దందాను ప్రారంభించుకున్నారు. చెట్ల కల్లుకు బదులు ఆల్ప్రాజోలం, సోడియం బై కార్బోనైట్, డైజోఫాం, క్లోరల్ హైడ్రేట్ వం టి విషపూరిత రసాయానలు కలిపిన ద్రావ ణాన్ని కల్లుతో సీసాల్లోకి నింపి అమాయక జనానికి అలవాటు చేశారు. గతంలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్ తదితర ఉమ్మడి జిల్లాలో అనేకమంది కల్తీ కల్లుతో ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు హడావుడి చేస్తున్న అధికారులు.. కల్తీ కల్లు మాఫియాను అరికట్టడంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారు.

**వనాలు లేనిచోట యథేచ్ఛగా వ్యాపారం**

హైదరాబాద్ నగరంలో, చుట్టుపక్కల శివారు ప్రాంతాల్లో ఈత, తాటి వనాలు లేవు. గత రెండు దశాబ్దాల కింద అక్కడక్కడ కనిపించినా.. రియల్ ఎస్టేట్ వల్ల పూర్తిగా కనుమరుగయ్యాయి. ఇతర జిల్లాల నుంచి నగరానికి తీసుకొచ్చి విక్రయించడం కూడా ఎప్పుడో ఆగిపోయింది. దీంతో హైదరాబాద్‌లో కల్లు వ్యాపారులు రసాయనాలతో కూడిన కల్లును దుకాణాల్లో అమ్ముతున్నారు. దీని వెనుక బడాబడా వ్యాపారులు ఉండటంతో ఈ అడ్డగోలు వ్యాపారానికి అడ్డుకట్ట పడటం లేదనే ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. రోజుల తరబడి రసాయనాల మిశ్రమాన్ని నిల్వచేసి ఉంచడం, అమాయకులను మత్తుకు అలవాటు చేయాలనే దురుద్దేశం వల్ల కూకట్‌పల్లిలో ఇటీవల పేదల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. అయితే నగరానికి చుట్టుపక్కల తాటి వనాలు లేకున్నా కల్లు దుకాణాలకు అనుమతి ఇవ్వడంపై గతంలోనే హైకోర్టు తప్పుపట్టిన సందర్భాన్ని ఈ సందర్భంగా ప్రజాసంఘాలు గుర్తుచేస్తున్నాయి.

**అంతా కూలీలు, కార్మికులే..**

పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే కొనసాగుతున్న కల్లు దుకాణాలు.. వారి కష్టాన్ని సొమ్ముచేసుకుంటున్నాయి. అల్వాల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఇందిరాపార్క్, అంబర్‌పేట, బోరబండ, ఎస్సార్‌నగర్ వంటి ప్రాంతాల్లో బాహటంగానే దందా నడుస్తోంది. రెడిమేడ్ కల్లు వల్ల మానసిక వ్యాధులతో పాటు మత్తుకు వ్యసనంగా మారుతున్నట్టు కూడా ఎన్నో సందర్భాల్లో వెల్లడైంది. అయినప్పటికీ కల్తీ కల్లు వ్యాపారం ఎలా సాగుతోందనే ప్రశ్నలు నగరవాసుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ దుకాణాలను పూర్తిగా రద్దుచేసి మూసివేయించాలని ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## అంతా రసాయనమే..

మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌లో 31 మంది, గాంధీ ఆస్పత్రిలో ఆరుగురు చికిత్స పొందుతున్నట్లు- చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరో ఏడుగురికి చికిత్స అందిస్తున్నట్లు- చెప్పారు. మంగళవారం కూకట్‌పల్లి పరిధిలోని పలు కల్లు కాంపౌండ్‌లలో కల్తీకల్లు తాగి పలువురు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

కల్తీ కల్లులో రసాయనాలు ఉన్నట్లు గుర్తింపు

కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో ఇప్పటివరకు ఐదుగురు మృతి చెందారు. మొత్తం 37 మంది అస్వస్థతకు గురయ్యారు. నిమ్స్ ఆసుపత్రిలో 31 మందికి చికిత్స అందిస్తున్నారు. వీరిలో 27 మంది ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నలుగురికి డయాలసిస్ చేస్తున్నట్లు- చెప్పారు.కూకట్‌పల్లి కల్తీ కల్లు కేసులో ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. రెండు రోజుల క్రితమే కల్లు శాంపిళ్లను అధికారులు పరీక్షలకు పంపారు. కూకట్‌పల్లిలోని పలు కల్లు దుకాణాల నుంచి ఈ నమూనాలు సేకరించారు. ఈ క్రమంలో వాటిని ల్యాబ్‌లో పరీక్షించగా.. కాంపౌండ్‌లలో సేకరించిన కల్లులో కెమికల్స్ ఉన్నట్లు గుర్తించారు. రసాయనాలు కలిపిన కల్లు వల్లే అస్వస్థతకు గురైనట్లు అధికారులు నిర్ధరించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఏడుగురిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.

**మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు చెల్లించాలి: కేటీఆర్**

కూకట్‌పల్లిలో పరిధిలోని కల్తీ కల్లు ఘటనపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఈ ఘటన బాధాకరమన్న ఆయన.. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆస్పత్రిలో ఉన్న బాధితులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలన్నారు. ఒక్కొక్క కుటుంబానికి 20 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి మెరుగైన చికిత్స అందించాలని కోరుతున్నట్లు కెటిఆర్ తెలిపారు. కుటుంబం కోసం కాయాకష్టం చేసే కష్టజీవులు కల్తీ కల్లు బారిన పడకుండా జాగ్రత్త పడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. ఇంతమంది చనిపోతే ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా దారుణమని మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేస్తూ కేటీఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

**కల్తీకల్లు బాధితులకు 10లక్షల పరిహారం ఇవ్వాలి**
**- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు డిమాండ్**

కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు, బాధితులకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్తీ కల్లు ఘటనలో అనధికారికంగా ఆరుగురు మృతి చెందారు. ఒకటి రెండు సీసాల కల్లు తాగిన వారి కిడ్నీలు దెబ్బతిన్నాయి. కల్తీ కల్లులో సైకో ట్రాఫిక్ సబ్ స్టన్స్ కలిపినట్టు- స్పష్టంగా తెలుస్తోంది. ఎ-కై-÷-సజ్ శాఖ కల్లు కాంపౌండ్ వారితో కుమ్మక్కైంది. ఈ ఘటన మొదటిసారి కాదు.. గతంలోనూ వెలుగు చూశాయి. ఎక్సైజ్ అధికారులు రోజూ కల్లు కాంపౌండ్‌లలో తనిఖీలు చేయాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వంచర్యలు తీసుకోవాలి' అని రామచందర్‌రావు అన్నారు.

## కాంగ్రెస్, కమ్యూనిస్టుల అనుబంధం విడదీయరానిది

అప్పటి కాంగ్రెస్ మంత్రులే పునాది వేయడం మరో ప్రత్యేకతగా గౌడ్ గుర్తు చేశారు. "కాంగ్రెస్-కమ్యూనిస్టుల అనుబంధం విడదీయ రానిదని అన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం ఇద్దరు వేరు కాదని" ఆయన స్పష్టం చేశారు.కమ్యూనిస్టు భావజాలానికి మరణం లేదని, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కొదవ లేదని వ్యాఖ్యానించిన మహేష్ కుమార్ గౌడ్, "అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసి విజయాన్ని అందుకున్నాం. బలమైన లౌకిక శక్తులే దేశ భవిష్యత్‌కు భద్రత" అని గుర్తు చేశారు.ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న ఫాసిస్టు పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. "తమ పదవులను కాపాడుకునేందుకు ఫాసిస్టు శక్తులు ఎంత దూరమైనా వెళ్తున్నాయి. విద్యావంతులు సైతం హిందూత్వ కార్డును ఉపయోగించడం శోచనీయం. లౌకికత గురించి మాట్లాడితే అర్బన్ నక్సల్స్ అంటారు. ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడితే దేశద్రోహులమంటారు. ఇదే వారి తత్వం" అని ఉద్ఘాటించారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే ప్రయత్నం చేస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. "మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్రానికి మానవత్వం లేకుండా సీజ్ ఫైర్ దాడులకు పాల్పడటం దారుణం. ఇందులో మహిళలు, పిల్లలు ప్రాణాలు కోల్పోయారు" అన్నారు. ఆపరేషన్ కగార్ పై రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడిన మరుసటి రోజే తనపై అర్బన్ నక్సలైట్, దేశద్రోహి ముద్ర వేయడం వెనుక కుట్రలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.సంఘటితంగా పోరాడాల్సిన సమయం ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని మళ్ళీ మిత్రపక్షాలకు గుర్తు చేశారు. "దేశ భవిష్యత్‌ను రక్షించాలంటే లౌకిక వాద శక్తులు బలపడాలి. ప్రజల హక్కులను కాపాడేందుకు పార్టీ, భావజాల భేదాలు మరిచి ముందుకు రావాలి" అని టిపిసిసి చీఫ్ పిలుపునిచ్చారు.

## మల్నాడు డ్రగ్ పార్టీ కేసులో దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్,: మల్నాడు రెస్టారెంట్ డ్రగ్ పార్టీ కేసులో ఈగిల్ టీమ్ దర్యాప్తును ముమ్మరం చేసింది. 9 పబ్స్ పైన ఈగల్ కేసులు నమోదు చేసింది. ఇప్పటికే, పబ్బుల యజమానులకు నోటీసులు జారీ చేసింది. వచ్చే వారం తమ ఎదుట హాజరు కావాలని పబ్బు యజమానులకు నోటీసులు అందజేశారు. మల్నాడు రెస్టారెంట్ సూర్యతో ముగ్గురు పబ్ యజమానులతో సంబంధాలు ఉన్నట్లు- సమాచారం. మూడు పబ్స్ యజమాలతో కలిసి డ్రగ్ పార్టీలు నిర్వహించినట్లుగా ఈగల్ టీమ్ గుర్తించింది. అయితే, పబ్బుల్లో డ్రగ్స్ పార్టీ కోసం ప్రిజం పబ్, ఫామ్ పబ్, బర్డ్ బాక్స్ పబ్, బ్లాక్ 22 పబ్, వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్స్ కు చెందిన యాజమాన్యాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. అయితే, వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్, బ్రాడ్ వే యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. క్వాక్ పబ్ రాజా శేఖర, కోరా పబ్ పృధ్వి వీరమాచినేని, బ్రాడ్ వే పబ్ ఓనర్ రోహిత్ మాదిశెట్టిలపై కేసు నమోదు చేసినట్లు- తెలిపారు.

## కేసీఆర్ మళ్లీ వైద్య పరీక్షలు

హైదరాబాద్(జనంసాక్షి): మాజీ సీఎం, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చేరారు. వైద్యుల సూచన మేరకు ఆయన అడ్మిట్ అయ్యారు.కేసీఆర్‌కు మరోసారి డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తున్నారు.ఈ నెల 3న కూడా ఆయన యశోద ఆసుపత్రిలో చేరారు. అప్పుడు బ్లడ్ షుగర్, సోడియం స్థాయిలు మానిటర్ చేయడానికి రెండ్రోజులు ఆసుపత్రిలోనే ఉండాలని వైద్యులు సూచించారు. ఆరోగ్యం కుదుటపడటంతో ఈనెల 5న డిశ్చార్జి అయ్యారు. వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని, తర్వాత తర్వాత పరీక్షలు చేయాల్సి ఉంటుందని డిశ్చార్జి సమయంలో వైద్యులు తెలిపారు. ఈక్రమంలో వైద్య పరీక్షల కోసం కేసీఆర్ మళ్లీ యశోద ఆసుపత్రిలో చేరారు.

## 2027 నాటికి దేశంలో బుల్లెట్ రైలు

చేస్తున్న రైల్వే వ్యాగిన్ల కంటే అధికమన్నారు. మరోవైపు భారతీయ రైల్వేలో పెట్టుబడులు రూ. 2 వేల కోట్ల నుంచి రూ. 2.25 లక్షల కోట్లు ఏగబాకాయని చెప్పారు. అందులో రూ. 20 వేల కోట్లు.. పీపీపీ ద్వారా అదనంగా వచ్చాయని ఆయన వివరించారు. జపాన్ సహకారంతో బుల్లెట్ రైలు తయారు చేస్తున్నామన్నారు. ఇది 2026 నాటికి పూర్తవుతుందని భావిస్తున్నామని తెలిపారు. 2027లో దీనిని ప్రారంభిస్తామన్నారు. ఇక ఏడాదిలో రైళ్లు పట్టాలు తప్పిన ఘటనలు 170 నుంచి 30కి తగ్గాయన్నారు. మొత్తంగా పరిశీలిస్తే.. రైలు ప్రమాదాలు 80 శాతం మేర తగ్గాయని వివరించారు. ట్రాకులు అప్‌గ్రేడ్ చేయడం.. పాయింట్స్, సిగ్నలింగ్ వ్యవస్థలను ప్రతి రోజు సమీక్షించడం ద్వారా ఈ ప్రమాదాల నివారించడం సాధ్యమైందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు.

## ఉత్తరాదిలో స్వల్ప భూకంపం

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తరాదిలో పలు ప్రాంతాల్లో స్వల్ప భూకంపం వచ్చింది. గురువారం ఉదయం 9.04 గంటలకు ఢిల్లీ-ఎన్‌సీఆర్‌తోపాటు దాని సరిహద్దుల్లో ఉన్న రాష్ట్రాల్లో భూమి కంపించింది. దీని తీవ్రత 4.4 గా ఉన్నదని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం హర్యానాలోని జజ్జర్‌లో ఉన్నదని తెలిపింది. భూమి అంతర్భాగంలో 10 కిలోమీటర్లలోతులో ప్రకంపనలు సంభవించాయని పేర్కొంది. భూకంపంతో భయందోళనలకు గురైన ప్రజలు రోడ్లపైకి పరుగులు తీశారు. ఢిల్లీ రాజధాని పరిధిలోని నోయిడా, గజియాబాద్‌తోపాటు- హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లో కూడా భూమి కంపించిందని అధికారులు వెల్లడించారు. ఇలా ఉత్తర భారత వాసులను భూకంపం వణికించింది. దేశ రాజధాని దిల్లీ, ఎన్‌సీఆర్ సహా పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం భూప్రకంపనలు సంభవించాయి. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. హరియాణాలోని ఝజ్జర్‌కు ఈశాన్యాన 3 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు- జాతీయ భూకంప కేంద్రం వెల్లడించింది. ఈ ప్రాంతం పశ్చిమ దిల్లీకి కేవలం 51 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. దీంతో దేశ రాజధానిలో ప్రకంపనలు భారీగానే చోటుచేసుకున్నాయి. రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లోనూ భూమి కంపించింది. గతంతో పోలిస్తే ఈసారి ప్రకంపనల తీవ్రత కాస్త ఎక్కువగానే ఉన్నట్లు- తెలుస్తోంది.

# ఈసీ నిర్ణయం సమర్థనీయమే

**- రాజ్యాంగం ప్రకారమే ముందుకెళ్తోంది**
**- బిహార్ ఓట్ల వ్యవహారంపై సుప్రీం సమర్థన**

ఒక వ్యక్తి ఓటును కోల్పోతే.. దాని గురించి అడిగేందుకు సదరు వ్యక్తికి సమయం ఉండదు. ఒకసారి ఓటర్ల జాబితా ఖరారైన తర్వాత కోర్టులు ఆ అంశం జోలికి వెళ్లవు. ఓటు కోల్పోయిన వ్యక్తి ఎన్నికల ముందు ఆ సవరించిన జాబితాను సవాలు చేసేందుకు వీలు ఉండదు. ఇలాంటి ప్రక్రియతో మన దేశ పౌరులు కాని వారికి ఆ జాబితా చోటు ఉండదు. ఇది రాజ్యాంగబద్ధమే అయినప్పటికీ.. మీరు ఈ సవరణ నిర్వహిస్తోన్న సమయమే ఇక్కడ ప్రశ్నార్థకంగా మారింది. దీనిని ఎన్నికలతో సంబంధం లేకుండా వేరుగా నిర్వహించాలి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా కోర్టు మూడు ప్రశ్నలు సంధించింది. ఈ ప్రక్రియ నిర్వహించడానికి ఈసీకి ఉన్న అధికారం.. ఈ సవరణ ప్రక్రియ చెల్లుబాటు.. నిర్వహిస్తున్న సమయంపై వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది.దాదాపు 20 ఏళ్ల క్రితం ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగింది. ఈ క్రమంలో మరోసారి సవరణలు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. ఎన్నికల సంఘం ఎంచుకున్న సమయంపై కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన బిహార్‌నే తొలుత ఎంచుకోవడం విమర్శలకు తావిస్తోంది. ముస్లింలు, వలస కార్మికులు, దళితులను ఓటర్ల జాబితా నుంచి మినహాయించేందుకే కేంద్రం కనుసన్నల్లో ఈసీఐ ఈ వ్యూహాన్ని అమలుచేస్తోందని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా బ్లాక్ ఆరోపిస్తోంది. అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థ ఈసీఐ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. తాజాగా విచారణ జరిగింది. ఇదే అంశంపై సుప్రీంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

ఆధార్‌నూ పరిగణించాలి

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు గురువారం సుప్రీంకోర్టు అనుమతించింది. ఎస్ఐఆర్‌ను నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరించింది. ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఎన్నికల సంఘం జారీ చేసిన ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. వెరిఫికేషన్ కోసం పరిశీలించాలనుకుంటున్న 11 పత్రాల్లో ఆధార్, ఓటర్ ఐడీ కార్డులను చేర్చకపోవడం వివాదాస్పదమైంది. ఎన్నికల సంఘం ప్రస్తావించిన ఆ పత్రాలు సమగ్రంగా లేవని తాజాగా అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. "ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను పరిగణనలోకి తీసుకోవడం న్యాయబద్ధమైందని మా అభిప్రాయం. వాటిని పరిగణించాలా..?లేదా..? అన్నది ఎన్నికల సంఘమే నిర్ణయించాలి. ఒకవేళ తీసుకోకపోతే అందుకు గల కారణాలను వెల్లడించాలి" అని సుప్రీం పేర్కొంది. ఈసీని అనుమానించడానికి ఏమీ లేదని, ఈ అంశంపై మరింత విచారణ జరగాల్సి ఉందని వ్యాఖ్యానించింది. అలాగే తదుపరి విచారణను జులై 28కి వాయిదా వేసింది. జులై 21కి కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ఈసీని ఆదేశించింది.ఇదే అంశంపై గురువారం ఉదయం జరిగిన విచారణలో కొన్ని ప్రశ్నలు సంధించింది. "ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పు లేదు. అయితే.. ఇక్కడ సమస్యంతా చేపడుతున్న సమయం.. దాని చెల్లుబాటు గురించే. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఒక వ్యక్తి ఓటును కోల్పోతే.. దాని గురించి అడిగేందుకు సదరు వ్యక్తికి సమయం ఉండదు. ఆ సవరించిన జాబితాను సవాలు చేసేందుకు వీలు ఉండదు. అలాగే ఈ ప్రక్రియ నిర్వహించడానికి ఈసీకి ఉన్న అధికారం.. ఈ సవరణ ప్రక్రియ చెల్లుబాటు.. నిర్వహిస్తున్న సమయంపై వివరణ ఇవ్వాలి" అని ఆదేశించిన సంగతి తెలిసిందే.

## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు రిమాండ్

జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. ఆయన్ను అరెస్టు చేసినట్లు సీఐడీ గురువారం ఉదయం ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరుతో జగన్మోహన్‌రావు నకిలీ పత్రాలు సృష్టించినట్లు సీఐడీ ఆరోపిస్తోంది. గౌలిపురా క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్ సంతకాన్ని శ్రీచక్ర క్లబ్ ప్రెసిడెంట్ కవిత ఫోర్జరీ చేసి ఆ పత్రాలను జగన్మోహన్‌కు అందించారు. ఆ పత్రాలను ఉపయోగించి జగన్మోహన్‌రావు హెచ్‌సీఏ అధ్యక్షుడైనట్లు సీఐడీ చెబుతోంది.కాగా అంతకుముందు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహన్‌రావు అరెస్టుపై సీఐడీ ప్రకటన చేసింది. శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరుతో జగన్మోహన్‌రావు నకిలీ పత్రాలు సృష్టించారు.గౌలిపురా క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్ సంతకాన్ని శ్రీచక్ర క్లబ్ ప్రెసిడెంట్ కవిత ఫోర్జరీ చేసి ఆ పత్రాలను జగన్మోహన్‌కు అందించారు. ఆ పత్రాలను ఉపయోగించి జగన్మోహన్‌రావు హెచ్‌సీఏ అధ్యక్షుడయ్యారు. ఆ తర్వాత నిధుల దుర్వినియోగం జరిగిందని టీసీఏ అధ్యక్షుడు గురువారెడ్డి ఫిర్యాదు చేశారు. జగన్మోహన్‌రావుకు హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాసరావు, సీఈవో సునీల్ సహకరించినట్టు సీఐడీ గుర్తించింది. దీంతో హెచ్‌సీఏ అధ్యక్షుడితో పాటు శ్రీనివాసరావు, సునీత్, రాజేందర్ యాదవ్, కవితను అరెస్టు చేసినట్టు సీఐడీ తెలిపింది.

**హెచ్‌సీఏలో రెండేళ్లలో 170 కోట్ల గోల్‌మాల్**

హెచ్‌సీఏలో రెండేళ్లలో 170 కోట్ల రూపాయలు గోల్‌మాల్ జరిగినట్లు సీఐడీ గుర్తించింది. ప్లేయర్స్ ఎంపికలో అవినీతి చేసినట్లు సీఐడీ విచారణలో వెల్లడైంది. హెచ్‌సీఏ సభ్యులు ప్లేయర్స్ తల్లిదండ్రులు నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. హెచ్‌సీఏలో చెక్ పవర్‌ను దుర్వినియోగం చేసినట్లు- తేలింది. బీసీసీఐ ద్వారా వచ్చిన నిధుల్లో గోల్‌మాల్ జరిగిందని సీఐడీ పేర్కొంది.హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావును తెలంగాణ సీఐడీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2025 సమయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో టికెట్ల వివాదం నేపథ్యంలో చేపట్టిన దర్యాప్తులో ఆర్థిక అక్రమాలు వెలుగుచూడటంతో.. జగన్‌మోహన్‌ని సీఐడీ అదుపులోకి తీసుకుంది. జగన్‌మోహన్‌తోపాటు- హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాస్ రావు, సీఈవో సునీల్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ యాదవ్, ఆయన భార్య కవితలను సీఐడీ అరెస్ట్ చేసి విచారించింది. ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎస్‌ఆర్‌హెచ్ నుంచి కాంప్లిమెంట్రీ- పాస్‌లను సైతం బ్లాక్‌లో అమ్ముకొని నిందితులు సొమ్ము చేసుకున్నారు. క్రీడాకారుల కోసం ఉపయోగించాల్సిన కాంప్లిమెంటరీ పాస్‌లలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని తేలింది. ఎస్‌ఆర్‌హెచ్‌పై జగన్మోహన్ రావు వేధింపుల వ్యవహారంలో యాజమాన్యం స్టేట్‌మెంట్‌ను సీఐడీ రికార్డ్ చేసింది. ఐపీఎల్ 2025 టికెట్ల కోసం జగన్మోహన్ రావు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు- ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎస్‌ఆర్‌హెచ్,హెచ్‌సీఏ మధ్య టికెట్ల వివాదం నెలకొనడంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ జరిపి నివేదిక ఇచ్చింది.

**యెమెన్‌లో కేరళ నర్సుకు మరణశిక్ష..**

## కేసును విచారించేందుకు సుప్రీం అంగీకారం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**యెమెన్‌లో వ్యాపార భాగస్వామిని హత్య చేసిన కేసులో కేరళ నర్సు నిమిష ప్రియకు మరణశిక్ష పడిన సంగతి తెలిసిందే. ఈనెల 16న ప్రియకు ఉరిశిక్ష అమలుకానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుపై నమోదైన పిటిషన్‌ను విచారించేందుకు తాజాగా అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది.మరణశిక్ష నుంచి నిమిషను రక్షించేందుకు దౌత్య మార్గాన్ని ఉపయోగించాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీం లో పిటిషన్ దాఖలైంది. తాజాగా ఈ పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది. దీనిపై తదుపరి విచారణ ఈనెల 14న ఉండనున్నట్లు తెలిపింది.

## ఇందిరమ్మ ఇళ్లలో ఎంపీ కోటా పెట్టాలి

**సిఎం రేవంత్‌కు రఘునందన్ లేఖ**

**హైదరాబాద్(జనంసాక్షి):**ఇందిరమ్మ ఇళ్లలో ఎంపిలకు వాటా ఇవ్వాలని కోరుతూ..సీఎం రేవంత్‌రెడ్డికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు బహిరంగ లేఖ రాశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకు కూడా 40 శాతం కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేల మాదిరిగానే ఎంపీలు కూడా ప్రజల చేత ఎన్ని-కై-న ప్రజాప్రతినిధులే అని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా 17 మంది ఎంపీలకూ అవకాశం కల్పించాలని కోరారు. లబ్ధిదారుల ఎంపికలో సహేతుకత పెరగడానికి ఇది దోహదపడుతుందన్నారు.

## భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు..

### రూ.10వేల జరిమానా

**హైదరాబాద్‌ (జనంసాక్షి) :** బంజారాహిల్స్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో నమోదైన హత్య కేసులో భర్త సయ్యద్‌ అక్రమ్‌ (40)కు నాంపల్లి జిల్లా కోర్టు జడ్జి సురేష్‌ జీవితఖైదు విధిస్తూ తీర్పు ప్రకటించారు. ఫస్‌లాన్‌సర్‌ ప్రాంతంలో నివసిస్తున్న ఇంటిలో తన భార్యను అనుమానించి రోకలితో తలపై బాదడంతో ఆమె మృతి చెందినట్టు విచారణలో తేలడంతో నిందితుడిపై శిక్షలు ఖరారు చేసింది. ముగురు పిల్లల్ని స్కూలు దగ్గర దించి వస్తున్న సమయంలో నిందితుడు రోకలితో తన భార్యకు ఎదురుగా వెళ్లి తలపై బాదడంతో అక్కడికక్కడే మరణించిందని, 2016లో మృతిరాలి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌.వేంకట్‌రెడ్డి ఏసీపీ సమక్షంలో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విచారణాధికారి కె.ఎమ్‌.రాఘవేంద్ర సాక్షుల వాంగ్మూలాల్ని నమోదు చేసి చార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించారు. తొమ్మిదేండ్ల క్రితం నిందితుడితో వివాహం జరిగిందని, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని ఫిర్యాదులో తెలిపారు. భార్యను అనుమానించి పలుమార్లు కొట్టేవాడని ఫిర్యాదులో తెలిపారు. సుదీర్ఘ విచారణ చేపట్టిన కోర్టు ఫోరెన్సిక్‌ రిపోర్టులు, సాక్షుల వాంగ్మూలం ఆధారంగా నిందితుడుపై నేరం రుజువు కావడంతో శిక్షలు ఖరారు చేసింది. అదేవిధంగా రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పులో పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని సూచించింది.

## ఢిల్లీకి చేరిన కర్నాటకం

### తానే ఐదేళ్లు సిఎంగా ఉంటానని సిద్దూ ప్రకటన

**న్యూఢిల్లీ, జూలై10 (జనంసాక్షి) :** కర్నాటకం ఢిల్లీకి చేరింది. ఢిల్లీలో సిఎం మార్పుపై ఊహాగానాలు చెలరేగాయి. ఈ క్రమంలో సీఎంగా ఐదేళ్ల పాటు– తానే కొనసాగుతానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తేల్చి చెప్పారు. కర్నాటకలో నాయకత్వ మార్పుపై వస్తున్న ఊహాగాహానాలను కొట్టిపారేశారు. ప్రస్తుతానికి కర్నాటక సీఎం కుర్చీ ఖాళీ లేదన్నారు. డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేయడం కోసం తనను కాంగ్రెస్‌ హైకమాండ్‌ రాజీనామా చేయమన్నట్లు– జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని చెప్పారు. నాయకత్వం రొటేషన్‌పై పార్టీ హైకమాండ్‌ టైంలైన్‌ లేదా సూచనలు ఏవీ చేయలేదని సిద్ధరామయ్య వెల్లడించారు. తాను రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్‌ కోరారని, అయితే ఇప్పటివరకూ దానిపై ఎలాంటి కన్ఫర్మేషన్‌ లేదని ఆయన తెలిపారు.

### ఆపరేషన్‌ కగార్‌పై మాట్లాడితే

# అర్బన్‌ నక్సల్‌ అన్నారు

### పిసిసి చీఫ్‌ మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ ఆవేదన



**హైదరాబాద్‌, జూలై10 (జనంసాక్షి) :** ఆపరేషన్‌ కగార్‌పై రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో మాట్లాడిన వెంటనే తనపై అర్బన్‌ నక్సలైట్‌, దేశద్రోహి ముద్ర వేశారని తెలంగాణ ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సీపీఐ మఖ్దూమ్‌ కార్యాలయ పునఃప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మహేశ్‌ గౌడ్‌ మాట్లాడుతూ, మఖ్దూమ్‌ తెలుగు నేలపై జన్మించిన గొప్ప కమ్యూనిస్టు నేత అని కొనియాడారు. సింగరేణి కార్మిక ఉద్యమంతో ఆయనకు ఆత్మీయ సంబంధం ఉందని తెలిపారు. 1974 ఫిబ్రవరి 17న జరిగిన ఈ కార్యాలయ పునాది కార్యక్రమానికి అప్పటి కాంగ్రెస్‌ మంత్రులు హాజరయ్యారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌–కమ్యూనిస్టుల అనుబంధం విడదీయరానిదని స్పష్టంచేశారు. నేను ఎప్పటినుంచో కమ్యూనిస్టు భావజాలానికి మద్దతుగా ఉన్నాను. ఈ దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం నిలదొక్కుకోవాలంటే లెఫ్ట్‌ శక్తులు బలపడాలి. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌తో పాటు–కమ్యూనిస్టులతో కలిసి విజయాన్ని సాధించాం అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించిన ఆయన, ఆపరేషన్‌ కగార్‌ పేరుతో ఆదివాసీ భూసంపదను కార్పొరేట్‌ కంపెనీలకు దక్కించేందుకు ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినా, కేంద్రం మానవతా దృక్పథంతో కాకుండా మారణయత్నాలతో ముందుకు వెళుతోంది. ఇది బాధాకరం అని అన్నారు. ఇక ఎలక్షన్‌ కమిషన్‌ వ్యవహారాలపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని వ్యక్తులకు లాభం చేకూర్చే విధంగా ఈ సంస్థ మారిందని, ఇది ప్రజాస్వామ్యానికి శోచనీయ పరిణామమని విమర్శించారు.

## పెన్షన్‌ డబ్బుల కోసం కిరాతకం

### తల్లిని బండరాయితో మోది హత్య

**నిజామాబాద్‌, జూలై10 (జనంసాక్షి) :** పింఛన్‌ డబ్బుల కోసం తల్లిని ఓ దుర్మార్గ కుమారుడు హత్య చేసాడు. ఈ సంఘటన నిజామాబాద్‌ జిల్లాలోని వర్ని పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మోస్రా మండలం జలాల్పూర్‌ గ్రామానికి చెందిన గొల్ల సాయవ్వ (57) కుమారుడు గొల్ల సాయిలు తల్లి పింఛన్‌ డబ్బుల విషయంలో గొడవ పడి డబ్బుల ఇవ్వకపోవడంతో తల్లిని బండరాయితో తల, ఛాతి, కడుపు మీద బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఇది గమనించిన చుట్టుపక్కల కాలనీవాసులు 108 అంబులెన్స్‌కు ఫోన్‌ చేయగా సాయవ్వను బోధన్‌ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లి వైద్యులు పరీక్షించగా ఆమె అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలి చెల్లెలు కొడుకు జెట్టి మహేష్‌ పోలీసులకు ఫిర్యాదు మేరకు వర్ని ఎస్‌ఐ మహేష్‌ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### బిక్కేరు వాగు నుంచి ఇసుక తరలించొద్దని

# ఎడ్ల బండ్లతో నిరసన



**మోత్కూరు (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరిట బిక్కేరు వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తే ఊరుకునేది లేదని, అవసరమైతే ప్రాణ త్యాగాలకైనా తాము సిద్ధమేనంటూ మోత్కూరు మండలంలోని కొండగడప గ్రామ రైతులు ఆందోళన చేశారు. గురువారం తాసీల్దార్‌ కార్యాలయం ఎదుట ఎడ్ల బండ్లతో వినూత్నంగా నిరసన తెలిపారు. బిక్కేరు వాగు నుంచి ఇసుకను తరలించకూడదంటూ 2022లో హైకోర్టు ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. ఆ ఉత్తర్వులను ఉల్లంఘించి తాసీల్దార్‌ జ్యోతి అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధుల అండదండలతో ఇసుక తరలింపునకు అనుమతులిచ్చిందని, ఆ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని గ్రామ రైతులు డిమాండ్‌ చేశారు.

జీవనోపాధి కోసం తాము ఎడ్ల బండ్లను కొనుగోలు చేసి ఇసుక బాడుగ చేసుకుని బతుకుతున్నట్లు తెలిపారు. తమను కాదని ట్రాక్టర్లతో ఇసుకను తరలించొద్దని కోరారు. ఇసుకను ఇందిరమ్మ ఇండ్ల పేరిటి ఒక్క ట్రిప్పుకు అనుమతులను తీసుకుని 10 ట్రిప్పులను తరలిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో ట్రిప్పుకు రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లకు ట్రాక్టర్లతో ఇసుక తరలింపు అనుమతిని తాసీల్దార్‌ విరమించుకోవాలని పేర్కొన్నారు.

### బీఆర్‌ఎస్‌ మద్దతు

బిక్కేరు వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్లతో తరలించొద్దని, ఎడ్లబండ్ల ద్వారానే ఇందిరమ్మ ఇండ్లకు అనుమతులు ఇవ్వాలని బీఆర్‌ఎస్‌ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను, విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా కన్వీనర్‌ ఎడ్ల నరేశ్‌ అన్నారు. తాసీల్దార్‌ కార్యాలయం వద్ద ఎడ్ల బండ్లతో రైతుల ఆందోళనకు వారు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరిట ఇసుక మాఫియాను ప్రోత్సహిస్తోందన్నారు. రైతు వ్యతిరేక నిర్ణయాలపై బీఆర్‌ఎస్‌ పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు తొంట శ్రీనివాస్‌, బుంగ భిక్షం, ముత్యాలు, ఉప్పలయ్య, ఎల్లయ్య, ఎల్‌.నరేశ్‌, భాస్కర్‌, తొంట గిరి, లింగస్వామి, యెర్రవెల్లి నర్సయ్య,లొడంగి మల్లేశ్‌, దండేబోయిన మల్లయ్య, యాకస్వామి, రాములు, మధు పాల్గొన్నారు.

## ప్రశ్నించిన డాక్టర్లను సస్పెండ్‌ చేయడం సిగ్గుచేటు

**విద్యార్థుల స్టైఫండ్‌ ఇవ్వకపోవడంపై సమాధానం చెప్పాలి...**

**మెడికల్‌ కాలేజీ వద్ద తీన్మార్‌ మల్లన్న టీం ధర్నా...**

**ఆందోళనలో టీం సభ్యులను అరెస్టు చేసిన పోలీసులు..**



**కరీంనగర్‌ (జనంసాక్షి) :** కరీంనగర్‌ మున్సిపాలిటీ పరిధిలోని బొమ్మకల్‌ గ్రామ శివారు చల్మెడ ఆనందరావు మెడికల్‌ కాలేజీ లో చదువుకుంటున్న ట్రైనీ విద్యార్థులకు రావలసిన స్టైఫండ్‌ ఇవ్వాలని గత నెల ఒకటవ తేదీన డక్టర్స్‌ దినోత్సవ రోజు సందర్భంగా యజమాన్యాన్ని అడిగినందుకు 62 మంది జూనియర్‌ సర్జన్లను సస్పెండ్‌ చేయడం జరిగింది. ఈ ఘటనపై స్పందించిన ఎమ్మెల్సీ తీన్మార్‌ మల్లన్న తన టీం కి ఇచ్చిన ఆదేశాల మేరకు కరీంనగర్‌ జిల్లా తీన్మార్‌ మల్లన్న టీం తో కలిసి కరీంనగర్‌ జిల్లా అధ్యక్షుడు అఖిల్‌ పాషా చల్మెడ ఆనందరావు ఆసుపత్రి ముందు నిరసనకు దిగారు. నిరసనలో ట్రైనీ వైద్యులపై వేసిన సస్పెండ్‌ ను వెంటనే ఎత్తివాలని, వారికి రావాల్సిన స్టైఫండ్‌ ప్రతి నెల కేటాయించాలని, ప్రశ్నిస్తే సస్పెండ్‌ చేయడం యాజమాన్యానికి సిగ్గుచేటని నినాదాలు పలికారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు అఖిల్‌ పాషా మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు రావాల్సిన స్టైఫండ్‌ పైసలు మెడికల్‌ కాలేజీ యాజమాన్యం మింగేయడం సిగ్గుచేటని అన్నారు. గత కొన్నేళ్లుగా ఓపిక పట్టిన ట్రైనీ డాక్టర్లు డాక్టర్ల దినోత్సవం రోజు స్టైఫండ్‌ చెల్లించాలని అడిగితే జూనియర్‌ సర్జన్లను సస్పెండ్‌ చేయడం ఎంత వరకు సరైనది అన్నారు. పైగా విద్యార్థులు మీడియాను సంప్రదిస్తే ఎగ్జామ్స్‌ అయ్యాక సర్టిఫికెట్లు ఇవ్వమని డాక్టర్లు అయ్యుండి గుండాలలాగ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించే తత్వాన్ని అనగదొక్కే అధికారం మికేవారిచ్చారని అడుగుతూ గత కొన్నేళ్లుగా ట్రైనీ డాక్టర్లకు రావాల్సిన స్టైఫండ్‌ మొత్తాన్ని అక్రమంగా కాజేస్తున్నారని పోలీసులకు తెలుపుతూ ఇట్టి సంఘటనపై పోలీసులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కరీంనగర్‌ నగర నడిబొడ్డున వైద్య విద్యార్థులకు ఇంతటి అవమానం జరిగినా కూడా ఇంతవరకు ప్రతిపక్షాలు కానీ, పాలక పక్షం కానీ, విద్యార్థి సంఘాలు ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. నాయకులు, సంఘాలు కాలేజి యమాన్యం సంకలు నకుతున్నారా లేదా డబ్బులకు అమ్ముడుపోయారా అని మండిపడ్డారు. డాక్టర్లను సస్పెండ్‌ చేసి వారి ఆత్మగౌరవాన్ని భంగం కలిగించిన చెల్మెడ యాజమాన్యం సస్పెండ్‌ కు గల కారణాన్ని తెలియజేయాలని అన్నారు. ఇప్పటికైనా కాలేజి యాజమాన్యం బేషరతుగా జూనియర్‌ సర్జన్లను క్షమాపణ కోరాలని, వెంటనే వారిపై విధించిన సస్పెండ్‌ ను ఎత్తివేసి, వారికి రావాల్సిన స్టైఫండ్‌ మొత్తాన్ని ప్రతి నెల అందజేయాలని అన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో సస్పెండ్‌ కు గురైన విద్యార్థులతో కలిసి మెడికల్‌ కాలేజిని చుట్టుముడుతామని ఆయన హెచ్చరించారు. నిరసన ఉద్రిక్తం కావడంతో అక్కడికి భారీగా చేరిన పోలీసులు నిరసన చేస్తున్న తీన్మార్‌ మల్లన్న టీం సభ్యులను అరెస్టు చేసి స్థానిక రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ కి తరలించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బూత్కూరి మధు, భూతం నాగరాజు, ఉపాధ్యక్షులు ఓర్సు రాజు, దురిశెట్టి చెందు టీం సభ్యులు సిరిసిల్ల అంజయ్య, అనిల్‌, గణేష్‌, వసీం ఖాన్‌, సాయి తదితరులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లలో నెరవేరని లక్ష్యం

### ఉద్యోగుల నిర్లక్ష్యంతో దక్కని ఫలితం

**హైదరాబాద్‌, జూలై10 (జనంసాక్షి) :** పన్నులపై వడ్డీలమీద వడ్డీల భారం పడడంతో, ఇంటిపన్నుల వసూళ్లు మందగించాయి. గ్రామాలు, పట్టణాల్లో ఇంటిపన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. పట్టణాలు విస్తరించడం,కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పడ్డా ప్రజల ఆదాయవనరులు పెరగడం లేదు. దీంతో పట్టణాల్లో వ్యాపారాలు చితికి పోతున్నాయి. పురపాలికలు రోజు రోజుకు విస్తరిస్తుండగా, ఆ మేరకు ఆదాయం రావడం లేదు. పట్టణం అభివృద్ధి చెందడంతో పాటు ఓవైపు మాల్స్‌, వ్యాపార సముదాయాలు, మరోవైపు ఇళ్ల నిర్మాణాలు పెరుగుతున్నాయి. కానీ ఆ స్థాయిలో ఆదాయం మాత్రం పెరగడం లేదని అంటున్నారు. మున్సిపాలిటీల పరిధిలోని దుకాణాల విషయంలో కొందరు అద్దె చెల్లిస్తుండగా, మరికొందరు పెండింగ్‌లో పెట్టడంతో మునిసిపల్‌ ఆదాయం దెబ్బతింటోంది. లీజుకు తీసుకున్న వారు పెద్ద మొత్తంలో సబ్‌ లీజుకు దుకాణాలను ఇచ్చుకుంటున్నారు. దీనివల్ల కూడా రావలసిన ఆదాయం రాకుండా పోతోంది. మునిసిపాలి టీకి పన్నుల వసూలు కూడా అంతంత మాత్రంగానే ఉంది. పన్ను వసూళ్ళలో నిర్లక్ష్యం వహించడం వంటి కారణాల వల్ల మునిసిపాలిటీకి రావాల్సిన మేర ఆదాయం రావడం లేదని తెలుస్తోంది. మాల్స్‌, వ్యాపార సముదాయాలు, ఇళ్ల నిర్మాణాలు విస్తరిస్తుండటంతో పట్టణం రోజురోజుకు పెరుగుతోంది. అయితే ఆ స్థాయిలో ఆదాయం మాత్రం రావడం లేదు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు సమకూర్చా లంటే పన్నుల రూపంలో ప్రజలు ఆదాయం చెల్లించాల్సి ఉంది. అధికార యంత్రాంగం నిర్లిప్తత, కింది స్థాయి ఉద్యోగుల ఉదాసీనత కారణంగా సరైన అస్సెస్‌మెంట్‌ చేయకపోవడం వల్లే పట్టణం పరిగినంత వేగంగా ఆదాయం పెరగడం లేదని తెలుస్తోంది.

## జగన్మోహన్‌ రావు తదితరులకు రిమాండ్‌

### చర్లపల్లి జైలుకు తరలించిన పోలీసులు

**హైదరాబాద్‌, జూలై10 (జ.నంసాక్షి) :** హైదరాబాద్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ (హెచ్‌సీఏ) అధ్యక్ష ఎన్నికలో అక్రమాల కేసులో అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో పాటు మరో నలుగురికి మల్కాజ్‌గిరి కోర్టు జ్యుడిషియల్‌ రిమాండ్‌ విధించింది. వారిని అరెస్టు చేసినట్లు సీఐడీ గురువారం ఉదయం ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. జగన్మోహన్‌రావు, శ్రీనివాస్‌రావు, సునీల్‌, రాజేందర్‌ యాదవ్‌, కవితకు వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్‌ విధించింది. శ్రీచక్ర క్రికెట్‌ క్లబ్‌ పేరుతో జగన్మోహన్‌రావు నకిలీ పత్రాలు సృష్టించినట్లు సీఐడీ ఆరోపిస్తోంది. గౌలిపురా క్రికెట్‌ క్లబ్‌ ప్రెసిడెంట్‌, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్‌ సంతకాన్ని శ్రీచక్ర క్లబ్‌ ప్రెసిడెంట్‌ కవిత ఫోర్జరీ చేసి ఆ పత్రాలను జగన్మోహన్‌కు అందించారు. ఆ పత్రాలను ఉపయోగించి జగన్మోహన్‌రావు హెచ్‌సీఏ అధ్యక్షుడైనట్లు సీఐడీ చెబుతోంది. అలాగే అవినీతి కూడా జరిగినట్లు తేల్చింది. ఈ క్రమంలో వీరికి కోర్టు రిమాండ్‌ విధించింది. నలుగురిని చర్లపల్లి జైలుకు తరలించగా, కవితను చంచల్‌గూడా మహిళా జైలుకు తరలించారు.

### గురు పూర్ణిమ సందర్బంగా

# అన్నప్రసాద వితరణ

### కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల



**హైదరాబాద్‌ (జనం సాక్షి) :** శేర్లింగంపల్లి మండలం రామకృష్ణ నగర్‌ కాలనీలో గురు పౌర్ణమి సందర్భంగా ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో జరిగిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గాంధీ, రాష్ట్ర కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా, కార్పొరేటర్‌ జగదీశ్‌ గౌడ్‌, కార్పొరేటర్‌ మంజుల రఘునాథరెడ్డి, ఐవిఎఫ్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షులు మల్లేష్‌ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ ప్రభాకర్‌ గుప్తా, అవొపా మహిళా అధ్యక్షురాలు వందనపు శిల్ప ,కట్టా రవి గారు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ముక్కా పృథ్వి ,సుబ్రహ్మణ్యం , రంగా రమేష్‌ ,సునీల్‌, విగ్నేష్‌, భాను ప్రకాష్‌, రఘు, సంతోష్‌, సాయి ప్రసాద్‌, కిరణ్‌, పసుమర్తి రవి, చిన్నం సత్యం, సంపత్‌, రాము భాస్కర్‌, సత్యనారాయణ, నాగమల్లేష్‌, జగన్‌, లక్ష్మీనరసింహారావు, నాగవంశీ, పబ్బా శ్రీనివాస్‌, యాదగిరి, నటరాజ్‌, కృష్ణమూర్తి తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.గుడి కమిటీ మోహన్‌ గారికి , కమిటీ సభ్యులు,సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### దిల్‌ సుఖ్‌ నగర్‌ సాయి బాబా దేవాలయాన్ని దర్శించుకున్న ఉప్పల దంపతులు

గురు పూర్ణిమ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌ గుప్త దంపతులుదిల్‌ సుఖ్‌ నగర్‌ సాయి బాబా దేవాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ సాయి బాబా ఆశీస్సులు అందరి మీద వుండాలి అని ఆయన అన్నారు.



### మత్స్యకారుల సంక్షేమమే

# ప్రభుత్వ లక్ష్యం కావాలి

### పుస్తకావిష్కరణ సభలో పిట్టల రవీందర్‌ పిలువు




**కామారెడ్డి (జనంసాక్షి) :** దాదాపు ఆరు దశాబ్దాలపాటు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ మత్స్యరంగంలో అపారమైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని అందిపుచ్చుకుని రాష్ట్రంలోని సాంప్రదాయ మత్స్యకారులు లక్షాధికారులుగా మారేందుకు ప్రయత్నించాలని తెలంగాణ రాష్ట్రమత్స్యసహకార సంఘాల సమాఖ్య (ఫిషరీస్‌ ఫెడరేషన్‌) మాజీ చైర్మెన్‌ మరియు తెలంగాణ ఫిషరీస్‌ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు పిట్టల రవీందర్‌ పిలుపునిచ్చారు. గురువారంనాడు కామారెడ్డి జిల్లా లింగంపేట మండల మత్స్యసహకార సంఘాల ఆధ్వర్యంలో స్థానిక రైతువేదికలో నిర్వహించిన 'జాతీయ మత్స్యరైతుల దినోత్సవం' సందర్భంగా ఆయన వెలువరించిన 'తెలంగాణ మత్స్యరంగం – సమగ్ర అభివృద్ధి – కీలక అంశాలు' పుస్తకాన్ని స్థానిక మత్స్యకారులతో కలిసి ఆవిష్కరించిన అనంతరం పిట్టల రవీందర్‌ మాట్లాడుతూ తెలంగాణ మత్స్యరంగం సమగ్ర అభివృద్ధికి ఈ పుస్తకం ఒక దిక్సూచిలాగా ఉపయోగపడుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. కేవలం నీటి వనరుల అభివృద్ధి, చేపల ఉత్పత్తిలో పెరుగుదల మరియు ప్రభుత్వ పథకాల అమలుతో మాత్రమే మత్స్యరంగం అభివృద్ధి చెందినట్లుకాదని, తరతరాలుగా అన్నిరంగాలలో ఎంతో వెనకబడిపోయిన సాంప్రదాయ మత్స్యకారుల కుటుంబాలు ఆధునిక ప్రపంచంలో సమభాగస్వాములు అయినప్పుడు మాత్రమే మత్స్యరంగం సమగ్రంగా అభివృద్ధి చెందినట్లుగా భావించాలని అన్నారు. గత ప్రభుత్వపాలనాకాలంలో తెలంగాణ మత్స్యరంగం అభివృద్ధికి కొంతమేరకు ప్రయత్నాలు జరిగినప్పటికీ మత్స్యశాఖలో పేరుకుపోయిన అవినీతి, అలక్ష్యం, ఆధునిక విధానాలపట్ల అవగాహన లేకపోవడం లాంటి అనేకానేక కాకరణాలవల్ల ఆశించిన ఫలితాలు దక్కలేదని, మత్స్యరంగం అభివృద్ధి కోసం అప్పటి ప్రభుత్వం కోట్లాది రూపాయలను పథకాల పేరిట ఖర్చు చేసినప్పటికీ అధికారుల అవినీతి, మత్స్యకారుల్లో అవగాహన రాహిత్యం తదితర కారణాల వల్ల మత్స్యకారుల జీవితాలలో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదని పిట్టల రవీందర్‌ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరకాలం తరువాత మత్స్యశాఖకు ప్రత్యేకంగా మంత్రిని నియమించడం, ఆ రంగం అభివృద్ధి విషయంలో ఆలోచించడం ప్రారంభించినట్లు కనిపిస్తున్నదని, అయితే ఆచరణలో రాష్ట్ర ప్రభుత్వం ఈ రంగం అభివృద్ధికి తీసుకోబోయే కార్యాచరణపై ఆధారపడి ప్రభుత్వ పనితీరును అంచనా వేయగలగుతామని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్తగా మత్స్యశాఖకు మంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టిన వాకిటి శ్రీహరి మత్స్యకార కులాల ప్రతినిధిగా రావడం హర్షించదగిన పరిణామమని, రాష్ట్రంలోని మత్స్యసహకార సంఘాలు, మత్స్యకారులు ఆయనకు సంపూర్ణ సహకారాన్ని, మద్దతును అందించినప్పుడే ఈ రంగానికి ప్రభుత్వం ద్వారా మేలుకలుగుతుందని పిట్టల రవీందర్‌ అభిప్రాయపడ్డారు. కామారెడ్డి జిల్లా మత్స్యకారుల ప్రతినిధి డాక్టర్‌ భట్టు విఠల్‌ ముదిరాజ్‌ అధ్యక్షతన జరిగిన జాతీయ మత్స్యరైతుల దినోత్సవం కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి నాయకుడు డాక్టర్‌ నిజ్జన రమేశ్‌ ముదిరాజ్‌, తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్‌ బోనాల జాతర

### రెండ్రోజుల పాటు వైన్స్‌ మూసివేత

**హైదరాబాద్‌, జూలై10 (జనంసాక్షి) :** సికింద్రాబాద్‌ ఉజ్జయిని బోనాలను పురస్కరించుకని రెండు రోజుల పాటు– వైన్‌ షాపులు బంద్‌ చేస్తున్నట్లు పోలీస్‌ శాఖ వెల్లడించింది. హైదరాబాద్‌ మహానగరంలోని సికింద్రాబాద్‌లో బోనాల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు– వివరించింది. ఈ మేరకు హైదరాబాద్‌ నగర పోలీస్‌ కమిషనర్‌ సీవీ ఆనంద్‌ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జులై 13వ తేదీ ఉదయం 6:00 నుండి 15వ తేదీ ఉదయం 6:00 గంటల వరకు సెంట్రల్‌, ఈస్ట్‌, వెస్ట్‌ హైదరాబాద్‌ పరిధిలోని వైన్స్‌ షాపులు, బార్లు బంద్‌ ఉంటాయని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి జాతర (బోనాలు) సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు– తెలిపారు. సెంట్రల్‌ జోన్‌ పరిధిలో గాంధీ నగర్‌ డివిజన్‌.. అలాగే ఈస్ట్‌ జోన్‌ పరిధిలో చిలకలగూడ డివిజన్‌లోని చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ.. అదే విధంగా నార్త్‌ జోన్‌ పరిధిలో బేగంపేట డివిజన్‌, గోపాలపురం డివిజన్‌ పరిధిలో గోపాలపురం, తుకారాం గేట్‌, మారేడుపల్లితోపాటు– మహంకాళి డివిజన్‌ అంటే.. మహంకాళి, రామ్‌గోపాల్‌పేట, మోండా మార్కెట్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మద్యం షాపులన్నీ మూసి ఉంటాయని ఆ ఉత్తర్వుల్లో వివరించారు. ఆషాఢ మాసం ప్రారంభమైంది. తెలంగాణలో బోనాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. బోనాలు నేపథ్యంలో ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. నగరంలోని ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
11 జూలై 2025
తెలంగాణ

# జనాభా పెరుగుదలతో ఎవరికి నష్టం!



2025లో ప్రపంచ జనాభా 8.2 బిలియన్లను దాటడంతో, వనరులు, పర్యావరణం మరియు సామాజిక-ఆర్థిక స్థిరత్వం పై మానవ విస్తరణ ప్రభావం ఇంతకు ముందెన్నడూ లేనంతగా స్పష్టంగా కనిపిస్తుంది.ప్రతి సంవత్సరం జూలై 11న జరుపుకునే ప్రపంచ జనాభా దినోత్సవం,ఈ సవాళ్లను గుర్తుచేస్తూ, విధాన నిర్ణేతలు,ప్రభుత్వాలు మరియు వ్యక్తులు స్థిరమైన అభివృద్ధి, లింగ సమానత్వం మరియు అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలను పొందే దిశగా కృషి చేయాలని కోరుతోంది.ప్రపంచ జనాభా చారిత్రాత్మక గరిష్ట స్థాయికి చేరుకుంది.2025 నాటికి 8.2 బిలియన్లను అధిగమించింది.ఈ సంఖ్య సుమారు 71 మిలియన్ల మంది వార్షిక పెరుగుదలను ప్రతిబింబిస్తుంది,ఇది మునుపటి సంవత్సరంతో పోలిస్తే 0.89% వృద్ధి రేటును సూచిస్తుంది.గత దశాబ్దాల కంటే ఈ వృద్ధి నెమ్మదిగా ఉన్నప్పటికీ, ప్రపంచం ఇప్పటికీ పట్టణీకరణ, వనరుల వినియోగం, పర్యావరణ ప్రభావం మరియు ఆర్థిక అసమానతలకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కొంటోంది. నానాటికి పెరుగుతున్న జనాభా, దాని ద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు, జనాభా పెరుగుదల సమస్యలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించేందుకు ప్రతి ఏటా జూలై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1987 జులై 11వ తేదీన ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకున్న( డే ఆఫ్ ఫైవ్ బిలియన్) రోజున పురస్కరించుకొని జనాభా పెరుగుదల గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అలా క్లిష్టమైనటువంటి జనాభా సమస్యలపై దృష్టిని ఆకర్షించడానికి ఐక్యరాజ్యసమితి ప్రపంచ జనాభా దినోత్సవాన్ని 1989లో ప్రారంభించింది. అప్పటినుండి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం జూలై 11వ తేదీన జనాభా దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుంది.జనాభా పెరుగుదల కేవలం సంఖ్యల గురించి కాదు.ఇది మానవహక్కులు,లింగ సమానత్వం,ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత, వాతావరణ స్థితిస్థాపకత మరియు ప్రపంచ వనరుల బాధ్యతాయుతమైన ఉపయోగం గురించి కుడా.ఆర్థిక వృద్ధిని పర్యావరణ పరిరక్షణ మరియు మానవ శ్రేయస్సుతో సమతుల్యం చేసే వినూత్న పరిష్కారాలను కనుగొనడానికి ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు, మేధావులు ,పరిశోధకులు మరియు సంఘాలు కలిసి పనిచేయాలి.

అంతేకాకుండా, జనాభా ధోరణులను స్థిరీకరించడంలో మహిళా సాధికారత మరియు పునరుత్పత్తి హక్కులు కీలక పాత్ర పోషిస్తాయి. అధిక సాంద్రత కలిగిన జనాభాను నిర్వహించడానికి సాంకేతిక పురోగతి మరియు స్మార్ట్ అర్బన్ ప్లానింగ్ కూడా చాలా అవసరం. లేకపోతే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇప్పటికే జనాభాకు సరిపడా ఆహారం దొరకక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని అందరూ కూడా దృష్టిలో ఉంచుకోవాలి.వచ్చే ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని పిల్లల్ని కనాలి,వారికి మంచి విద్యను అందించడమే కాకుండా,పౌష్టిక విలువలు ఉన్నటువంటి ఆహారాన్ని కూడాఅందించాలి. 2025 ప్రపంచ జనాభా దినోత్సవం థీమ్ ను చూసినట్లయితే భవిష్యత్తు కోసం ఒక దార్శనిక దృష్టి అనే నినాదంతో ప్రతి వ్యక్తికి ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండి,వారి హక్కులు గౌరవించబడి మరియు స్థిరమైన అభివృద్ధి సాధించబడుతుంది. అలాగే కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, తల్లి ఆరోగ్యం మరియు మానవ హక్కులు వంటి వివిధ జనాభా సమస్యలపై ప్రజల అవగాహన పెంచడం ప్రపంచ జనాభా దినోత్సవం లక్ష్యం.జనాభా పెరుగుదల ఎక్కువైతే అంటే ఆహారం, నీరు,గృహనిర్మాణం, శక్తి, ఆరోగ్య సంరక్షణ, రవాణా మరియు మరిన్నింటికి డిమాండ్ పెరుగుతుంది.వాటి వినియోగం అంతా పర్యావరణ క్షీణతకు,ఘర్షణలను పెంచడానికి మరియు మహమ్మారి వంటి పెద్ద ఎత్తున విపత్తుల ప్రమాదాన్ని పెంచుతుంది. జనాభాను నియంత్రించడానికి జనాభా పెరుగుదల వల్ల కలిగే సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి.విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణం, మరియు ఆర్థిక వ్యవస్థపై జనాభా పెరుగుదల ప్రభావం గురించి వివరించాలి.జనాభా నియంత్రణకు సంబంధించిన బిల్లులను రూపొందించి, వాటిని అమలు చేయాలి. అయితే, బిల్లులు రూపొందించేటప్పుడు, ప్రజల హక్కులు, మతపరమైన మరియు సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

ప్రభుత్వము కూడా ఈ ప్రాథమిక సమస్య అయిన జనాభా గురించి ఆలోచించడం లేదు. 20వ శతాబ్దం మొదట ప్రపంచ జనాభా 160 కోట్లు. ఈ రోజు ఒక శతాబ్దం తరువాత మనం 720 కోట్ల జనాభా. 2050 నాటికి 960 కోట్ల జనాభా అవ్వవచ్చని అంచనా వేస్తున్నారు. ఇది కేవలం భాద్యత రహితమైన పునరుత్పత్తి. భారతదేశంలో 1947 సంవత్సరంలో మన జనాభా 33 కోట్లు. ఇవ్వాళ 120 కోట్లు, ఎన్ని చెట్లు పెంచినా, ఎన్ని చట్టాలు చేసినా, ఎటువంటి సాంకేతికతను తెచ్చినా జనాభా నియంత్రణ లేనిదే పరిష్కారం లేదు.జనాభా నియంత్రణ చేయకుండా, పర్యావరణ, భూమి లేదా నీరు పరిరక్షణ గురించి మాట్లాడడం వల్ల ఏమీ జరగదు. ప్రస్తుత సైన్స్ సాంకేతికత ప్రతి మనిషినీ అతిగా క్రియాశీలకంగా మార్చింది. మానవుని యొక్క క్రియాశీలతను ఆపలేము, అలా చేస్తే మానవాళి ఆకాంక్షలకు అడ్డుకట్ట వేసినట్లు అవుతుంది. మనము కేవలం జనాభా నియంత్రించడం మాత్రమే చేయగలం. అందరి సమిష్టి కృషితోనే ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి జనాభా పెరుగుదలను అరికట్టవచ్చు.



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327

# కనిమొళి వ్యాఖ్యలు కడు విడ్డూరం



**తమిళనాడు రాష్ట్ర రాజకీయాలలో ప్రముఖ తమిళ నటుడు 'దళపతి' విజయ్ 'తమిళ నాడు విజయ పక్షం' అనే అర్థంలో 'తమిళగ వెట్రి కళగం' ( టి.వి.కె ) పేరుతో 2024లో నూతన రాజకీయ పార్టీని స్థాపించి సరికొత్త సంచలనాన్ని సృష్టించి ఇటీవల ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించబడడంతో విపక్ష పార్టీలలో అప్పుడే రాజకీయ ప్రకంపనలు రాజుకుంటున్నాయి. ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలలో భాగంగా టి.వి.కె పార్టీ సమాయత్తం అవుతూ ముందుకు సాగుతున్న క్రమంలో ఆ పార్టీ అధినాయకుడుపై ముఖ్యంగా అధికార డిఎంకె పార్టీ మాటల యుద్ధానికి ఆజ్యం పోయడంతో తమిళనాడులో ఏడాది ముందుగానే రాజకీయ రణరంగం రాజుకుంది అని చెప్పవచ్చు.**

ఇటీవల ఎట్టాయాపురంలో జరిగిన డి.ఎం.కె పార్టీ సమావేశంలో తూత్తుకుడి ఎం.పి కనిమొళి మాట్లాడుతూ విజయ్ పేరుని ప్రస్తావించకుండా పరోక్షంగా విమర్శలు గుప్పించడంతో అప్పుడే రాజకీయ యుద్ధ వాతావరణం అలుముకున్నట్లుగా చాలా స్పష్టంగా అవగతం అవుతుంది. 'ఎలాంటి అనుభవం లేకుండానే కొందరు రాజకీయాలలోకి వచ్చారు. అలా రాజకీయాల్లో వచ్చిన అనుభవంలేని, అసలే పాలనపై ప్రాథమిక అవగాహన కూడా లేని కొంతమంది కొత్తవారు ఉన్నారు. అలాంటి వారు ఓట్లు సంపాదించడానికి తప్పుడు సమాచారాన్ని ఉపయోగిస్తున్నారు. ఆ విధంగా వారు ఎక్కడి నుండో అకస్మాత్తుగా రాజకీయాలలోకి ఊడిపడతా రు. కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోకుండా వారు ఆ రకంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. అలా వారు రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య తేడా తెలియకుండానే ప్రశ్నలు సంధిస్తారు. వాటిని అర్థం చేసుకోవాలంటే వారు ముందు రాజకీయాలను తెలుసుకోవాలి. ముఖ్యంగా తమిళనాడు ప్రజల కోసం నిజంగా పోరాడాలనుకుంటే ముందు తమిళ ప్రజల సమస్యలను, ఆపై రాజకీయాలను తెలుసుకొని పూర్తి అవగాహన పెంపొందించుకోవాలి. అలాగే ఎలా పరిపాలించాలో కూడా తెలుసుకోవాలి. ఒక రకంగా పాలనా నిర్మాణాలను అర్థం చేసుకోకుండా ఎన్నికల వాగ్దానాలు చేస్తున్నారు' అని దళపతి విజయ్ పైన కనిమొళి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. కాని ఆమె చేసిన ఈ కడు విడ్డూరమైన వ్యాఖ్యలు 'ఆమె రాజకీయ అవగాహనారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి' అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

నిజానికి రాజకీయాలలోకి రావాలి అని అనుకుంటే కనిమొళి వ్యాఖ్యానించినట్లుగా ముందుగానే ఎలాంటి రాజకీయ అవగాహన అవసరం లేదు. అలా ముందుగానే రాజకీయ అవగాహన లేకున్నా కూడా రాజకీయాలలో ఆరితేరిన వారు ఎందరో ఉద్ధండులు సరికొత్త చరిత్రని సృష్టించారు. అందువల్ల 'రాజకీయాలలోకి రావడానికి ముందుగానే రాజకీయ అవగాహన ఉండాల్సిన అవసరం లేనేలేదు' అని చాలా స్పష్టంగా చెప్పవచ్చు. కాలక్రమంలో రాజకీయాలలో ముందుకు సాగుతున్న క్రమంలో స్పష్టమైన రాజకీయ అవగాహన వాటంతటగా అదే రూపుదిద్దుకుంటుంది అని నిర్దిష్టంగా చెప్పవచ్చు. అందువల్ల 'ముందుగా రాజకీయ అవగాహన ఉండాలి' అని కనిమొళి వ్యాఖ్యానించడం ఏమాత్రం సరైనది కానేకాదు. ఒక రకంగా ఆదిలోనే విజయ్ రాజకీయ భవితవ్యాన్ని చెక్ పెట్టే విధంగా కనిమొళి వ్యాఖ్యలు చేశారు అని చాలా స్పష్టంగా చెప్పవచ్చు. దళపతి విజయ్ నేతృత్వంలోని టి.వి.కె పార్టీ సృష్టించబోయే రాజకీయ సునామీని ఎదుర్కొలేము' అనే నిరాశ - నిస్పృహలోనే ఆమె ఈ తరహా వ్యాఖ్యలు చేశారని చాలా స్పష్టంగా చెప్పవచ్చు.

వాస్తవంగా కనిమొళి కన్నా దళపతి విజయ్ రాజకీయ అంశాలపై స్పష్టమైన అవగాహనను కలిగి ఉన్నాడు అని నిర్దిష్టంగా చెప్పవచ్చు. 'అవినీతిని అంతం చేసి ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా తాను పార్టీని స్థాపించానని, ప్రజల సంక్షేమం కోసమే తన సినీ జీవితాన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చానని అంతిమంగా ప్రజానీకం అభ్యున్నతి కోసమే తన పోరాటం ఉంటుంది' అని దళపతి విజయ్ స్పష్టమైన లక్ష్యాలతో పార్టీని ప్రకటించడం తద్వారా ఆయనకు రాజకీయ అవగాహన ఉంది అని నిర్దిష్టంగా చెప్పవచ్చు. 'నిస్వార్థ, పారదర్శక, దూరదృష్టి గల, అవినీతి రహిత, కుల, మత విభేదాలు లేని సమర్థ పాలన యంత్రాంగానికి మార్గం సుగమం చేసే రాజకీయ ఉద్యమం కోసం తమిళులు ఆకాంక్షిస్తున్నారు. తమిళనాడు ప్రజలు మార్పును ప్రజలు ఆకాంక్షిస్తున్న రాజకీయ మార్పునకు మార్గాన్ని సుగమం చేయడం మా లక్ష్యం. ప్రజా ఉద్యమం మాత్రమే రాజకీయ మార్పు తేగలదు. అది తమిళ నాడు హక్కులను కాపాడగలదు. చాలా మంది రాజకీయ నేతలు ఆయా పదవులలో ఉండి సినిమాలలో మాదిరిగా నటించారు తప్ప ప్రజల సంక్షేమం కోసం పెద్దగా పని చేసినది ఏమి లేదు. రాజకీయాలు అంటే సినిమాలు కాదు. ప్రజల జీవితాలతో నడిచే బాధ్యతాయుతమైన ప్రయాణం. నాకు రాజకీయ అనుభవం లేకపోయిననూ భయపడి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు' అని దళపతి విజయ్ పేర్కొనడం తద్వారా ఆయనకు ఉన్న రాజకీయ అవగాహనను వెల్లడిస్తుంది అని స్పష్టంగా చెప్పవచ్చు. గతంలో కేవలం పార్టీ పేరుని ఆయన ప్రకటించగానే ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకోవడం తద్వారా ప్రజలకు ఆయనపై ఉన్న విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుంది అని చెప్పవచ్చు.

తమ పార్టీ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని గతంలోనే స్పష్టం చేసిన విజయ్ దానికే కట్టుబడి ఆ దిశగానే ముందుకు సాగుతున్నారు. 'బి.జె.పి పార్టీతో చేతులు కలపడానికి మా పార్టీ డి.ఎం.కె మరియు అన్నా డి.ఎం.కె పార్టీల మాదిరిగా ఎంతమాత్రం కానేకాదు. బి.జె.పి విభజన రాజకీయాలు చేస్తుంది. బి.జె.పి విషపూరిత రాజకీయాలు తమిళనాడులో చెల్లవు. కేంద్రంలో ఆ పార్టీ అనుసరిస్తున్న విధానాల మూలంగా తమిళనాడులో ఆ పార్టీ అధికారంలోకి రాలేదు. అలాగే తమిళనాడులో అరాచక పాలన సాగిస్తున్న డి.ఎం.కె కూటమితో ఎట్టి పరిస్థితులలోనూ చేతులు కలపబోము. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బి.జె.పి మరియు డి.ఎం.కె పార్టీలతో మాకు ఎలాంటి పొత్తు ఉండబోదు. ఆ రెండు పార్టీలు మాకు ప్రధాన సైద్ధాంతిక శత్రువులు' అని విజయ్ వ్యాఖ్యలు వ్యాఖ్యానించడం రాజకీయంగా విశిష్ట ప్రాధాన్యతని సంతరించుకుంది. ఈ అంశాలన్నింటిని పరిశీలిస్తే టి.వి.కె పార్టీ అధినాయకుడు దళపతి విజయ్ రాబోయే అసెంబ్లీ ఎన్నికలో విజయం సాధించేందుకు పూర్తి స్థాయి రాజకీయ అవగాహనతోనే వ్యూహాలను అనుసరిస్తూ ముందుకు సాగుతున్నారు అని నిర్దిష్టంగా చెప్పవచ్చు. కాని దళపతి విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' ( టి.వి.కె ) పురుడు పోసుకుని క్రమక్రమంగా బలపడుతున్న క్రమంలోనే ముఖ్యంగా ఆయన ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించబడగానే కనిమొళి 'ముందుగానే రాజకీయ అవగాహన ఉండాలి' అని అంటూ చవకబారు వ్యాఖ్యలు చేయడం ఆమెకే చెల్లింది అని చెప్పవచ్చు. ఏది ఏమైననూ 'దళపతి విజయ్ మిగతా సినీ నటులకు భిన్నంగా తాను నిర్దేశించుకున్న విధివిధానాలను ఆచరణ రూపంలో ముందుకు తీసుకువెళ్లి తమిళనాడు రాష్ట్ర రాజకీయాలలో నవ చరిత్రను సృష్టించాలి' అని ఆకాంక్షిస్తున్నాను.




జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

## నువ్వు మారితేనే!

నువ్వుమారకుండా
మారమని చెప్పకు!
మార్చాలనిచూడకు!
నువ్వుమారినప్పటికీ
ఎవరినైతే మార్చాలో
ఆ ప్రజల వద్దకు వెళ్ళు!
వివక్ష అహంకారం
కీర్తికండూతి నీలోఉంటే
నువ్వు మార్చలేవు!
మనిషినిమనిషిగచూడు
కులమత భాషా ప్రాంతాలుగా
విడగొట్టి చూడకు!
ప్రాథమిక అవసరాలు
ఏ మనిషికైనాఒక్కటే!
మిగిలినదంతా దోపిడీ!
సూటిగప్రజలవద్దకెళ్ళు
ప్రచార పటాటోపంవద్దు
నీ లక్ష్యం దెబ్బతింటుంది
ఎన్నోసమ్మోహనాస్త్రాలు
కీర్తి అహం నిన్నుకూల్చేస్తే
నీ లక్ష్యం నెరవేరదు!
స్వార్థపరులేదైనాచేస్తారు
వాళ్ళ లక్ష్యం స్వార్థం!
నీ లక్ష్యం సమసమాజం!
కడిగినముత్యంలఉండు
ప్రజలునిన్నునమ్ముతారు
అలాఐతేనే మార్చగలవ్!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్



# మతం, దేవుడు గడప దాటితే... మిగిలేది శ్మశానమే!



**మరి ప్రపంచంలో ఎక్కడాలేనన్ని పూజలు, వ్రతాలు చేసే దేశంలో కొన్నైనా విలువలతో బ్రతకాలి కదా. అదేం ఉండదు. భక్తి అనేదాన్ని ఒక వేషధారణగా, స్టేటస్ సింబల్‌గా మార్చాక విచక్షణ కు తావుండదు. గుడ్డెద్దు చేలో పడ్డట్టు పోలోమని వెళ్ళిపోవటమే.. పూజారులు వాళ్ళ అవసరాల కోసం భక్తిని నిత్య జీవితంలో భాగంగా మారిస్తే, బీజేపీ లాంటి పార్టీలు దాన్ని దేశభక్తితో ముడి పెట్టి ప్రజల విచక్షణా జ్ఞానాన్ని చంపేసాయి. దాని ఫలితంగా వాళ్లకు అధికారం దక్కితే, దేశ ఆర్థిక ప్రగతి అట్టడుగుకు పడిపోయింది. బడుగులపై పన్నులు..,ఆదానీ,అంబానీ వంటి బడాబాబులకు వేలకోట్ల రుణ మాఫీలు..తిరిగి పార్టీ ఫండ్ రూపంలో అది బీజేపీ ఖజానాకు చేరటం..**

మతం, దేవుడు అవసరమైనదానికంటే ఎక్కువగా ప్రజల మెదళ్ళను ఆక్రమించుకుంటే వెయ్యేళ్ళైనా ఆ దేశం బాగుపడదు..ఇప్పుడు ఇండియా ఆ దిశగానే పయనిస్తోందా... ఈమధ్య ఎక్కడ చూసినా భక్తి వరదలై పారుతూ కనిపిస్తోంది..రోజు రోజుకూ కొత్త కొత్త పండుగలు పుట్టుకొస్తున్నాయి. గతంలో ఉన్నవి కాకుండా కొత్త కొత్త పూజా విధానాలు, నోములు, వ్రతాలు, దీక్షలు మొదలయ్యాయి.

గతంలో కేవలం ఉత్తర భారతంలోనే ఎక్కువగా జరుపుకునే గణపతి నవరాత్రులు ఇప్పుడు గల్లీ గల్లీకి విస్తరించాయి. అలాగే అయ్యప్పమాల వేసేవారు కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయారు. ఏది ఎందుకు చేస్తున్నామో తెలుసుకునే దశ దాటిపోయి చాలాకాలం అయింది. పక్కింటివాళ్ళు చేస్తున్నారు కాబట్టి మేమూ చేయాలనే భావన పెరిగిపోయింది. పైగా అదొక బాధ్యతగా నిష్ఠగా రోజుల తరబడి చేయటం, వేలు లక్షలు ఖర్చుపెట్టడం అతి సాధారణం అయిపోయింది. పోనీ ఆ తర్వాత జీవితంలో విలువలకు కట్టుబడి ఉంటున్నారా అంటే అదీలేదు. దేనిదారి దానిదే. అత్యంత క్రైమ్ రేట్ కలిగిన దేశాల్లో ఎప్పుడూ మన దేశం ముందు వరుసలోనే ఉంటుంది.

అది పైకి ఎక్కడా అవినీతి చేస్తున్నట్టు కనిపించదు, కానీ దేశంలోనే అత్యంత ధనిక పార్టీ మాత్రం అవుతుంది..దేశభక్తి ముసుగులో కూరుకుపోయిన మన మెదళ్లకు ఆ విషయం చేరదు. మనకు ప్రతీ ఎలక్షన్ల ముందు ఒక సర్జికల్ స్ట్రైక్ జరిగితే చాలు..పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను ఆక్రమించుకుంటాం, పాకిస్తాన్ ను ప్రపంచపటంలో లేకుండా చేస్తాం అనే నినాదాలు చాలు మనం మళ్ళీ ఒకసారి బీజేపీని గెలిపించటానికి...

దేశంలో రోజు రోజుకూ పెరుగుతున్న నిరుద్యోగం, పేదరికం, అభివృద్ధి చెందుతున్న దేశం అని చెప్పుకుంటున్న చోటే ఆకలిచావులు., స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళైనా ఇంకా సరైన పౌష్టికాహారం దొరక్క ప్రతియేటా లక్షల్లో చనిపోయే చిన్నారుల మరణాలు.. ఇవన్నీ మనకు అవసరం లేదు..భావోద్వేగాలు రాజ్యమేలేచోట మంచీచెడుల తర్కం పనిచేయదు. ప్రపంచాన్ని యుద్ధాల్లోకి దింపి, తన అవసరాలకోసం యుద్ధాలను ఆపే అమెరికా ఎక్కడా తన దేశంలో మూఢత్వాన్ని ప్రబలేలా చేయదు, శాస్త్ర విజ్ఞానానికే ప్రాధాన్యత ఇస్తుంది. కానీ మనకు అది అవసరం లేదు. మనకు భక్తి, భావోద్వేగాలే ప్రదానం..వేల సంవత్సరాల మూఢాచారాలు, అన్నీ వేదాల్లోనే ఉన్నాయనే భ్రమల్లో బ్రతకడమే మనకు ఆనందం.

తమ దేశంలో రెండు టవర్లను కూల్చినదానికి ప్రతీకారంగా అమెరికా ఎక్కడో అజ్ఞాతంలో ఉన్న బిన్ లాడెన్ ను సైలెంట్ గా రాత్రికి రాత్రే మట్టుపెట్టింది. అతడి శవాన్ని తీసుకెళ్లి సముద్రంలో కలిపేసింది. ఎక్కడా హడావుడి లేదు, ఆరాటం లేదు..ఆ సందర్భంగా ఆ దేశాధ్యక్షుడు ప్రజల ముందుకొచ్చి తన ఆరించుల ఛాతీ ప్రదర్శన చేయలేదు, దాన్ని ఎన్నికల ఎజెండాగా మార్చలేదు. ఆ దేశ ప్రజలు ఆ విషయం నాలుగు రోజులు మాట్లాడుకున్నారు, వదిలేసారు..మనలాగా పూసుకుని తిరగలేదు.

అక్కడి ప్రభుత్వం దేశ సైన్యంతో పాటు సామాన్య జనాన్ని మానసికంగా యుద్ధరంగంలోకి దింపలేదు. సైన్యం వాళ్ళ పని వాళ్ళు చేసారు అంతే.. ఇక్కడ అలా కాదు, సైన్యం బోర్డర్ లో యుద్ధం చేస్తుంటే, తుపాకి లేకుండా మనం మన మనసుల్లో యుద్ధం చేస్తుంటాం. ఇక్కడున్న ప్రతి ముస్లిం పాకిస్తాన్ వాడే అన్నంత ఇదిగా ద్వేషిస్తుంటాం..వీధుల్లో బాణాసంచా పేలుళ్ళు, రోడ్లపై త్రివర్ణ పతాకాల రెపరెపలు..బోర్డర్ లో కంటే ఇక్కడే పెద్ద యుద్ధ వాతావరణం కనిపిస్తుంది..

కేంద్రంలో ఉన్న ప్రభుత్వానికి కావాల్సింది కూడా అదే. ప్రజల భావోద్వేగాలే వాళ్ళ అధికారానికి పెట్టుబడి..దేశ రక్షణ కోసం ఆర్మీ చేసేవి త్యాగాలే..కాదనలేం. కానీ వాళ్ళపట్ల ఒక హీరోవర్షిప్ ఇక్కడివాళ్లకు. ఏమంటే ప్రాణాలు ఎవరు త్యాగం చేస్తారంటారు. కానీ ఎప్పుడో పుష్కరానికి ఒకసారి, అదీ కొద్దిరోజులు జరిగే యుద్ధంలో మరణించే సైనికులకంటే.,మన మధ్యనే ఉంటూ మనకోసం నిద్రాహారాలు మాని పనిచేస్తూ ప్రతీ యేటా డ్యూటీలో మరణించే పోలీసుల సంఖ్యే ఎక్కువ.

కానీ వీళ్ళపట్ల ఏ సానుభూతి ఉండదు. బోర్డర్‌లో పనిచేసే సైనికుల్లాగే వీళ్లకు కూడా భార్యాబిడ్డలుంటారు. వీళ్ళు కూడా ప్రజల రక్షణ కోసమే పనిచేస్తారు. వీళ్ళు చనిపోయేది కూడా వృత్తిధర్మంగానే.. వీళ్ళు తలపడే గూండాలతో, సంఘ వ్యతిరేకశక్తులతో వీళ్ళకెలాంటి వ్యక్తిగత వైరం ఉండదు.అయినా వాళ్లకు దొరికే గౌరవంలో పదోవంతు కూడా వీళ్ళకు దొరకదు.

ఏ దేశంలోనైనా మెజారిటీ ప్రజల్ని చూసి మైనార్టీలు భయపడతారు. కానీ ఇక్కడ మైనార్టీల వల్ల ప్రమాదం ఉందని మెజారిటీ ప్రజల్ని భయపెడతారు. ఎక్కడో ఎవరో ఆ మతానికి సంబంధించినవాళ్ళు టెర్రరిస్ట్ లతో జతకలిసారని మొత్తంగా ఆ జాతి హననానికి పిలుపులిస్తారు. మత మార్పిడులతో మొత్తం హిందూ సమాజాన్ని వాళ్ళవైపు తిప్పుకుంటున్నారని గగ్గోలు పెడతారు. అధిక సంతానంతో వాళ్ళ జనాభా పెంచుకుంటున్నారని నిందలు వేస్తారు. అదే సమయంలో కోట్లమంది హిందువులు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు ఏమీ చేసుకోలేదనే సత్యాన్ని విస్మరిస్తారు.

ఎక్కడో ఒకచోట చుక్క తెగిపడ్డట్టు కొందరు ముస్లింలు హిందూ అమ్మాయిలని ప్రేమించి పెళ్లిచేసుకుంటే లవ్ జిహాద్ అంటూ కొట్టి చంపుతారు. అదే మన చుట్టూ ముస్లిం అమ్మాయిలను చేసుకున్నవాళ్లు కనిపిస్తున్నా చూసీ చూడనట్టు నటిస్తుంటారు..

శాస్త్ర విజ్ఞానాన్ని కాకుండా మతాన్ని నమ్ముకున్న ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ లాంటి దేశాలు ఇవ్వాళ ఏ పరిస్థితుల్లో ఉన్నాయో చూస్తున్నాం. షియాలు, సున్నీలంటూ కొట్టుకుచచ్చే ఇరాక్, సిరియా,లెబనాన్, యెమన్, బహ్రైన్ లాంటి దేశాల అంతర్యుద్ధం కళ్ళముందే కనపడుతోంది. అభివృద్ధిని కాదని అస్థిరమైన నిర్ణయాలతో అతలాకుతలమైన శ్రీలంక ఉదంతం ఒక దేశం ఏంచేయగూడదో నేర్పించింది.

ప్రపంచంలో అత్యంత బలశాలి అనుకునే ఇజ్రాయెల్ పాలస్తీనాను శవాలదిబ్బగా మార్చినా ఇప్పటివరకు సాధించిందేం లేదు. కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు.

తనకు ఎదురే లేదనుకున్న ఇజ్రాయెల్ ఇవ్వాళ ఇరాన్ తో చేసిన యుద్ధంలో భంగపడి పరువుకోసం పాకులాడుతోంది.

ఒకరిని చూసి ఒకరు...మరేపనీలేనట్టు పూటకొక దీక్ష, నెలకొక పండుగ చేస్తూ జీవితంలో సగభాగం వాటికే కేటాయిస్తున్న హిందువులు.,మెజారిటీ ప్రజల ముందు ఐక్యత ప్రదర్శించటానికి మైనార్టీలు చేసే పిచ్చి ప్రదర్శనలు., సువార్త స్వస్థత సభల పేరుతో క్రిష్టియన్లు చేసే వికృత చేష్టలు.,కాస్త తక్కువే అయినా బైసాకి పండుగ పేరుతో రోడ్లపై సిక్కులు చేసే విన్యాసాలు...ఇలాంటివన్నీ భారతదేశంలోనే సాగుతాయి...

ఏతావాతా జరిగేదేమిటంటే వీటివల్ల ఏ ప్రోగ్రెస్ లేకపోవటం, దేశప్రగతిలో పాలుపంచుకోవాల్సిన యువత సమయమంతా నిర్వీర్యం అయిపోవటం. పైగా ఎదుటిమతంపై కక్షలు కార్పణ్యాలు పెంచుకోవటం..మనిషికి మనిషికి మధ్య మనమే మతమనే అడ్డుగోడ నిర్మించుకోవటం.... కాబట్టి దేవుడు, మతం అనేవి మన గడప లోపలివరకు ఉన్నప్పుడే వ్యక్తులకైనా దేశాలకైనా శ్రేయస్కరం. అవి గడపదాటి వీధుల్లోకొస్తే మిగిలేది స్మశానమే...!!

- ప్రేమ్‌రాజ్ ఎనుముల

## గ్రామీణ వ్యవస్థ నిర్మాణం
# భూసమస్యకు పరిష్కారం



తెలంగాణకు స్వాతంత్ర్యానికి ముందు నుంచి ప్రత్యేక స్థానం ఉంది. 1946-51 మధ్య తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. దున్నేవాడికి భూమి, కౌలు రైతుల హక్కుల కోసం జరిగిన ఉద్యమాలు చిన్న సన్నకారు రైతుల ఆకాంక్షలను ప్రతిబింబించాయి. ప్రజా సంఘాలు ప్రజల హక్కులను ప్రభుత్వం ముందు ఉంచాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా పేదలు, దళితులు, అణగారిన వర్గాల హక్కులు రాజకీయ పార్టీల ఎన్నికల ఎజెండాలో కీలకంగా మారాయి.

రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలో భూ సమస్యలు పెరిగాయి. కొన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ, 2020లో గత టీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసి, ధరణి చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం వికేంద్రీకరణకు బదులు కేంద్రీకరణను పెంచింది. గతంలో రైతులు భూ సమస్యల కోసం తాసిల్దార్ కార్యాలయాలను ఆశ్రయించేవారు. కానీ ధరణి చట్టం వల్ల విస్తీర్ణ సమస్యలు, పట్టాదారు పాస్‌పుస్తకాల్లో పొరపాట్లు, ఇతర సమస్యల పరిష్కారం కోసం రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, హైదరాబాద్‌లోని రాష్ట్ర భూ పరిపాలన కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చింది. సాదా బైనామాలకు సంబంధించిన 9.2 లక్షల దరఖాస్తులు, పార్ట్-బి కింద 18 లక్షల ఎకరాల భూముల సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయి. ధరణి చట్టం తాసిల్దార్, ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్ అధికారాలను కుదించింది. 2020 సెప్టెంబర్‌లో గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ రద్దుతో 7,039 వీఆర్ఓ పోస్టులు రద్దయ్యాయి. 5,500 మంది వీఆర్ఓలు ఇతర శాఖలకు బదిలీ అయ్యారు. 20,000 గ్రామ రెవెన్యూ సహాయకులు మున్సిపల్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, వైద్య శాఖలకు మార్చబడ్డారు. దీంతో గ్రామీణ స్థాయిలో అధికారులు లేక, రైతులు ఎవరిని సంప్రదించాలో తెలియని గందరగోళం నెలకొంది. 2023 ఎన్నికల్లో భూ సమస్యలు కీలక రాజకీయ అంశంగా మారాయి. అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్ రెడ్డి ధరణి చట్టాన్ని రద్దు చేసి, గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి కమిటీ ఏర్పాటై, కోదండ రెడ్డి, భూమి సునీల్, వి.లచ్చిరెడ్డి వంటి నిపుణులతో మూడు మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా సమస్యలను అధ్యయనం చేసింది. రైతులతో చర్చించి, అధికారులతో సమావేశమై, నూతన చట్టం అవసరమని సిఫారసు చేసింది. జిల్లాలవారీ సమావేశాలు నిర్వహించి, ప్రజల సూచనలతో భూభారతి చట్టం-2025ను డాక్టర్ అంబేద్కర్ జన్మదిన రోజున అమల్లోకి తీసుకొచ్చారు. ఈ చట్టం సాదా బైనామాల పరిష్కారం, అపీల్ వ్యవస్థ ఏర్పాటు, తాసిల్దార్, ఆర్డీఓ అధికారాల పునరుద్ధరణ, పరిపాలన వికేంద్రీకరణ, 10,954 రెవెన్యూ గ్రామాలకు గ్రామ పాలన అధికారుల (జీపీఓ) నియామకం వంటి మార్పులను తెచ్చింది.

పూర్వ వీఆర్ఏ, వీఆర్ఓలకు పరీక్ష ద్వారా 3,550 మంది అర్హత సాధించారు. అయితే, గతంలో ఇతర శాఖలకు బదిలీ చేయబడిన వీఆర్ఏ, వీఆర్ఓల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. 5,049 మంది పరీక్షకు దరఖాస్తు చేస్తే, 461 మంది హాజరు కాలేదు. రెవెన్యూ సదస్సుల్లో 8.81 లక్షల దరఖాస్తులు వచ్చాయి33% సాదా బైనామా, 17% అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ, 30% రెవెన్యూ సంబంధిత, 20% తక్షణ పరిష్కార దరఖాస్తులు. ప్రస్తుతం గ్రామీణ స్థాయిలో అధికారుల లేమి వల్ల తాసిల్దార్ కార్యాలయాలపై ఒత్తిడి పెరిగింది. రెవెన్యూ ఇన్స్పెక్టర్లు గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు, కానీ ఉద్యోగులపై ఒత్తిడి ఎక్కువైంది.

గతంలో బదిలీ చేయబడిన వీఆర్ఏ, వీఆర్ఓలను తిరిగి నియమించి, వారి సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. వీఆర్ఏలు 400-500 కిలోమీటర్ల దూరంలో జూనియర్ సహాయకులు, రికార్డ్ అసిస్టెంట్ వంటి చిన్న పోస్టుల్లో కుటుంబాలకు దూరంగా ఇబ్బందులు పడుతున్నారు. మానసిక, ఆరోగ్య సమస్యలతో 24 మంది మరణించారు. ప్రభుత్వం వీరిని గ్రామీణ రెవెన్యూ వ్యవస్థలో చేర్చి, సర్వీస్ సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాలి. జీపీఓ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలి. భూభారతి చట్టం ద్వారా వికేంద్రీకరణతో విస్తీర్ణ, సరిహద్దు, పట్టాదారు పాస్‌పుస్తక, పోడు భూ సమస్యలు, సాదా బైనామా హక్కులను త్వరితంగా పరిష్కరించాలి. ఈ చట్టం రైతుల హక్కులను కాపాడి, గ్రామీణ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడాలి.



డాక్టర్ మల్లారం అర్జున్
సామాజిక విశ్లేషకులు
8500272043

# ప్రైవేట్ స్కూల్స్ రెండో శనివారం సెలవు ఇవ్వాలి

- టీపీటీఎల్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ డిమాండ్

హైదరాబాద్, జూలై 10 (జనంసాక్షి) : ప్రైవేట్, కార్పోరేట్ స్కూల్స్ రెండవ శనివారం తప్పక సెలవు ఇవ్వాలని, ఫీజుల దోపిడీ నియంత్రణకు చట్టం చేయాలని, పేద విద్యార్థులకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించాలని కోరుతూ తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ ) సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఈ. నవీన్ నికోలస్ కి మెమొరాండం ఇచ్చారు. వారు సానుకూలంగా స్పందించి మేము డిఈఓలకు ఆర్డర్స్ ఇస్తామని హామీ ఇచ్చారు. మెమొరాండం ఇచ్చిన వారిలో టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఏ. విజయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు, అధ్యక్షులు రజనీ కాంత్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, అధ్యక్షుడు కోట రమేష్, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్ము విజయ్, డి. సైదులు, పి.విజయ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, డివైఎఫ్ఐ నాయకులు హాష్మీ తదితరులు ఉన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న కొన్ని ప్రైవేట్ స్కూల్స్ సెకండ్ శనివారం సెలవులు ఇవ్వాల్సి ఉండగా చాలా పాఠశాలలు ఇవ్వడం లేదు. ప్రభుత్వ స్కూల్స్ అన్నీ సెలవులు ఇస్తుండగా ప్రైవేట్ స్కూల్స్ సెలవులు ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపుతున్నాయి. ప్రైవేట్ కార్పోరేట్ స్కూల్స్ తెలంగాణ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ కింద



పని చేయడం లేదా..? వారికీ సెపరేట్ బోర్డు ఉందా? అని నాయకులు అడిగారు. వారికి వేరే బోర్డు ఉందా..? ప్రత్యేక రూల్స్ ఏమైనా ప్రైవేట్ స్కూల్స్ కోసం ఇచ్చారా..? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వ పరిధిలో ఉండి ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేకపోతే తెలంగాణలోనీ విద్యార్థులను చేర్చుకోవద్దని వారు ప్రైవేట్ స్కూల్స్‌నీ డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రైవేట్ స్కూల్స్ లో పని చేసే టీచర్స్ ప్రతీ రోజు ఎనిమిది గంటల నుండి తొమ్మిది, పది గంటలు విరామం లేకుండా పనిచేస్తున్నారు. పరీక్ష పేపర్స్, ఇతర వర్క్ కోసం ఇంటి వద్ద కొంత పని చేస్తూనే ఉంటున్నారు. ఎంతో పని ఒత్తిడితో ప్రతీ టీచర్ పనిచేస్తుండగా వారికి దొరికిన ఒక్క రెండు సెలవులు కూడా ఇవ్వకుండా పిండి పిప్పి చేయడం అన్యాయమని అన్నారు. విద్యార్థులకు కూడా సిలబస్ అధికంగా ఉండటం, హెూం వర్క్ లు ఇతర ప్రిపరేషన్ పేరుతో అధిక వత్తిడి ప్రైవేట్ స్కూల్స్ లలో ఉంటూనే ఉంటుంది. దొరికిన సెలవుల్లోనే వారు ఆటలు, ఇతర పనుల్లో మరలటం ఎంతో అవసరం. అందుకే విద్యార్థులకు సెలవులు ఇవ్వడం అవసరం. టీచర్స్‌కి ఇవ్వడం మరింత అవసరమే. కొన్ని స్కూల్స్ సెకండ్ సాటర్డే రోజే పి టి ఎం పెడుతూ అలా ఆ రోజును కూడా టీచర్స్‌కి పని చెబుతున్నారు. మరికొన్ని ప్రతీ శనివారం హాఫ్ డే స్కూల్ పెడుతున్నం అంటున్నాయి. అది కూడా భారం వెయ్యటమే. కావున ప్రైవేట్ పాఠశాలలు తప్పక సెలవులు ఇవ్వాలి. రెండవ శనివారం తప్పక సెలవు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. డైరెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే ఆర్డర్స్ ఇస్తామని నాయకులకు తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు 70% మాత్రమే విద్యార్థులకు వచ్చాయని, మిగతా పెండింగ్ పాఠ్యపుస్తకాలు తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25% ఉచిత సీట్లు ఇవ్వాలని ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల పనిచేస్తున్న టీచర్లకు ప్రభుత్వ టీచర్ల మాదిరిగా ఉద్యోగ భద్రత కల్పించి, రెండవ శనివారం సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది. అందువల్ల ప్రైవేట్ కార్పోరేట్ స్కూల్స్ తప్పక సెలవులు ఇవ్వాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



చేవెళ్ల, జూలై 10 (జనంసాక్షి) : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రెడ్డిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద వార్డులోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు తదితర సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి తేడా కనబడకుండా ఉండేందుకు ఇలాంటి మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన చదువు కోసం కావలసిన వస్తువు సామాగ్రిని అందిస్తున్నామని తెలియజేశారు. పిల్లలు ఇలాంటి సదుపాయాలను ఉపయోగించుకొని ఉన్నత చదువులు చదివి గ్రామానికి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఆయన సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు సంగీత ఉపాధ్యాయులతో కలసి దాతలను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి శెట్టి కుటుంబ సభ్యులు వీరయ్య, నర్సింలు, ప్రకాశం, ప్రభు, సాయి సచిన్, సత్యసాయి సేవా సమితి ఇంచార్జీ లు అయ్యంగారి గోపాలచారి, చేగురి మాణిక్యం రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్వరాజ్య స్థాపనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం, జూలై 10 (జనం సాక్షి) : గ్రామ స్వరాజ్యం స్థాపన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం రోజున మంచాల మండల పరిధిలోని లింగంపల్లి, తాళ్లపల్లిగూడ, తిప్పాయిగూడ ,చిత్తాపూర్ ,రంగాపూర్, చీదేడు, గ్రామాల్లో పర్యటించినఆయన రూ.1కోటి 16 లక్షల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో మంచాల మండలంను అభివృద్ధి కి ఆమడ దూరంలో ఉంచారని ఏ ఒక్క గ్రామంలో అభివృద్ధి జరుగలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే అత్యధిక నిధులు తీసుకొచ్చి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని రాబోయే రోజుల్లో అన్ని గ్రామాలను అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచి గ్రామ స్వరాజ్యం స్థాపించడమే లక్ష్యంగా ముందుకెళ్తామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, భూపతిగల్ల మహిపాల్, పాండురంగారెడ్డి, గుండమోని జయమ్మ ,మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వింజమూరి రాంరెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు బైరిక రమాకాంత్ రెడ్డి, చీమల జంగయ్య యాదవ్, వింజమూరి ప్రేమాకర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, వీరేష్ గౌడ్, పెర్క మూర్తి, జిలమోని సత్తయ్య, నూతనగంటి సధానందం, జెనిగ వెంకటేష్, అనంగల్ల యాదయ్య, సుంకరి పాండరీనాథ్, ఎర్పుల యాదయ్య, కిషన్ నాయక్, కారింగు జంగయ్య గౌడ్, ముచ్చర్ల వెంకటేష్ గుడిమల్ల చంద్రయ్య, మాసయ్య గౌడ్, మార సురేష్ ,ఎర్పుల రాజు, ఎంపీడీఓ బాలశంకర్ ఎమ్మార్వో ప్రసాదరావు ,పంచాయతీ రాజ్ డీఈ ఇంద్రసేనారెడ్డి, ఏఈ మల్లారెడ్డి తతదితరులు పాల్గొన్నారు.

## నీటి వనరుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి



ఉర్కొండ, జూలై 10 (జనం సాక్షి) : నీటి సంరక్షణ పారుదల సామర్థ్యాన్ని పెంచి నీటి వనరుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని జల శక్తి అభియాన్ సెంట్రల్ సభ్యులు తెలియజేశారు. ఊర్కొండ మండల పరిధిలోని ఇప్పపహాడ్ గ్రామాన్ని జల్ శక్తి అభియాన్ సెంట్రల్ సభ్యులు ఎంపీడీవో కృష్ణయ్య ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది. ఇప్పపహాడ్ గ్రామ పరిధిలో 2022-23 సంవత్సరంలో ఎర్రకుంట చెరువులో పూడికతీత పనులు చేపట్టిన వివరాలను పరిశీలించడం, ఆ పనికి సంబందించిన అన్ని అనుమతులు, రికార్డులు పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సభ్యులు ఏకసభ్య అధికారి పవార్, చంద్రశేఖర్ (ఏపీడీ) నర్సింహా(ఏపీఓ), లక్ష్మణ్(ఎంపీఓ), పవన్, క్రాంతి డిఆర్డిఏ అధికారులు, జగన్ లాల్, ఈ. సి, భారతమ్మ,రోజా, వాసుదేవ్, టి. ఏ. లు, పద్మ, పంచాయతీ కార్యదర్శి, కృష్ణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## పరిశ్రమల పేరుతో భూములు లాక్కోవడం దారుణం



సంగారెడ్డి ప్రతినిధి, జూలై 10 (జనం సాక్షి) : పరిశ్రమల పేరుతో భూములు లాక్కోవడం దారుణమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో నెలకొన్న ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పీ. ప్రావీణ్యను గురువారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కలిశారు. బిఆర్ఎస్ శ్రేణులతో కలసి కలెక్టర్ కు సమస్యలపై ఎమ్మెల్యే తన లెటర్ ప్యాడ్ తో ఉన్న వినతి పత్రం అందజేశారు.కొండాపూర్ మండలం మందాపూర్, మునిదేవునిపల్లి గ్రామాలలో పరిశ్రమల పేరుతో రైతులు సాగు చేస్తున్న భూములను ప్రభుత్వం లాక్కోవాలని చూస్తుందన్నారు. రైతుల నుంచి భూములను లాక్కుంటే రైతులు రోడ్డున పడుతారాని అన్నదాతల బతుకులు చిన్నాభిన్నం చేసేలా ప్రభుత్వం ప్రతిపాదనలు ఉంచడం సరికాదన్నారు. మునిదేవుని పల్లి గ్రామంలోని (92) (112) (154) సర్వే నెంబర్ లలో 293 ఎకరాల భూమి, మందాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 22లో 321 ఎకరాల భూమి మొత్తం 614 ఎకరాలు దళితులు ,బీసీల భూములను పరిశ్రమల పేరుతో లాక్కోవడం సరికాదన్నారు. అలియాబాద్ , తోగర్ పల్లి గ్రామాలలో శివారులో 43 ఎకరాలు రైతులకు సమాచారం ఇవ్వకుండా ముందస్తు పొజిషన్ తీసుకున్నారని, అక్కడి భూమి విలువ రూ.రెండున్నర కోట్లు చొప్పున ఉందన్నారు. సంగారెడ్డి ,సదాశివపేట పట్టణాలలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ పనులు పూర్తి స్థాయిలో త్వరగా పూర్తి చేయాలని కోరారు. సదాశివపేట ఎంపీపీ బిల్డింగ్ మిగిలిన పనులకోసం రూ.85 లక్షలు మంజూరు చేయాలని కోరారు. సిద్ధాపూర్ రోడ్డు పనులు పూర్తి కాకముందే సంబంధిత కాంట్రాక్టర్ వెళ్లి పోయాడని రోడ్డు పనులు పూర్తి చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్ ఉన్నారు.

## ఎర్లీచైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్‌కు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన మెదక్ జిల్లా కలెక్టర్




మెదక్, జులై 10 (జనం సాక్షి) : కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్(చిన్ననాటి విద్య)పై నేషనల్ వర్క్ షాప్?కు ప్రత్యేక ఆహ్వానితులుగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్(చిన్ననాటి విద్య) పై ఢిల్లీలో నేషనల్ వర్క్ షాప్ నిర్వహించగా కలెక్టర్? ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఢిల్లీలో జరిగిన జాతీయ సమావేశంలో మాట్లాడుతూ...జాతీయ సమావేశానికి తెలంగాణ నుంచి మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనిత రామచంద్రన్ ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిచినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అంగన్?వాడీ కేంద్రాల్లో అమలవుతున్న నూతన కార్యక్రమాలు, పిల్లలకు ప్రైమరీ శిక్షణ, కొత్త యూనిఫారాలు అందించడం వంటి తదితర ఇతర పోషణ శిక్షణకు సంబంధించిన కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశానికి ఆయా రాష్ట్రాల ప్రతినిధులలు సైతం తమ రాష్ట్రాల్లో అమలవుతున్న పథకాలు, చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

## జంట జలాశయాల పరిధిలో 4 ఎస్టీపీలు



హైదరాబాద్, జూలై 10 (జనంసాక్షి) : జంట జలాశయాలలోకి మురుగు చేరకుండా పరిరక్షించడంకోసం కొత్తగా చేపట్టిన 4 ఎస్టీపీల నిర్మాణ పనులను గురువారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ల (ఎస్టీపీల) నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎండీ. అశోక్ రెడ్డి పేర్కొన్నారు. మొదటగా కొత్వాల్ గూడ ఎస్టీపీ నిర్మాణ పనులను పరిశీలించి, వేగవంతం చేయమని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఎస్టీపీకి కేటాయించిన భూమిని చుట్టూ ఫెన్సింగ్ చేసి, సరిహద్దులను సరిచూసుకోవాలని సూచించారు. అలాగే, సీవరేజ్ మాస్టర్ ప్లాన్లో భాగంగా కలవని, జీఓ-11 పరిధిలో రాని ప్రాంతాన్ని గుర్తించి, 2050 సంవత్సరం వరకు ఉత్పన్నమయ్యే మురుగును అంచనా వేసి దానిని శుద్ధి చేయడానికి అవసరమయ్యే ఎస్టీపీల నిర్మాణం, తదితర అంశాలను అధ్యయనం చేయాలని అధికారులను సూచించారు. అలాగే నిర్మాణ సమయంలో కార్మికుల భద్రతకు పెద్దపీఠ వేయాలని, తప్పనిసరిగా రక్షణ చర్యలను పాటించాలని అన్నారు. అనంతరం నాగిరెడ్డగూడ ఎస్టీపీలను పరిశీలించిన సమయంలో.. స్థానికులు ఎండీని కలిసి ఎస్టీపీకి ఆనుకుని గతంలో రహదారి ఉండేదని, దానిని అలాగే ఉండేలాగా చర్యలు తీసుకోవాలని కోరారు. దానికి స్పందించిన ఎండీ.. స్థానిక రెవెన్యూ అధికారులను పిలిచి, పంచనామా చేసి తగు నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

# సమాజంలో మీడియా పాత్ర చాలా విలువైనది

- మేడ్చల్ జిల్లా టియూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాల్ రాజు

శామీర్‌పేట, జూలై 10 (జనం సాక్షి) : పత్రికల విలువలు ఎల్లప్పుడూ శాశ్వతంగా ఉంటాయని టి యూ డబ్ల్యు జే మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాల్ రాజు అన్నారు. ఉమ్మడి శామీర్ పేట మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడు క్యాతం రవి ఆధ్వర్యంలో బుధవారం శామీర్ పేట ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో సోషల్ మీడియా ప్రభావం ఎంతున్నా ప్రింట్ మీడియా విలువ తగ్గలేదన్నారు. పత్రిక విలువలు ఎల్లప్పుడూ శాశ్వతంగా ఉంటాయని, వాటిని మనం కాపాడుకోవాలని తెలిపారు. ఉమ్మడి శామీర్ పేట మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షులు క్యాతం రవికి, కార్య వర్గానికి శు భాకాంక్షలు చెప్పారు. అనంతరం శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్



శ్రీనాథ్ మాట్లాడుతూ.. ప్రెస్‌క్లబ్ అనేది ఫోర్త్ ఎస్టేట్ అని, రాజ్యాంగంలో సైతం మీడియా పాత్ర ప్రస్తావించారన్నారు. సమాజంలో ఏం జరుగుతుందో తెలువాలంటే విలేకరుల పాత్ర కీలకమని, ప్రతి రంగంలో పొర పాట్లు జరుగుతాయని, వాటిని శృతి మెత్తగా పరిష్కరించు కోవాలన్నారు. నిజం నిర్భయంగా వెలికి తీసేది మీడియా అన్నారు. నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ఏఎంసి చైర్మన్ నర్సింలు యాదవ్ మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఎల్లవేళలా మా సహాయ సహకారం ఉంటుంద న్నారు ప్రెస్ క్లబ్ కార్యాలయానికి స్థలం కేటాయించడానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా టీ యూ డబ్ల్యు జే ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, జీనోమ్ వ్యాలీ పోలీస్ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డి లు ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి అభినందనలు చెప్పారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, మండలం టిఆర్ఎస్ అధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి, శామీర్ పేట డిఐ రాజు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఇంటలిజెన్స్ రవీందర్, ఏ ఎం సి డైరెక్టర్ శ్వేత, కాంగ్రెస్ నేత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇంటి కలను నెరవేర్చడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్

జవహర్‌నగర్, జూలై 10 (జనంసాక్షి) : పేదల ఇంటి కలను నిజం చేయగలదు ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, నిరుపేదలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులైన దివ్యభారతి ఇంటి నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ



డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జె.ఎం.సి అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీనివాస్ మాట్లాడుతూ, “అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లను సాధించేందుకు నేను ప్రయత్నిస్తాను” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీమన్నారాయణ రాజు, ఎఇ నారాయణ, వార్డ్ ఆఫీసర్ బుజ్జి వినయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మీడియా రాజకీయ నాయకుల విలువను పెంచే విధంగా ఉండాలి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్
- మీడియా స్వేచ్ఛపై రౌండ్ టేబుల్ సమావేశం..
- హాజరైన వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రజాసంఘాల నేతలు
- జనంసాక్షి ఎడిటర్ రహమాన్‌పై పెట్టిన అక్రమ కేసులను ఖండించిన జర్నలిస్టులు ప్రజాసంఘాల నేతలు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 10 (జనంసాక్షి) : నేటి సమాజంలో మీడియా పత్రికలు రాజకీయ నాయకులు విలువను పెంచే విధంగా ఉండాలని కొన్ని సందర్భాల్లో సమన్వయం పాటించాలని షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ప్రస్తుతం సమాజంలో మీడియా స్వేచ్ఛ మరియు మీడియా సంస్థలపై జరుగుతున్న దాడులు పరిణామాలపై రౌండ్ టేబుల్




సమావేశం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు జర్నలిస్టులు హాజరయ్యారు నిజాలు రాసే జర్నలిస్టులపై అక్రమ కేసులు పెడుతున్నారని జనంసాక్షి ఎడిటర్ రేహమాన్‌పై కూడా అలాంటి అక్రమ కేసులె పెట్టారని జనంసాక్షి దినపత్రిక మొదటి నుండి కాలుష్య కారకమైన ఇత్తనలు ఫ్యాక్టరీ యాజమాన్యం అవలంబిస్తున్న విధానాలపై సంచలనమైన కథనాలను ప్రచురించిందని దాన్ని జీర్ణించుకోలేకనే ఆయనపై అక్రమ కేసు పెట్టారని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మిద్దెల సత్యనారాయణ అన్నారు అదేవిధంగా భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు పాలకులు తూట్లు పొడుస్తున్నారని వివిధ రాజకీయ పార్టీల నేతలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు బిజెపి నేతలు అందే బాబయ్య పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మహేందర్ రెడ్డి సిపిఎం నేత రాజు ఈశ్వర్ కాంగ్రెస్ నేతలు పీ.రఘు చెంది తిరుపతిరెడ్డి పురుషోత్తరెడ్డి జర్నలిస్టులు మోహన్ రెడ్డి ఎండి ఖాజాపషా రాఘవేందర్ గౌడ్ నరేష్ నరసింహారెడ్డి మల్లేష్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
11 జూలై 2025

# రహదారులు ఇలా..నడిచేది ఎలా..!

- చినుకుపడితే చిత్తడిగా కాలనీలా రోడ్లు
- అధ్వాన రోడ్లతో కాలనీ ప్రజల అవస్థలు
- రోడ్లు వేయించాలని కోరుతున్న కాలనీ ప్రజలు



**సంగారెడ్డి, జూలై 10 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి లోని వివిధ కాలనీలలో రోడ్లు అధ్వానంగా మారి కాలినడకన నడవలేని స్థితికి చేరుకున్నాయి. పోతిరెడ్డిపల్లిలోని గణేష్ నగర్, ఆదర్శనగర్, కాకతీయ నగర్, శిల్పా వెంచర్ తదితర కాలనీలలో చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారి వాహనదారులకు, కాలినడకన వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అనేకసార్లు చెప్పినప్పటికీ స్పందించడం లేదని ఆయా కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ వర్షాలకే రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. దీంతో సమీప ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. చినుకు పడితే చిత్తడిగా మారి నడక నరక ప్రాయంగా మారుతోంది. నిల్వ ఉన్న నీటిపై దోమలు చేరి ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరు తున్నారు.

### అధ్వాన రోడ్లను బాగు చేయండి



సంగారెడ్డి పట్టణం 29వ వార్డు పరిధిలోని గణేశ్ నగర్, అలాగే ఆదర్శ నగర్, కాకతీయ నగర్ రోడ్లు అద్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షానికి రోడ్లు చిత్తడిగా మారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మించాలని మున్సిపల్ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదు మున్సిపల్ అధికారులు స్పందించి త్వరగా రోడ్డు వేయించాలి.

**శ్రీకాంత్, బీజేపీ యువ నాయకులు**

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

- ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి రవీందర్ రెడ్డి



**నంగునూరు, జూలై 10 (జనంసాక్షి) :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ సిద్ధిపేట జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి సూచించారు. సిద్ధిపేట జిల్లా నంగునూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యా బోధన ఎలా జరుగుతోందని ఆరా తీశారు. వివిధ సబ్జెక్టుల వారీగా విద్యా ప్రమాణాలు పరీక్షించారు. అంతరం కళాశాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. కళాశాలలో ప్రవేశాల సంఖ్యను పెంచాలని సూచించారు. విద్యార్థులు తరగతులకు సక్రమంగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు గైర్హాజరు కాకుండా తల్లిదండ్రులతో తరచుగా సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపన్యాసకులు జ్యోతి, భీంరావు, భరత్, రమేశ్, రామకృష్ణ, అరుణ్ కుమార్, నవీన్ కుమార్, శివశంకర్, స్వామి, అశోక్, కరుణదీప్తి పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- నారాయణపేట శాసన సభ్యురాలికి వినతి



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 10 (జనం సాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని నారాయణపేట ఎమ్మెల్యే ,తెలంగాణ టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిట్టెం పరిణిక రెడ్డికి బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీలకు 42% రిజర్వేషన్స్ కల్పించి తెలంగాణలోని పంచాయతీ రాజ్ చట్టం 2018 ని మార్చాలి, ఎన్నికల్లో ఆంక్షలు లేకుండా పోటీ చేయుటకు అవకాశం కల్పించాలి, బీసీ ఐక్యవేదిక వారి తరపున ప్రభుత్వానికి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా తెలియపరచాలని తెలంగాణలోని ప్రజలు ఆకాంక్షలను ఆశయాలను నెరవేర్చాలని, ప్రభుత్వమైనా ప్రజలకు న్యాయం చేయాలంటే ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అన్ని రంగాల్లో కల్పించి సొంత నిర్ణయం తీసుకుని అధికారం కల్పించాలంటే పంచాయతీ రాజ్ చట్టం 2018ని మార్చాల రిజర్వేషన్స్‌లో మహిళా రిజర్వేషన్స్ కోటలో బీసీ మహిళల వాటా తెల్పాలి. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆంక్షలు లేకుండా పోటీ చేసే అవకాశాన్ని కల్పించాలి, తెలంగాణలో పంచాయతీరాజ్ చట్టం 2018 సవరించి దాని స్థానంలో పాత చట్టాన్ని అమలు చేసిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాల్సిందిగా బీసీ ఐక్యవేదిక తరపున ఎమ్మెల్యేని కోరినారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు. రాజు ప్రజాపతి ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో మెరుగైన వసతులు

- త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 10 (జనం సాక్షి) :** డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు మెరుగైన వసతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, ప్రధానమంత్రి కార్యాలయ అధికారిని మన్మిత్ కౌర్ పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, డబుల్ బెడ్ రూమ్ పథకాలలో పక్క ఇల్లు నిర్మించి ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు. గురువారం ప్రధానమంత్రి కార్యాలయ అధికారిని మన్మిత్ కౌర్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వి కర్ణన్ లతో కలిసి కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో జరిగిన ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన రెండు పడక గదుల ఇండ్లను ప్రధానమంత్రి కార్యాలయ అధికారిని మన్మిత్ కౌర్, కలెక్టర్ ప్రావిణ్య, జిహెచ్ఎంసి కమిషనర్లు పరిశీలించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో గల వసతులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు మెరుగైన వసతుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు, బ్యాంక్ సౌకర్యాలు, పోస్ట్ ఆఫీస్ ప్రైమరీ ఇంటర్ సెంటర్ అంగన్వాడి కేంద్రం,ప్రభుత్వ పాఠశాలు, ఇతర సౌకర్యాలు, వసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. దీంతోపాటు మెరుగైన రవాణా వసతుల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2 బీహెచ్‌కె కాలనీ నుండి హైదరాబాదులోని అన్ని ప్రాంతాలకు బస్సు రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. లబ్ధిదారులు తమ వాటాగా పరిసరాల పరిశుభ్రత కోసం కృషి చేయాలని సూచించారు. తమ ఇండ్ల ఆవరణలో పచ్చని చెట్లు మొక్కలు నాటడం వల్ల ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని ఆ దిశగా లబ్ధిదారులకు కృషి చేయాలని అన్నారు. అనంతరం అల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం సమీపంలో మహిళా సాధికారతలో భాగంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను అధికారులు పరిశీలించారు స్వశక్తితో క్యాంటీన్ నడిపిస్తున్న మహిళలను అభినందించారు. మహిళాసాధికారత, మహిళల ఆర్థిక స్వాలంబనకోసం రాష్ట్ర ప్రభుత్వం మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా వివిధ వ్యాపారాలలో రాణించడానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ ఏం .చైతన్య కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్యాధికారిణి గాయత్రీదేవి , సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్ రెడ్డి , తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్, గృహనిర్మాణ శాఖ అధికారులు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## శంకుస్థాపనలు చేసిన వాటికే మళ్ళీ శంకుస్థాపలు

- ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎన్నికల కోసమే శంకుస్థాపనల నాటకమా
- బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి, మండల నాయకుడు జంగిలి ప్రవీణ్




**వెల్దండ, జూలై 10 (జనంసాక్షి) :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేశాడని, తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ శంకుస్థాపనలు చేయడంలో ఆంతర్యం ఏమిటని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు జంగిలి యాదగిరి, మండల నాయకుడు జంగిలి ప్రవీన్ లు ప్రశ్నించారు.. గురువారం వెల్దండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసే విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముగ్గురు మంత్రుల బృందం కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడాన్ని హర్షిస్తున్నామని, అయితే ఇంతకుముందే చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపన చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా అని ప్రశ్నించారు. శంకుస్థాపనల పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజాధనాన్ని దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో, అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అక్టోబర్ 1 తేదీ 2023న 100 పడకల ఆసుపత్రికి శిలాఫలకం వేశారని గుర్తు చేశారు. వెల్దండ నుంచి చారకొండ వరకు రెండు వరుసల బీటీ రోడ్డుకు మంజూరు ఇవ్వడం జరిగిందన్నారు. మంత్రుల బృందం ప్రారంభించే పనులను బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రారంభానికి శ్రీకారం చుట్టారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నాటకాలకు తెరతీస్తుందని ఆరోపించారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని,స్థానిక సంస్థల ఎన్నికల్లో కంగు తినడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ఉద్యమ కారుడు ఎంఎస్ గౌడ్, జంగిలి రవి,మట్ట రఘు గౌడ్ , గోరేటి రాజు,గోరటి దశరథం, బర్కాం గణేష్ ఉన్నారు.

## దళిత కుటుంబంపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలి

**శివ్వంపేట, జూలై 10 (జనంసాక్షి) :** శివ్వంపేట మండలం బిజిలీపూర్ గ్రామంలో దళిత కుటుంబాన్ని కులం పేరుతో దూషిస్తూ, దళిత మహిళ పై దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టు చెయాలని, దళితులకు రక్షణ కల్పించాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. బిజిలీ పూర్ లో దాడికి గురైన ఆశయ్య, శ్యామల కుటుంబాన్ని గురువారం దళిత బహుజన ఫ్రంట్ బృందంతో కలిసి శంకర్ పరామర్శించి, దళితులతో సమావేశమై దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ మాట్లాడుతూ తొలి ఏకాదశి పండుగ రోజున దళిత యువకులు రాంచరణ్, సాయి వర్దన్ లు స్థానిక కిరాణా షాపులు వస్తువులు తీసుకొని తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అనవసరంగా జోక్యం చెసుకొని దూషించి దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకొని అక్కడికి వెళ్ళిన అన్నదమ్ములైన పెద్దల్లో నవీన్, ప్రవీణ్, ప్రభు, మధును నిలదిసి ప్రశ్నించగా అడ్డం పొయిన దళిత మహిళ శ్యామల ఆమె భర్త ఆశయ్య లను సైతం కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారన్నారు. అదె రోజు బాధితులు శివ్వంపేట పోలీస్ స్టేషను వెళ్ళగా బాధితులను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి లొ చికిత్స చెయించారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు తుమ్మల మధు మరో అయిదుగురి పై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసినందున నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని శంకర్ డిమాండ్ చేశారు. ఈ కేసును ఉపసంహరించుకొవాలని బాధితులపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు.

రాజీ చెసుకొకపొతే సామాజిక బహిష్కరణ చెస్తామని హెచ్చరిస్తున్నందున పొలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకొవాలన్నారు. సామాజిక బహిష్కరణ కు పాల్పడే ప్రమాదం వున్నందున జిల్లా కలెక్టర్ ,ఎస్పీ లు గ్రామాన్ని సందర్శించి పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి దళితులకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ళకల్ నర్సింలు, డిబిఎఫ్ జిల్లా నాయకులు గౌతోజిగూడెం చంద్రం, దొంతి నర్సింలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు ఆర్థికంగా ఎదగాలి



**వీపనగండ్ల, జూలై 10 (జనం సాక్షి) :** జిల్లా మహిళా సమైక్య నూతన కార్యవర్గాన్ని షర్పు ప్రాజెక్టు మేనేజర్ భారతి జిల్లా మహిళా సమైక్య మాజీ ఓబీలు మహిళా ఈసీల అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా మహిళా సమైక్య సభ్యులకు నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలుగా కే స్వరూప పెద్దమందడి మండలం కార్యదర్శిగా మదనాపూర్ మండలం కే జయలక్ష్మి, కోశాధికారిగా ఎత్తం చిట్టెమ్మ( వీపనగండ్ల) కోశాధికారిగా ఎన్నుకున్నట్లు అధికారులు తెలిపారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైనటువంటి అధ్యక్ష కార్యదర్శులు మహిళా సమైక్య అభివృద్ధి కోసం తమ సమయాని కేటాయించి అందరి సభ్యులను కలుపుకొని పనిచేస్తామని అన్నారు. గతంలో పనిచేసినటువంటి కార్యవర్గం స్పూర్తితో పనిచేస్తామని అన్నారు. ప్రభుత్వం నుండి మహిళా సంఘాలకు మహిళా శక్తి ద్వారా అందే సంక్షేమ, జీవనోపాధి కార్యక్రమాలు మహిళా సంఘ సభ్యుల వరకు చేరేటట్లు పని చేయాలని కోరారు.జిల్లా కోశాధికారిగా ఎన్నికైన ఎత్తం చిట్టెమ్మ మాట్లాడుతూ సంఘాలు ఆర్థిక అభివృద్ధి చెందే దిశగా కృషి చేస్తానని, మహిళలు ఆర్థికంగా ఎదగాలని మహిళలకు ఆర్థిక స్వాతంత్రం ఉండాలని అన్నారు.మహిళా సంఘాల్లోని సభ్యులకు స్వయం ఉపాధి కోసం బ్యాంకులు రుణాలు తోడ్పాటు అందించాలని, మహిళా సంఘాల్లోని సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని సకాలంలో బ్యాంకులకు రుణాలు చెల్లించాలని చెల్లించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వివిధ మండలాల మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కోశాధికారి ఎత్తం చిట్టెమ్మను సభ్యులు సాల్వాతో సన్మానించారు.

## ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలి

**గద్వాల నడిగడ్డ, జూలై 10 (జనం సాక్షి) :** రైతులు ఆర్థికంగా మెరుగుపడేలా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తీసుకున్న పూర్తిస్థాయి అవగాహన కల్పించి, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో వ్యవసాయ మౌలిక సదుపాయాల రుణాలు, ఆయిల్ పామ్ సాగు,సంబంధిత వ్యవసాయ రుణాల అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు కీలకం కావడంతో, వాటిని ప్రతి రైతుకు చేరవేసి సద్వినియోగం చేసుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. నానో సాంకేతికత ఆధారిత ఎరువుల వినియోగం ద్వారా తక్కువ పరిమాణంలో అధిక ప్రభావాన్ని పొందుతూ, మట్టిసారాన్ని కాపాడడం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచాలని సూచించారు.చిన్న ఆహార ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించేందుకు 'ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్' పథకం ద్వారా 35 శాతం వరకు పెట్టుబడిపై సబ్సిడీ లభిస్తుందని వివరించారు. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి పథకం ద్వారా రైతులు, వ్యవసాయ సంస్థలు రూ.2 కోట్ల వరకు రుణాలను 3% వడ్డీ సబ్సిడీతో గోదాములు,కోల్డ్ స్టోరేజ్‌లు, ప్రాసెసింగ్ యూనిట్లు వంటి



మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడుతోందని తెలిపారు. పశు సంవర్ధక అభివృద్ధికి నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ అమలు చేయబడుతోందని, ఇందులో పశుపాలకులు, గొర్రెలు,మేకలు పెంచే రైతులు 50 శాతం వరకు సబ్సిడీ పొందే అవకాశముందని పేర్కొన్నారు.మత్స్యకారుల కోసం ప్రవేశపెట్టిన కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం ద్వారా రూ. 50,000 వరకు రుణం లభిస్తుందని తెలిపారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రధాన మంత్రి ఉపాధి హామీ పథకం ఉపయోగపడుతుందని, 25%-35% శాతం సబ్సిడీ లభిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇచ్చే ఉత్తమ అవకాశం కావడంతో,అంతర పంటల ఆదాయం, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై రాయితీలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు రైతులకు స్థిర ఆదాయాన్ని కల్పిస్తున్నాయని,అధికారులు వీటిపై రైతులకు పూర్తి అవగాహన కల్పించి విజయవంతమైన రైతులను రోల్ మోడల్స్‌గా చూపిస్తూ ఇతరులను ప్రోత్సహించాలని సూచించారు. పంట సీజన్‌కు క్రాప్ బుకింగ్ ప్రక్రియను సమయానికి,సరైన విధంగా పూర్తి చేసి,రైతులకు అవసరమైన వనరులు ముందుగానే అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ అధికారులు, పశు సంవర్ధక,మత్స్య శాఖ అధికారులు ప్రతి గ్రామ పంచాయితీ,రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులకు సమాచారాన్ని సులభంగా అందించేలా బ్యాంకులు కూడా సహకరించాలని సూచించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను ప్రతి రైతు ఉపయోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఉద్యాన దర్శిని పుస్తకాన్ని విడుదల చేసి, ఇది రైతులకు ఉపయోగకరమైన మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, ఎల్.డి.యం శ్రీనివాస రావు, ఉద్యానశాఖ జాయింట్ డైరెక్టర్ రామలక్ష్మి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి అక్బర్,నాబార్డ్ అధికారులు మనోహర్ రెడ్డి, భుజంగ రావు,పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, మత్స్య శాఖ అధికారి షకీలా భాను,మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టుకున్న మునిపల్లి పోలీసులు



**సంగారెడ్డి, జూలై 10 (జనం సాక్షి) :** మునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద స్కూటీపై ఎండు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని మునిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ వివరాల ప్రకారం గురువారం 9 గంటల ప్రాంతంలో జహీరాబాద్ వైపు నుండి హైదరాబాద్ వైపు యాక్టివా స్కూటీ టీజీ 09 బి 0821 పై వెళ్తున్న వ్యక్తి వాహనము ఆపి తనిఖీ చేయగా 6 కిలోల400 గ్రాముల గంజాయి లభించినట్లు ఎస్సై తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై రాజేష్ నాయక్, ఏఎస్ఐ బక్కన్న సిబ్బంది ఎండి హనీఫ్, పాండు, సునీల్‌తో కలిసి కంకోల్ టోల్ ప్లాజా వద్ద వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఎండు గంజాయి లభించినట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తిని విచారించగా ముహమ్మద్ సమీర్ గా తెలిపారని, గాంజాను బీదర్‌లో ఇరానీ గల్లీలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపినారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఇట్టి కేసులో నేరస్తులను చాకచక్యంగా పట్టుకొని అతని వద్ద నుండి 6 కేజీల400 గ్రాముల గాంజాను స్వాధీనం చేసుకున్న పోలీస్ సిబ్బందిని కొండాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుమన్ కుమార్ అభినందించారు.

# పోలీసులమంటూ బెదిరించి డబ్బులు వసూలు

### నకిలీ పోలీసుల ముఠా అరెస్ట్

### తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, చెన్నైలలో రూ18 లక్షల మోసం




**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** పోలీసులమంటూ బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ పోలీసుల ముఠాను గురువారం అరెస్టు చేసి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా లోని ఇచ్చోడ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొంత మంది నకిలీ పోలీసుల అవతారం ఎత్తి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. ఈ విషయంపై వెంటనే విచారణ చేపట్టి నకిలీ పోలీసుల గుట్టు రట్టు చేసి నిందితులను అరెస్టు చేయడం జరిగింది. 2025 జూన్ 27న ఇచ్చోడ ఎస్ఐ వి.పురుషోత్తంకు కొండొజు నరసింహచారి అనే వ్యక్తి ఫోన్ చేసి, తన సోదరుడు చేపురి సతీష్ కుమార్‌కు 6301395160 నంబర్ నుండి కాల్ వచ్చిందని, అవతలి వ్యక్తి తాను ఇచ్చోడ పీఎస్ ఎస్ఐ నర్సిరెడ్డిని అని పరిచయం చేసుకుని, నాలుగు సంవత్సరాల క్రితం 11 గ్రాముల దొంగ బంగారం కొన్నారని, కేసు కాకుండా ఉండాలంటే ఫోన్‌పే/గూగుల్ పే ద్వారా డబ్బులు పంపాలని చెప్పారని ఫిర్యాదు చేశారు. అనుమానం వచ్చి, ఎస్ఐ ఇచ్చోడ అధికారిక నంబర్‌కు ఫోన్ చేయగా, అది నకిలీ పోలీసు అని తెలిసింది. వెంటనే ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 208/2025, సెక్షన్ 308(2) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతుండగా, 2025 జూలై 4న రుద్రంగి కిరణ్ కుమార్ హైదరాబాద్ నివాసి అనే వ్యక్తి ఇచ్చోడ ఎస్ఐకి ఫోన్ చేసి, బాధితునికి 9866193420 నంబర్ నుండి కాల్ చేసి ఎస్ఐ నర్సిరెడ్డి, ఇచ్చోడ పోలీస్ స్టేషన్ నుండి మాట్లాడుతున్నానని బుకాయించి, దొంగ బంగారం కొన్నారని బెదిరించి డబ్బులు పంపమని కోరగా, గూగుల్ పే ద్వారా రూ.150 పంపినట్లు తెలిపారు. తర్వాత అనుమానం వచ్చి ఎస్ఐ ఇచ్చోడ కు తెలియజేయగా, అది కూడా నకిలీ పోలీసు అని తెలిసింది. రెండవ కేసు వెంటనే ఇచోడ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 215/2025, సెక్షన్ 318(4), 308(2), 317 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేశారు. నిందితుల విచారణలో షేక్ ఇర్ఫాన్ తన నేరాన్ని అంగీకరించాడు. తాను జల్సాలకు అలవాటు పడి కొన్ని సంవత్సరాలుగా గూగుల్ ద్వారా నగల షాపుల వివరాలు తెలుసుకుని వారికి కాల్ చేసి, తాను ఎస్ఐని అని, రెండు సంవత్సరాల క్రితం ఒక జంట వద్ద నుండి 11 గ్రాముల దొంగ బంగారం కొన్నారని, మీపై కేసు నమోదు అవుతుందని బెదిరించి డబ్బులు వసూలు చేసేవాడినని తెలిపాడు. ఈ నేరంపై గతంలో 2023లో నల్గొండ టు టౌన్‌లో క్రైమ్ నంబర్ 123/2023, సెక్షన్ 419, 384 ఐపీసీ కింద, 2025లో హుజూర్‌నగర్ పీఎస్‌లో క్రైమ్ నంబర్ 50/2025, సెక్షన్ 318(4), 308(2) బీఎన్ఎస్ కింద కేసులు నమోదైనట్లు వెల్లడించాడు. మార్చిలో జైలు నుండి విడుదలయ్యాక తిరిగి జల్సాలకు అలవాటు పడి, గత మూడు నెలల్లో హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, చెన్నై నగరాల్లోని ఆభరణాల షాపుల యజమానులకు ఫోన్ చేసి దాదాపు రూ.18 లక్షలు వసూలు చేసి జల్సాలకు వాడుకున్నాడని తెలిపాడు. ఈ డబ్బులతో ఒక బెలానో వాహనం, కొనుగోలు చేసిన బుల్లెట్ మోటార్ సైకిల్, బజాజ్ మాక్సిమా ఆటోరిక్షా, 1.36 గ్రాముల బంగారం, 14 తులాల వెండి కాలిపట్టీలను తన భార్యకు ఇచ్చినట్లు తెలపగా, అదేవిధంగా మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎ2 చింతలచెరువు ప్రశాంత్ తన లారీ క్లీనర్ పని చేస్తూ, గూగుల్ మ్యాప్స్‌పై అవగాహన ఉండటంతో షేక్ ఇర్ఫాన్‌తో కలిసి జ్యువెలరీ షాపుల వివరాలను తన ఫోన్‌లో చూసి, యజమానుల నంబర్‌లు తీసుకుని వారికి పోలీసులు అని ఫోన్ చేసి బెదిరించి, ఇర్ఫాన్ డబ్బులు వసూలు చేయగా తనకు కొంత డబ్బు ఇచ్చేవాడని ఒప్పుకున్నాడు. ఎ3 బదనపూరి అజయ్, ఎ1, ఎ2లతో స్నేహం చేసి వారి నేరాలకు సహకరించాడు. ఎ4 బొప్పం సుధాకర్ తన మొబైల్ షాపులో ఈ డబ్బులను తన అకౌంట్‌లో జమ చేయించుకుని, ఆ డబ్బులను ఎ1కు ఇచ్చాడు. ఎ5 వోట్యూరి నరేష్ పెట్రోల్ బంకులో పని చేస్తూ, ఎ1 ఇర్ఫాన్ తన (నరేష్) ఖాతాలోకి డబ్బులు పంపించగా, వాటికి కమీషన్ తీసుకుని ఇర్ఫాన్‌కు ఇచ్చాడు. ఈ డబ్బులు దొంగ డబ్బులని తెలిసీ కూడా ఎ1 ఇర్ఫాన్‌కు సహకరించాడు. పైన పేర్కొన్న నిందితులను న్యాయమూర్తి రిమాండ్‌కు పంపడం జరిగింది. ప్రజలు ఇలాంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ , ఇచ్చోడా సీఐ బండారి రాజు, ఎస్ఐ వి పురుషోత్తం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బొజ్యానాయక్ తండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

### ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలను పునః ప్రారంభించిన కలెక్టర్



**నర్సంపేట జూలై 10 (జనం సాక్షి) :** నర్సంపేట మండలంలోని బోజ్య నాయక్ తండా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సత్య శారద గురువారం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గతంలో కొన్ని కారణాలవల్ల మూసివేయబడిన ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలను కలెక్టర్ పునః ప్రారంభించారు. భోజన నాయక్ తండాలో పాఠశాల పునః ప్రారంభానికి కృషి చేసిన బొజ్య నాయక్ తండా వారియర్స్ యువకులు, తండావాసులకు పాఠశాలలో స్వచ్ఛందంగా తరగతులు నిర్వహిస్తున్న యువకులకు కలెక్టర్ అభినందించారు. ఆమె మాట్లాడుతూ బోజ్యానాయక్ తండలో నూతన ప్రభుత్వ పాఠశాల గదుల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించగా నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి, మెరుగైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులకు లక్ష్యంతో చదివి భవిష్యత్తులో రాణించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ఉద్దేశంతో పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నదని, నూతన భవనం నిర్మాణం కోసం చర్యలు తీసుంటామని కలెక్టర్ అన్నారు."విద్య అనేది ప్రతి పిల్లవాడికి చేరాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, గ్రామాల అభివృద్ధికి బడి వెలుగు మార్గమని అన్నారు. గంగాదేవి పల్లి, మరియాపురం గ్రామాలతో పోటీపడి బొజ్జ నాయక్ తండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని, అందుకు కావలసిన ప్రణాళికలు రచించినచో ప్రభుత్వం పరంగా సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారికి గణిత శాస్త్రం, ఆంగ్లంలో పలు ప్రశ్నలు వేసి జవాబు రాబట్టారు. విద్యార్థులు ఇష్టపూర్వకంగా చదివి భావి భారత పౌరులుగా కావాలని ఆకాంక్షించారు. అంతకుముందు కలెక్టర్విద్యార్థులతో కలసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పలకలు పెన్నులు నోట్ బుక్స్ పెన్సిల్స్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఏసిపి రవీందర్ రెడ్డి. ఎంఈఓ సారయ్య, తహసిల్దార్ రవిచంద్ర రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలయి శ్రీనివాస్, వారియర్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అభ్యాసన సామర్థ్యాల్లో జిల్లా భేష్

### దేశ వ్యాప్తంగా 50 ఉత్తమ జిల్లాలో జనగామకు చోటు



**జనగామ ప్రతినిధి, జులై 10(జనంసాక్షి) :** కలెక్టర్ ప్రత్యేక చొరవ తో..ఫరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ (నేషనల్ అచీవ్మెంట్ సర్వే –2024) లో జిల్లా విద్యార్థుల ఉత్తమ ప్రతిభ. దేశవ్యాప్తంగా గత డిసెంబర్ లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 3,6,9 తరగతి విద్యార్థులకు ఫరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ (నేషనల్ అచీవ్మెంట్ సర్వే– 2024) లో జరగగా...దీని ఫలితాలు ఇటీవలే వెల్లడల్లాయి. తరగతులకు సంబంధించి అన్ని అంశాలలో తెలంగాణ రాష్ట్రం నుండి జనగామ జిల్లా లిదేశవ్యాప్తంగా మొదటి 50 ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాలలో జనగామ జిల్లా స్థానం సంపాదించిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఏఎస్ పరీక్ష కోసం జిల్లాలో అమలుపరిచిన ప్రత్యేక కార్యాచరణ గురించి కలెక్టర్ మాటల్లోనే, ఆగస్టు మాసం నుండే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేశారు. ఎస్‌సీఈఆర్‌టీ, రాష్ట్ర విద్య శాఖ సహకారంతో వారు నిర్ణయించిన కార్యక్రమాలకు తోడు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. జిల్లాలో 3, 6, 9 తరగతులు బోధించే ఉపాధ్యాయులతో జిల్లా స్థాయి రిసోర్సు గ్రూపును ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ రిసోర్స్ గ్రూపు.. వారి సబ్జెక్టులలో ప్రశ్నల నిధి తయారుచేసి అన్ని పాఠశాలలకు అందజేసి,ఆయా పాఠశాలలోని మూడు , ఆరు , తొమ్మిది తరగతుల విద్యార్థులచే అభ్యాసం చేయించారు. అలాగే ప్రతి నెల ఎన్ఏఎస్ ప్రిపరేషన్ పై ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించి రెగ్యులర్‌గా ఫాలోప్ చేయడం జరిగింది. ప్రతి నెల ఎమ్. ఈ. ఓ ల ఆధ్వర్యంలో మండల స్థాయి, కాంప్లెక్స్ స్థాయిలో కూడ సమీక్షలు నిర్వహించాము. ప్రతి నెల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఎన్ఏఎస్ ప్రశ్నల పత్రాలపై,ప్రశ్నల సరళి మీద ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అలాగే డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ల ద్వారా రూపొందిన ప్రశ్న పత్రాలతో జిలా వ్యాప్తంగా మాదిరి పరీక్షలను నిర్వహించాము. రాష్ట్ర అధికారులు నిర్దేశించిన నమూనా పరీక్షలు కాకుండా జనగామ జిల్లాలో ప్రత్యేకంగా మోడల్ టెస్టులను నిర్వహించి చివరగా గ్రాండ్ మోడల్ టెస్ట్ కూడా నిర్వహించి విద్యార్థుల సన్నద్ధతను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. జిల్లాలో 3 వ తరగతిలో 33 పాఠశాలలకు చెందిన 640 మంది విద్యార్థులకు,6 వ తరగతిలో 27 పాఠశాలలకు చెందిన 688 విద్యార్థులకు,9 వ తరగతిలో 31 పాఠశాలలకు చెందిన 805 విద్యార్థులకు మొత్తం 91 పాఠశాలలకు చెందిన 2133 మంది విద్యార్థులకు ఈ సర్వే నిర్వహించారు. ఎన్ఏఎస్ పరీక్షపై ప్రతి రోజు ప్రత్యేక పీరియడ్ నిర్వహించారు.

# మానవ హక్కుల కమిషన్ సదస్సు జయప్రదం చేయండి




**నిర్మల్ బ్యూరో, జూలై 10 (జనంసాక్షి):** ఈనెల 22న నిర్వహించబోయే నేషనల్ రైట్స్ మూమెంట్ మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నామని గురువారం నిర్మల్ జిల్లా చైర్మన్ సోఫీ మొహమ్మద్ ఇమ్రాన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షులు ఎం. పి రాజేష్ ఆచార్య, జాతీయ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మొహమ్మద్ సాహిల్ ఖాన్ వస్తున్నారని పేర్కొన్నారు. టిఎన్జివో భవనంలో జరిగే ఈ అవగాహన కార్యక్రమానికి నిర్మల్ జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సోఫీ మొహమ్మద్ ఇలియాస్, జిల్లా ఉపాధ్యక్షులు షరీఫ్ బిన్ హాది, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసాక్ అలీ, జిల్లా సెక్రటరీ ఇర్ఫాన్ ఖాన్ ఉన్నారు.

# సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ధ్యేయం

### బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, జులై 10, (జనంసాక్షి) :** సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ద్యేయం అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్ నగరంలోని గాంధీ భవన్ లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల ప్రకారం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నామని అన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమం చేపట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టీపిసిసిచీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా వినతులపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సమస్యల కోసం పాటుపడుతోందని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగిస్తుందని అన్నారు. ఇచ్చిన హామీల అమలుకు అనుగుణంగా సీఎం రేవంత్, మంత్రుల బృందం కృషి చేస్తోందని కొనియాడారు. ప్రజా భవన్ కేంద్రంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం , కృష్ణా నది నీళ్లకు సంబంధించి వాస్తవాలను వివరించే ప్రయత్నం చేశారని అన్నారు. బెల్లంపల్లిలో బుగ్గ టెంపుల్ కి రోడ్డు వేయించిన ఘనత కాంగ్రెస్ పార్టీది, సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా నెన్నెల్ మండలంలో 30 కోట్లతో రోడ్లు వేశామని వివరించారు. కాజీపేట మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ ప్రత్యేక నిధుల కోసం సీఎం రేవంత్ రెడ్డికి విన్నావించడం జరిగిందని త్వరలోనే నిధులు మంజూరు చేయించి పట్టణాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, పొడు భూములకు సంబంధించి అటవీ శాఖ నుంచి సహకారం ఉండటం లేదని, ఈ విషయంలో మంత్రి కొండ సురేఖ చొరవ తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, కాంగ్రెస్ బెల్లంపల్లి పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, నెన్నెల మండల నాయకుడు తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వెన్నుపూస విరిగి దీనావస్థలో యువకుడు

### ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



**సారంగాపూర్, జులై 10 (జనం సాక్షి) :** నిరుపేద కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చి పడింది. వివరాలు సారంగాపూర్ మండలం కౌట్ల బి గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్ (33) ప్రైవేట్ గా స్వర్ణ లోని ఒక మెడికల్ లో ఉంటూ పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. 6 నెలల క్రితం సాయంత్రం పని ముగించుకుని ఇంటికి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనం అధువు తప్పి చెట్టుకు ఢీకొట్టాడు. వెన్నుపూస ఫ్రాక్చర్ అవడంతో ప్రైవేట్ ఎన్నో ఆసుపత్రులలో చూయించిన నయం కాకపోవడంతో ఇంట్లోనే మంచానికి పరిమితమయ్యాడు. యుక్త వయసులో తల్లిదండ్రులకు పోషించే కొడుకు వికలాంగుడు అవడంతో దీనస్థితిలో కుటుంబ పోషణ బారంగా మారింది తల్లికి వచ్చే రెండు వేల పెన్షన్తో నెల మొత్తం ఎల్లదిస్తుంది.దాతలు సహకరిస్తే తమ కుమారుడి వైద్య ఖర్చులకైన మానవత హృదయంతో ఆపన్న హస్తమందించి ఆదుకోవాలని కోరుతున్నారు. మానవతవాదులు ఎవరైనా స్పందించి 9666421241 నంబర్ కు ఫోన్ పే గూగుల్ పే ద్వారా సాయం అందించాలని అభ్యర్థిస్తున్నారు.

## దశాబ్దాలు గడిచినా గ్రామాల దశ మారడం లేదు

### నేటికీ అభివృద్ధికి నోచుకోని గ్రామాలు

### కనీస వసుతుల కరువు

### అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఇబ్బందులే



**సారంగాపూర్, జులై 10 (జనం సాక్షి) :** మండలంలో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. నేతలు మారినా తమ తలరాతలు మారడం లేదని ఆదివాసులు అంటున్నారు. గ్రామాలకు సరైన రోడ్లు, తాగునీరు, వైద్యం, విద్య నేటికీ సరిగ్గా అందడం లేదు. మండలంలోని ఇప్ప చెల్మ, పెండల్ధారి, అంతుల్వాయి, లక్ష్మీపూర్ తదితర గ్రామాల్లో సరైన వసతులు లేక గిరిజన గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయి. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఉట్నూరు ఆధ్వర్యంలో సంవత్సరానికి నిధులు కేటాయిస్తున్న అవి అందడం లేదని గిరిజనులు అంటున్నారు. అదివాసుల అభివృద్ధి చెందడానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నా మారుమూల గ్రామాల్లో సంక్షేమ ఫలాలు అందని ద్రాక్షలాగానే మిగిలిపోతున్నాయి. ప్రత్యేక గ్రామపంచాయతీ కేటాయించి పది సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటివరకు రోడ్డు మార్గం లేకపోవడం దురదృష్టకరమని వాపో తున్నారు. మండలంలోని వేరే గ్రామాలకు రోడ్డు మార్గం పూర్తిచేసి కేవలం మా గ్రామాలకి రహదారి మార్గం లేనందున ప్రజలు చాలా ఇబ్బంది ఎదురుకోవాల్సి వస్తుందీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ వేయకపోవడానికి కారణాలు ఏంటో తెలియడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ప్రత్యేక అధికారులు ఆయాగ్రామాల్లో పర్యటించి అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడా ల్సిన బాధ్యత అధికారులదేనని అంటున్నారు.

## గుంతల మయంగా మారిన రోడ్డు



**మల్హర్, జూలై 10(జనం సాక్షి) :** భూపాలపల్లి జిల్లా మల్హార్ మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం మూల మలుపు సమీపంలోని తాడిచర్ల – పెద్దతూండ్ల ప్రదాన రహదారి గుంతల మయంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పూర్తిగా బురదమయంగా మారి పెద్ద పెద్ద గోతులు తయారయ్యాయి. దీంతో ఆ రహదారిగుండా వెళ్లాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం పెద్దతూండ్ల, కిషన్రావుపల్లీ, తాడిచర్ల గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. అసలే వర్షాకాలం పైగా కెటిపిపి కి బొగ్గు తరలించేందుకు నిత్యం బొగ్గు లారీలు ఈ రోడ్డు పై వెళ్లడంతో బారిగ గుంతలు పడి ద్విచక్ర వాహన దారులతో పాటు వివిధ వాహన దారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతల మయంగా మారిన రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# విద్యార్థులే యూనివర్సిటీకి బ్రాండ్ అంబాసిడర్లు

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, జులై 10 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం బాసర ఆర్జీయుకేటి (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జీ టెక్నాలజీస్)ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఛాంబర్‌లో అధికారులు, బోధన సిబ్బందితో సమావేశమై, విద్యార్థులకు అందిస్తున్న బోధన, వసతులపై సమీక్ష నిర్వహించారు. ప్రవేశాల ప్రక్రియ, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రవేశాల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. బోధనేతర సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, బాసర ఐఐఐటి దేశానికే గర్వకారమని, విద్యార్థులే యూనివర్సిటీకి బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోధన, భోదనేతర అంశాల్లో సమీక్షలు నిర్వహిస్తూ, సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వర్క్‌షాపుల స్థితి, అకడమిక్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, నైపుణ్యాభివృద్ధి ప్రధానంగా ఉండేలా విద్యా బోధన సాగాలన్నారు. గేట్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీ సహాయంతో కోచింగ్ అందిస్తున్నట్టు చెప్పారు. ఆగస్టు లో భోజనశాలకు కొత్త గుత్తేదారు నియమిస్తామని, భోజనశాల విస్తరణతో పాటు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాలు, తరగతి గదులు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి గోవర్ధన్, ఓ ఎస్ డి మురళి దర్శన్, ఇన్‌చార్జి డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఎంపిడిఓ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నస్పూర్‌లో 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని వినతి



**శ్రీరాంపూర్(జనంసాక్షి):** శ్రీరాంపూర్ డివిజన్ పర్యటనకు వచ్చిన సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్ ని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నస్పూర్ లో 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కే బాజీ సైదా మాట్లాడుతూ సింగరేణి అన్ని ఏరియాలలో శ్రీరాంపూర్ ఏరియా అతిపెద్దదని ఇక్కడ కార్మికులు దాదాపు 9,000 మంది ఉన్నారని కానీ ఇక్కడ 50 పడకల ఆసుపత్రి లేదని వెంటనే 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, నస్పూర్ డిస్పెన్సర్ కి ఆనుకొని సింగరేణి స్థలం ఉందని ఇక్కడ 50 పడకల ఆసుపత్రి నిర్మించుటకు అనుకూలంగా ఉంటుందని, ఆసుపత్రి నిర్మించడం వల్ల కార్మికులు వారి కుటుంబ సభ్యులు, రిటైర్డ్ అయిన కార్మికులు చికిత్స పొందడానికి అనువుగా ఉంటుందని కాబట్టి వెంటనే 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని,డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ,డయాలసిస్ చికిత్స అవసరమైతే మంచిర్యాల్ ప్రైవేట్ హాస్పటల్లో గోదావరిఖని లోని సింగరేణి ఆసుపత్రి డయాలసిస్ చేసుకోవడం జరుగుతుందని దీనివల్ల వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాబట్టి నస్పూర్ డిస్పెన్సరీ లో డయాలసిస్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్ కి వినతిపత్రం అందజేశామని వారు సానుకూలంగా స్పందించారని అన్నారు .ఈ కార్యక్రమంలో జిఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఏరియా కార్యదర్శి మూడ సుధాకర్, ఫిట్ కార్యదర్శి విజయలక్ష్మి, నాయకులు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం

• మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్



**శామీర్‌పేట్, జూలై 10 (జనంసాక్షి) :** జగ్గంగూడ గ్రామంలో పూజారి స్వామికి 37,000, మర్యాల సురేష్ కి 60,000 రూపాయలు ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను ఏ ఎం సి చైర్మన్ నర్సింలు యాదవ్ అందజేశారు. ఈ సందర్బంగా మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్ మాట్లాడు తూ..ముఖ్యమంత్రి సహాయనిధి అనేది నిరుపేద లకు ఎంతో సహాయపడుతుందని మేడ్చల్ నియోజకవర్గంలో ప్రజలు ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చి హాస్పిటల్లో అడ్మిట్ అయిన తర్వాత అయిన ఖర్చును నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ గారి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిది ద్వారా అందించే ఆర్థిక సహాయం ఆ యొక్క పేద కుటుంబాలకు ఊరటానిచ్చే విధంగా ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమలో మేడ్చల్ వ్యవసాయ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ సేవాదళ్ అధ్యక్షులు మహమ్మద్ జాఫర్, మండల ప్రధాన కార్యదర్శివీరారెడ్డి, దినేష్ రెడ్డి, జగ్గంగూడ కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పేదల రేషన్ కార్డుల పంపిణీ చరిత్రలో నిలుస్తుంది

• బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలి
• ఎమ్మెల్యే మందుల సామేలు

**తుంగతుర్తి, జూలై 10 (జనం సాక్షి) :** తిరుమలగిరిలో ఈ నెల 14 న సీఎం రేవంత్ రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించడం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ తో కలిసి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు మంజూరు చేయలేదని అన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 మాసాల్లో నే అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇస్తున్న ఘనత తమ పార్టీకే దక్కిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రస్థాయిలో తుంగతుర్తి నియోజకవర్గంలో రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించనుండటం నియోజకవర్గ ప్రజలకే గర్వకారణమన్నారు. పేదలు సైతం పెద్దల మాదిరిగానే సన్న బియ్యం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం కొత్త రేషన్



కార్డులకు 20 లక్షల మందిని రేషన్ కార్డులలో పేర్లు చేర్పించడం జరిగిందన్నారు. నియోజకవర్గం గత పది సంవత్సరాల్లో అభివృద్ధిలో వెనుకబడిపోయిందని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన కొద్ది నెలల్లోనే కోట్లాది రూపాయలు వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గంలో రోడ్లు, విద్య, వైద్యం సదుపాయం కల్పించేందుకు తన ముఖ్య కర్తవ్యం అని అందుకు అనుగుణంగా తాను పనిచేస్తున్నాను అన్నారు. గత ప్రభుత్వాలలో నిలిచిపోయిన వంద పడకల ఆసుపత్రికి నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వేల ఎకరాలకు సాగుకు ఉపయోగమైన కేతిరెడ్డి ఆనకట్టకు నిధులు వెచ్చించి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉచిత బస్సు, రైతు బీమా, రైతు భరోసా, తో పాటు ప్రజాపాలనలో అనేక సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు ఇట్టి బహిరంగ సభలో తుంగతుర్తి నియోజకవర్గానికి కావాల్సిన నిధులు అభివృద్ధి పనుల విషయంలో ఇప్పటికే చాలాసార్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తారని తెలిపారు. భారీ బహిరంగ సభకు గ్రామస్థాయి నుంచి పార్టీ అభిమానులు, నాయకులు కార్యకర్తలు భారీగా బయలుదేరి సభను విజయవంతం చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, దేవాలయ చైర్మన్ ఎనగందుల సంజీవ, సంవిధాన్ మండల కోఆర్డినేటర్ మాచర్ల అనిల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తప్పట్ల శంకర్, పట్టణ అధ్యక్షుడు ఉప్పుల రాంబాబు యాదవ్,జిల్లా నాయకులు రేగటి రవి, యువజన నాయకులు పెద్ద బోయిన అజయ్, కొండ రాజు,గంగరాజు,నల్లు రామచంద్రారెడ్డి, దాయం ఝాన్సీ రాజిరెడ్డి, మారబోయిన వెంకటయ్య, రేగటి వెంకటేష్, దాసరి శ్రీను, కలకోట్ల మల్లేష్, రుద్ర రామచంద్రు, మంగళపల్లి నాగరాజు,అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెట్టింగ్ మాయలో మహిళ మృతి

• సూసైడ్ నోట్లో బాధలు వెల్లడి



**కూకట్‌పల్లి, జూలై 10 (జనంసాక్షి) :** బెట్టింగ్ యాప్ లలో జరిగిన మోసంతో అప్పుల పాలైన ఓ గృహిణి మనస్తపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేవీహెచ్బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కెపిహెచ్బి సిఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వెస్ట్ గోదావరి పాలకొల్లుకు చెందిన గోడపాటి అంజయ్య కూతురు గంగా అనుష (27) ఇంకా ఐదు సంవత్సరాల క్రితం వరసకు మేనబావ అయినా కోయ వెంకన్న బాబుతో వివాహం జరిగింది అనూష వెంకన్న బాబులకు నాలుగు సంవత్సరాల బాబు ఉన్నాడు వెంకన్న బాబు సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పనిచేస్తుండగా అనూష ఇంట్లో ఉండే వర్క్ ఫ్రొం హొమ్ జాబ్ చేసుకుంటుంది. హొమ్ చేసుకుంటున్నా అనూష బెట్టింగ్ యాప్లకు అలవాటు పడి ఆన్లైన్లో బెట్టింగ్లో లక్షల రూపాయలు పోగొట్టుకుంది. అప్పులు ఎక్కువ అవ్వడంతో మనస్తపం చెందిన ఆయుష సూసైడ్ నోట్ రాసి ఇంట్లోనే ఫ్యాన్ కు ఉరేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త తలుపులు కట్టగా నాలుగేళ్ల కొడుకు తలుపులు తీశాడు అని ఈ సమయంలో అనూష ఇంట్లో కాని వేలాడుతూ కనిపించింది దీంతో అనూష భర్త వెంటనే బాబు పోలీసులకు సమాచారం అందించాడు అనూష ఆత్మతో బెట్టింగ్ ఆపనే కారణమని లక్ష రూపాయల డబ్బులు పోగొట్టుకొని మీ కుటుంబానికి తెలిసే పరువు పోతుందని తనను క్షమించాలని సూసైడ్ మాట్లాడుతూ రాసింది అనూష తండ్రిగా తన కూతురు మరణానికి ఎవరు కారణం కాదని ఎవరిపై అనుమానం లేదని మనుషులు ఇచ్చిన ఫిర్యాదుతో పేర్కొన్నారు ఆన్లైన్ ద్వారా మోసపోవడానికి సిఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు మెసేజ్లు లింకులు ఓపెన్ చేయకూడదని మోసగా బారిన పడకూడదని కొనియాడారు.

## రెండు కాలనీలను కలిపిన హైడ్రా

• అడ్డుగోడను తొలగించడంతో మార్గం సుగమం

**హైదరాబాద్, జూలై 10 (జనంసాక్షి) :** రెండు కాలనీల మధ్య దూరాన్ని హైడ్రా తగ్గించింది. అడ్డ గోడను తొలగించి అనుసంధానం ఏర్పాటు చేసింది. హబ్సీగూడలో స్ట్రీట్ నంబరు 6 లోఉన్న అడ్డుగోడ తొలగడంతో నందనవనం, జయానగర్ కాలనీల మధ్య దూరం తగ్గింది. ఇప్పుడు నందనవనంలోని స్ట్రీట్ నంబరు 4 నుంచి నేరుగా 6లోకి వచ్చి హబ్సీగూడ ప్రధాన రహదారికి చేరుకుంటున్నారు. గురువారం ఉదయాన్నే స్ట్రీట్ నంబరు 6లో ఉన్న అడ్డుగోడను హైడ్రా తొలగించింది. ఈ అడ్డుగోడ తొలగడంతో కేవలం 300 మీటర్లు ప్రయాణించి ఎన్‌జీఆర్ ఐ మెట్రో స్టేషన్‌కు చేరుకుంటున్నామని నందనవనం కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. లేదంటే ఒకటిన్నర కిలోమీటర్లు ప్రయాణించి నానా అవస్థలు పడేవాళ్లమని.. ఇప్పుడా ఇబ్బంది తొలగించదన్నారు. 15 ఏళ్లుగా అవస్థలు పడుతున్నాం... ఎన్నో సార్లు మున్సిపల్ అధికారులను కలిసాం ప్రయోజనం లేకుండా పోయింది. ఆఖరకు జయానగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడినా జగడమే కాని.. సమస్య పరిష్కారం కాలేదు. ఇదే విషయమై హైడ్రాకు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో వెంటనే పరిష్కారం దొరికిందని నందనవనంలోని కాంక్రెట్ ట్రంపెట్ అపార్టుమెంటు వాసులు చెబుతున్నారు.




## ఆయుర్వేద వైద్యంతోనే సర్వం నయం



**యాచారం, జూలై 10 (జనం సాక్షి) :** ప్రాచీనం వైద్యమైన ఆయుర్వేదంతోనే సంపూర్ణ వైద్యం అందించవచ్చని డాక్టర్ ఇందిరా తెలిపారు. గురువారం యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో నజ్దిక్ సింగారం ఆయుర్వేద వైద్యాధికారినీ డాక్టర్ ఇందిరా ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుండి రోగులు విచ్చేసి వైద్య సేవలను అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిరా మాట్లాడుతూ.. భారతదేశం ప్రాచీన ఆయుర్వేదమైన వైద్యం సర్వరోగ నివారిణి ఔషధాలు గల వైద్యమని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పూర్వ వైభవం రావాలని కోరారు. వైద్యం వాణిజ్యం కాకుండా ప్రభుత్వ అందించే ఉచిత ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఆయుర్వేదం పై విస్తృత ప్రచారం చేస్తూ ఆధునిక పద్ధతుల రూపంలో వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, కరోబార్ మహేందర్, అటెండర్ దార రాములు, గ్రామస్తులు కొంగళ్ళ మల్లారెడ్డి, సామ సత్తయ్య, సామజంగయ్య, నర్రే తదితరులు పాల్గొన్నారు.

## జీపు, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికీ గాయాలు

**రేవల్లి, జూలై 10 (జనంసాక్షి) :** రేవల్లి మండలంలోని బండరాయిపాకుల గ్రామానికి చెందిన బంగారయ్య, పూర్ణకంటి పెద్ద హుస్సైన్ ఇద్దరు కలిసి బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వచ్చినటువంటి జీపు



నాగపూర్ గ్రామానికి చెందిన నడిమింటి కూర్మయ్య బైక్ ను ఢీకొనడంతో బంగారయ్య మరియు పూర్ణకంటి పెద్ద హుస్సైన్ కు బలమైన గాయాలు అయినవి, బంగారయ్య కొడుకు వినోద్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రేవల్లి మండల ఎస్ఐ రజిత తెలిపారు.

## ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా యార అశోక్ ఎన్నిక

**యాచారం, జూలై 10 (జనం సాక్షి) :** యాచారం మండలంలోని గడ్డమల్లయ్యాగూడ ముదిరాజ్ సంఘం నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా యార అశోక్ ముదిరాజ్ , ఉపాధ్యక్షుడు గా యార మల్లయ్య , కార్యదర్శి గోదాసు కృష్ణయ్య ,కోశాధికారిగా యార వెంకటేష్ , సంయుక్త కార్యదర్శి యార భిక్షపతి లతో కూడిన పూర్తిస్థాయి కమిటీని ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. కమిటీలో సలహాదారులుగా 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం



అధ్యక్షుడు యార అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ముదిరాజ్‌ల ఐక్యత కోసం కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## తుమ్మలపల్లి, లచ్చంపేటలో బీసీ సేన కమిటీ ఎంపిక

**జిల్లేడ్ చౌదరిగుడా, జూలై 10 (జనం సాక్షి) :** తుమ్మలపల్లి, లచ్చంపేట గ్రామాలలో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. బీసీల మందరం ఏకతాటి పైకి వచ్చి రాజకీయంగా ఎదగాలని జిల్లేడు చౌదరిగుడా మండల అధ్యక్షురాలు జయ శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయయన మాట్లాడుతూ మన బీసీలు ఏ పార్టీ నుంచి ఎన్నికల బరిలో ఉన్న బీసీలందరం పార్టీలకతీతంగా వారికి మన బీసీల మద్దతు ఇస్తూ రాజకీయంగా ఎదగడానికి దోహదం చేయడమే మన బీసీ సేనముఖ్య ఉద్దేశమని అన్నారు. బీసీ సేన నూతన గ్రామ కమిటీ ఎన్నిక తుమ్మలపల్లి



అధ్యక్షుడిగా బంగారు సత్యం, ఉపాధ్యక్షులుగా వడ్ల కృష్ణయ్య, చాకలి కుమార్, ప్రధాన కార్యదర్శిగా మావూరి గారి శ్రీను కార్యదర్శులుగా బంగారు శ్రీధర్ గొల్ల కృష్ణయ్య.మా ఊరి గారి నర్సింహులు కార్యవర్గ సభ్యులు బంగారు రాములు మంగలి వెంకటయ్య మమ్మరి శ్రీశైలం చాకలి నరసింహులు లచ్చంపేట గ్రామ కమిటీ గ్రామ అధ్యక్షులుగా గౌరిపల్లి గోపాల్ ఉపాధ్యక్షులుగా వడ్డె గారి యాదయ్య.. కావలి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కార్యదర్శులు వడ్డె గారి యాదయ్య గొల్ల కృష్ణయ్య, కోశాధికారి కమ్మరి పేట్ల సభ్యులు చుక్క రమేష్ వ్యాస చుక్క రమేష్ కమ్మర్ పేట కుమార్ ఉన్నారు.

## ఆగస్టు 15 నాటికి భూ సమస్యలు పరిష్కరించాలి

• జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, జూలై 10 (జనంసాక్షి) :** ఆగస్టు 15 నాటికి భూ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ ఆర్డీఓలు, తహసీల్దార్లతో వెబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి సదస్సులలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలకు సంబంధించి భూ భారతి చట్టంలోని సెక్షన్స్ అమలు చేసుకుంటూ అర్జీదారులకి నోటీసులను అందజేసి ఆన్లైన్ లో నమోదు చేయాలని అన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలని ఆర్డీవోలు సమన్వయం చేసుకుంటూ తహసీల్దార్లచే వేగవంతంగా అర్జీలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ రెవిన్యూ సదస్సులలో స్వీకరించిన అర్జీలను గ్రామాల వారీగా సిబ్బంది ద్వారా ఆర్జిదారులకి నోటీసులు అందజేయాలని సూచించారు. నూతన రేషన్ కార్డుల కొరకు వచ్చిన ధరఖాస్తులు వేగవంతంగా క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ సాయి గౌడ్, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత, నమ్మకానికి గుర్తింపుగా ఐఎస్ఓ సర్టిఫికేషన్

• ఈఎస్ఐ డైరెక్టర్ డా.జి.రామేశ్వర్ రావు



**ఖైరతాబాద్, జూలై 10 (జనం సాక్షి) :** గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్ఐ)లో గురువారం జరిగిన సిబ్బంది సమావేశంలో హైమ్ ఇంటర్నేషనల్ ఆడిట్ సంస్థ ఆడిటర్ ఏ.శివయ్య మాట్లాడుతూ ఐఎస్ఓ అనేది 'ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్' అనే అంతర్జాతీయ ప్రమాణ సంస్థ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, శిక్షణా సంస్థలు, పరిశ్రమలు మొదలైనవి ప్రజలకు అందిం చే సేవలు, ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాల కు అనుగుణంగా ఉన్నాయో లేదో ఒక తృతీయ పక్షం(థర్డ్ పార్టీ ఏజెన్సీ) ద్వారా ఆడిట్ చేసి నిర్ధా రించినపుడే ఐఎస్ఓ సర్టిఫికేట్ మంజూరు అవు తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఈఎస్ఐ చీఫ్ ఎస్.లక్ష్మికాంత రావు, డా.పి.రాజారావు, మేనేజ్మెంట్, టెక్నాలజీ విభాగాధిపతి డా.జ్యోతి, డా.భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ సాగు అద్భుతమైన వాణిజ్య పంట

• దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**కొండమల్లేపల్లి, జూలై 10 (జనంసాక్షి) :** ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడం అన్ని ప్రాంతాలకు విస్తరింపచేయడం దేశీయంగా నూనె గింజల ఉత్పత్తిని పెంచడం ఆహార నూనెల దిగుమతులపై దేశం యొక్క ఆధారపడటాన్ని తగ్గించడం రైతులకు ఆదాయాన్ని పెంచే విధంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కోసం మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్ యొక్క ప్రాముఖ్యత గురించి ఎమ్మెల్యే బాలు నాయక్ వివరించారు. గురువారం మండల కేందంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి ఫామ్ హౌస్ లో ఏర్పాటు చేసిన మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై అధికారులు ప్రజాప్రతినిధులు రైతులతో కలిసి ఆయిల్ ఫామ్ మొక్కలను నాటారు. అనంతరం ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సాహిస్తుందని, రైతులకు తక్కువ పెట్టబడితో అధిక లాభాలు పొందవచ్చు అని అన్నారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా రైతులు వాణిజ్య పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ ప్రపంచంలోనే అత్యధిక దిగుబడినిచ్చే వంట నూనె అని అన్నారు ఇది ఇతర నూనె గింజల పంటల కంటే తక్కువ భూమిలో ఎక్కువ




ఉత్పత్తిని ఇస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు దేశంలో ఆహార నూనెల స్వయం సమృద్ధిని సాధించడానికి సహాయపడుతుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటలు గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ వంటనూనె మార్కెట్ లో డిమాండ్ ఉంటుందని ప్రతి సంవత్సరము ఒక లక్ష కోట్లు ఖర్చుపెట్టి విదేశాల నుండి 150 లక్షల టన్నుల వంట నూనెలు భారతదేశం దిగుమతి చేసుకుంటుందన్నారు. ఆయిల్ ఫామ్ మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాల నుండి కాపు మొదలై 30 సంవత్సరాల వరకు నిరంతర దిగుబడితో నిరంతర ఆదాయం వస్తుందన్నారు. ఆయిల్ ఫామ్ మొక్కలలో తెగుళ్లు చీడపీడలు ఇతర పంటలతో పోలిస్తే చాలా తక్కువ ఉంటుందన్నారు. ఆయిల్ ఫామ్ ప్రకృతి వైపరీత్యాలను సమర్ధవంతంగా తట్టుకుంటుందని రైతులు పండించిన ఆయిల్ ఫామ్ కొనుగోలులో దళారుల వ్యవస్థ ఉండదని నేరుగా రైతుల నుండి కంపెనీ వారు రైతులు పండించిన ఆయిల్ ఫామ్ గెలలు కొనుగోలు చేస్తారన్నారు. అర్హత ఉన్న రైతులందరూ ఆయిల్ ఫామ్ పంటలను పెంచుకోవాలని సూచించారు. దేవరకొండ నియోజకవర్గంలో ప్రతి సెంటు భూమికి సాగు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, వంగాల ప్రతాప్ రెడ్డి, తేర సత్యనారాయణరెడ్డి, మారం రవీందర్ రెడ్డి, కేసాని లింగారెడ్డి, పసునూరి యుగేందర్ రెడ్డి, ఉట్కూరి వేమన్ రెడ్డి, ఉట్కూరి శ్రీనివాస్ రెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, కుంభం శ్రీనివాస్ గౌడ్, గంధం సురేష్, ఎండి నజీర్ మౌలానా, నీలం శ్రీనివాస్ యాదవ్, కోట్ల జగదీష్ పటేల్, ఎంఏ కైసర్ ఖాన్, వ్యవసాయ శాఖ అధికారులు, హార్టికల్చర్ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.




## రెండోరోజూ నష్టాల్లో సూచీలు..

**జనంసాక్షి:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. భారత్- అమెరికా ట్రేడ్ డీల్‌పై సందిగ్ధత, క్యూ1 ఫలితాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు.నేడు టీసీఎస్ ఫలితాల నేపథ్యంలో ఐటీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు సూచీలపై ప్రభావం చూపాయి. దీంతో సూచీలు వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగియగా.. నిఫ్టీ 25,400 దిగువకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 83,658.20 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,536.08) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ ఇంట్రాడేలో 83,134.97 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 345.80 పాయింట్ల నష్టంతో 83,190.28 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 120.85 పాయింట్ల నష్టంతో 25,355.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.67గా ఉంది.




# ఏఐతో భారీగా ఆదా..

**జనంసాక్షి:**టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ఇటీవల భారీ సంఖ్యలో లేఆఫ్‌లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒకేసారి దాదాపు 9000 మందికి నోటీసులిచ్చింది. తన కార్యకలాపాల్లో కృత్రిమ మేధ వినియోగాన్ని పెంచుతోన్న తరుణంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో కీలక వ్యాఖ్యలు చేసింది.

### భారీ లేఆఫ్‌ల అనంతరం మైక్రోసాఫ్ట్‌కు రూ.4 వేల కోట్లు లాభం

ఏఐతో గత ఏడాది రూ.4వేల కోట్లు ఆదా అయినట్లు పేర్కొంది.మైక్రోసాఫ్ట్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ జడ్సన్ ఆల్థోఫ్ మాట్లాడుతూ.. కాల్ సెంటర్ వ్యవహారాల్లో ఏఐని వినియోగించడం వల్ల గత ఒక్క ఏడాదే 500 మిలియన్ డాలర్లు (రూ. 4,285 కోట్లు) ఆదా అయిందని తెలిపింది. డబ్బులు ఆదా కావడంతో పాటు అంతర్గత సామర్థ్యం పెరిగిందని, వినియోగదారులకు మెరుగైన సేవలు అందాయని చెప్పారు. సేల్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, కస్టమర్ సర్వీసెస్ సహా అన్ని విభాగాల్లో ఏఐ వినియోగం గురించి మాట్లాడుతూ ఈ విషయాలు వెల్లడించారు. కాగా.. మైక్రోసాఫ్ట్ ఇటీవల అత్యధిక కోతలను ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 4 శాతం మందిని అంటే దాదాపు 9,100 మందిని తొలగిస్తున్నట్లు తెలిపింది.ఎక్స్‌బాక్స్, గేమింగ్ డివిజన్లలో ఈ లేఆఫ్‌లు ఇచ్చింది. ఈ ఏడాదిలో కంపెనీ లేఆఫ్‌లు ప్రకటించడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఆరంభంలో ఒక శాతం మందిని తొలగించిన కంపెనీ.. ఆ తర్వాత మే నెలలో 6 వేల మందిని ఇంటికి పంపించింది. జూన్‌లోనూ 300 మందికి పైగా ఉద్యోగులను తీసేసింది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రొడక్ట్ డెవలపర్లు ఉన్నారు. కంపెనీ సంస్థాగత పునర్‌వ్యవస్థీకరణలో భాగంగానే ఈ కోతలు పెడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.ఇలాంటి సమయంలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఒకరు ఇచ్చిన సలహా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. "ఇది చాలా కష్ట సమయం. ఈ లేఆఫ్‌లను మీరు ఎదుర్కోవాలన్నా.. దాన్నుంచి బయటపడి ముందుకుసాగాలన్నా మీరు ఒంటరిగా లేరన్న విషయాన్ని మర్చిపోకండి. మరింత స్పష్టతతో కెరీర్‌లో ముందుకుసాగడానికి మీరు ఏఐ టూల్స్‌ను ఉపయోగించుకోవచ్చు. అవి మానసిక బాధ నుంచి ఉపశమనం కలిగిస్తాయి. మీ రెజ్యూమెను మెరుగ్గా రాసుకునేందుకు సాయం చేస్తాయి" అని మైక్రోసాఫ్ట్‌లోని ఎక్స్‌బాక్స్ గేమ్ స్టూడియోస్‌లో పనిచేసే ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మాట్ టర్న్‌బుల్ తన లింక్డ్‌ఇన్‌లో చేసిన పోస్టు పెద్దఎత్తున విమర్శలకు దారితీసింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.10 | ₹ 5.12 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 90,200 (22 క్యారెట్లు) | ₹ 98,400 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,20,000

## పెరుగుతున్న కార్మిక కొరత.. జనాభా సంక్షోభం



# వీసాలకు గేట్లెత్తేశారు

### 5 లక్షల మందికి వీసా ఇచ్చేలా ఇటలీ ప్రణాళికలు

**జనంసాక్షి:**ఇటలీ ప్రస్తుతం కార్మిక కొరత, జనాభా క్షీణత సమస్యలతో సతమ తమవుతోంది. వాటిని పరిష్కరించడానికి ఆ దేశం కొన్ని సాహసోపేతమైన చర్యలు తీసుకుంటోంది.అందులో భాగంగా ఇటలీ ప్రభుత్వం 2026-2028 మధ్య యురోపియన్ యూనియన్‌యేతర పౌరులకు దాదాపు 5,00,000 వర్క్ వీసాలను జారీ చేసే ప్రతిష్టాత్మక ప్రణాళికను ప్రకటించింది. ఈ వ్యూహాత్మక నిర్ణయం దేశ జనాభాను స్థిరపరుస్తూ, ఆర్థిక భవిష్యత్తుకు ఊతం ఇచ్చేలా ఉంటుందని నమ్ముతుంది. వర్క్ వీసా విస్తరణకు సంబంధించిన కీలక వివరాలు వచ్చే మూడేళ్లలో ఈయూయేతర పౌరులకు మొత్తం 4,97,550 వర్క్ పర్మిట్లు జారీ చేయాలని ఇటలీ యోచిస్తోంది. ఇది దేశంలోకి వచ్చే వలసదారులను గణనీయంగా పెంచుతుంది. స్థానికంగా లేబర్ మార్కెట్ సమస్యలను పరిష్కరించాల్సిన అవసరాన్ని ఇది హైలైట్ చేస్తుంది. ఈ విధానం ద్వారా సంవత్సరాల వారీగా కింద తెలిపినట్లు వర్క్ పర్మిట్లు జారీ చేయనున్నారు.2026: 164,850 వర్క్ పర్మిట్లు,2027: 166,350 వర్క్ పర్మిట్లు,2028: 166,350 వర్క్ పర్మిట్లు,

**సిబ్బంది అవసరమయ్యే రంగాలు..**

దేశవ్యాప్తంగా క్లిష్టమైన సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్న వివిధ రంగాలకు ఈ వీసాలను పంపిణీ చేయనున్నారు. అందులోని కొన్ని పరిశ్రమలు కింద ఇస్తున్నాం. వ్యవసాయం,నిర్మాణ రంగం,ఆరోగ్య సంరక్షణ (ముఖ్యంగా వైద్యులు, నర్సులు),టూరిజం,తయారీ రంగం,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్‌తో సహా డిజిటల్ సేవల రంగం.

పైన తెలిపిన రంగాలు దేశీయ వీసా విధానం ద్వారా ఇటలీ ఆర్థిక వ్యవస్థ ఊపందుకుంటుందని నిపుణులు భావిస్తున్నారు.

**ఎందుకు ఇలా చేస్తోందంటే..**

లేబర్ కొరత:ఇటలీ కంపెనీలు తమ సంస్థల్లో ఖాళీలు భర్తీ చేయడానికి నానా తంటాలు పడుతున్నాయి. వాస్తవానికి 70% కంటే ఎక్కువ ఇటాలియన్ కంపెనీలు కార్మికులను నియమించడంలో తీవ్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ కొరత దేశీయంగా అనేక పరిశ్రమల్లో విస్తరించింది. రెస్టారెంట్లు, హొటళ్లువంటి సర్వీసుల్లో 2,58,000 ఖాళీలు.45,000 మంది వైద్యులు, 65,000 మంది నర్సులు, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై ఒత్తిడిని ఎత్తి చూపుతోంది.ఇంజినీరింగ్, గ్రీన్ ఎకానమీలో 2,80,000 మంది నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం. ఈ విభాగంలో ప్రతిభావంతులకు డిమాండ్ పెరుగుతోంది. డిజిటల్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ నిపుణులకు పెరుగుతున్న డిమాండ్.

**జనాభా సంక్షోభం:**ఇటలీ జననాల రేటు తగ్గుతోంది. దాంతో జనాభా కుంటుపడుతోంది. 2024లో జనాభా 37,000 తగ్గింది. జననాల కంటే 2,81,000 ఎక్కువ మరణాలు సంభవించాయి. 2050 నాటికి ఇటలీలో 34% మంది 65 ఏళ్లు పైబడి వయసు ఉంటారని అంచనా. స్థిరమైన శ్రామిక శక్తి, ఆర్థిక వ్యవస్థను కొనసాగించడానికి ఇటలీ 2050 నాటికి సుమారు 10 మిలియన్ల(ఒక కోటి) వలసదారులను ఆకర్షించాల్సిన అవసరం ఉందని నిపుణులు భావిస్తున్నారు. కొత్తగా ప్రకటించిన వర్క్ వీసా ప్రోగ్రామ్ ఈ లక్ష్యసాధనలో కీలకంగా ఉంటుందని చెబుతున్నారు.

**భారత్ ఎలా అర్థం చేసుకోవాలంటే..**

వేగంగా పెరుగుతున్న శ్రామిక జనాభా ఉన్న భారతదేశం ఇటలీ వర్క్ వీసాలతో గణనీయంగా ప్రయోజనం పొందనుంది. భారత్‌లో ఇటలీ రాయబారి ఆంటోనియో బార్టోలి 'ఇరు దేశాల మధ్య సమన్వయం'గా ఈ వ్యవహారాన్ని అభివర్ణించారు. ముఖ్యంగా హెల్త్ కేర్, ఇంజినీరింగ్, హాస్పిటాలిటీ, ఐటీ వంటి రంగాల్లోని వారికి ఇటలీ లేబర్ మార్కెట్లో పుష్కలమైన అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

**ఏయే రంగాల్లో ఎవరికి అవకాశం..**

హెల్త్‌కేర్: డాక్టర్లు, నర్సులు, మెడికల్ ప్రొఫెషనల్స్‌కు మంచి డిమాండ్ ఉంది.ఇంజినీరింగ్: ఇటలీ పారిశ్రామిక రంగాలకు, గ్రీన్ ఎకానమీకి నైపుణ్యం కలిగిన ఇంజినీర్లు అవసరం.హాస్పిటాలిటీ అండ్ టూరిజం: ఇటలీ గ్లోబల్ టూరిజం హబ్ కావడంతో ఆతిథ్య రంగంలోని కార్మికులకు గిరాకీ ఉంటుంది.

**డిజిటల్, ఐటీ:** ఐటీ నిపుణులకు పెరుగుతున్న డిమాండ్ భారతీయ టెక్ ప్రతిభావంతులకు, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో అవకాశాలను సృష్టిస్తుంది.ఇటలీ ప్రభుత్వం చట్టపరమైన వలసదారుల హక్కులను సంరక్షించేదుకు కట్టుబడి ఉందని తెలిపింది. అదేసమయంలో అక్రమవలసలకు సహించబోమని తేల్చి చెప్పింది. సురక్షితమైన, నియంత్రిత వలసలను ప్రోత్సహించే మార్గాలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొంది. ఇటువంటి వలసలకు సహాయపడే దేశాలకు ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పింది.

**ఇటలీ వర్క్ వీసా ఎలా దరఖాస్తు చేయాలంటే..**

జాబ్ ఆఫర్:వీసా కోసం దరఖాస్తు చేయడానికి ముందు ఇటలీలోని ఏదైనా ఒక సంస్థ నుంచి జాబ్ ఆఫర్ పొందాలి. ఈ ఆఫర్ ప్రోగ్రామ్‌లో పేర్కొన్న ప్రాధాన్య రంగాల్లో ఒకటిగా ఆ సంస్థ ఉండాలి. ఉదా: నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ సేవలు మొదలైనవి. వర్క్ పర్మిట్ ప్రోగ్రామ్‌లో పేర్కొన్న వీసా కేటగిరీలకు అనుగుణంగా జాబ్ ఉండేలా చూసుకోవాలి.

సంస్థ నుంచి నూలా ఓస్టా(వర్క్ పర్మిట్)

జాబ్ ఆఫర్ వచ్చిన తర్వాత తదుపరి దశతో కంపెనీ దరఖాస్తుదారుడి తరపున నూలా ఓస్టా (వర్క్ పర్మిట్) కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఇటలీలోని స్థానిక ఇమ్మిగ్రేషన్ కార్యాలయం ద్వారా ఇది జరుగుతుంది. సంబంధిత కొలువు కోసం ఈయూయేతర వక్తిని నియమించడానికి సంస్థకు అధికారం ఉందని నూలా ఓస్టా తప్పనిసరిగా ధ్రువీకరించాల్సి ఉంటుంది.

**అనుమతులు:**తదుపరి దశలో అనుమతుల కోసం వేచి ఉండాలి. నూలా ఓస్టా ఆమోదం పొందినట్లయితే సంస్థకు ధ్రువీకరణ అందుతుంది. ఒకసారి పర్మిట్ మంజూరు చేసిన తర్వాత నూలా ఓస్టా వివరాలు భారతదేశంలోని ఇటలీ రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్‌కు పంపిస్తారు. ఆమోద ప్రక్రియకు కొంత సమయం పడుతుంది. కాబట్టి ఓపికగా వేచి చూడాలి. తర్వాత మీకు సమాచారం అందిస్తారు.

**వర్క్ వీసా:**వర్క్ పర్మిట్ అందుకున్న తర్వాత భారతదేశంలోని ఇటలీ కాన్సులేట్‌లో వర్క్ వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వీసా దరఖాస్తు ఫారమ్ సమర్పించేప్పుడు కింద తెలిపిన డాక్యుమెంట్లు అవసరం అవుతాయి.

**వీసా అప్లికేషన్ కోసం కావాల్సిన ధ్రువపత్రాలు:**

జాబ్ ఆఫర్ లెటర్: ఆమోదం పొందిన నూలా ఓస్టా(వర్క్ పర్మిట్), వీసా దరఖాస్తు ఫారం,పాస్‌పోర్ట్‌జి,ఇటలీలో వసతి రుజువు కోసం అద్దె ఒప్పందం లేదా మీరు చేరబోయే సంస్థ లేఖలో అక్కడ ఉండటానికి వసతి ఉందని ధ్రువీకరించుకోవాలి.ఆర్థిక భరోసా: మీరు సంపాదించడం ప్రారంభించే వరకు ఇటలీలో మిమ్మల్ని మీరు పోషించుకోవడానికి తగినంత ఆర్థిక వనరులు మీకు ఉన్నాయని ధ్రువపరిచేలా పత్రాలు ఉండాలి. ఇందులో బ్యాంక్ స్టేట్‌మెంట్ లేదా స్పాన్సర్ లెటర్ ఉండవచ్చు. హెల్త్ ఇన్సూరెన్స్: ఇటలీలో దరఖాస్తుదారుకు చెల్లుబాటు అయ్యే ఆరోగ్య బీమా పాలసీ ఉండాలి.ఇటలీలో డిమాండ్‌లో ఉన్న ఉద్యోగాలు.స్కిల్డ్, సెమీ స్కిల్డ్ ఉద్యోగాలు: భవన నిర్మాణ కార్మికులు (మేస్త్రీ, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, వెల్డర్)



# ట్రంప్ పొగిడినా కష్టాలే!..

**జనంసాక్షి:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మనుషుల్ని మెచ్చడం అత్యంత అరుదు. అందునా తనకు నచ్చని దేశాల అధ్యక్షులను వైట్‌హౌజ్‌కు పిలిపించుకుని మరీ అవమానించడం ఆయనొక అలవాటుగా మార్చుకున్నారు.అయితే అనూహ్యంగా ఆయన ఓ దేశ అధ్యక్షుడ్ని మెచ్చుకుంటే.. అది కూడా బెడిసి కొట్టింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీ , దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాపై అవమానకర వ్యాఖ్యలు చేశారు. జెలెన్‌స్కీని తన ఓవెల్ ఆఫీస్‌లో మీడియా సమక్షంలోనే డిక్టేటర్(నియంత) అంటూ తిట్టిపోశారు. అలాగే.. రామఫోసా ముందు ఓ వీడియో ప్రదర్శించి.. సౌతాఫ్రికాలో తెల్లవాళ్లను ఊచకోతలు కోస్తున్నారంటూ ఏకంగా ఓ తప్పుడు వీడియోను ప్రదర్శించి మరీ విమర్శలు గుప్పించారు.ఇటలీ ప్రధాని జార్జియా మెలోని మినహా ఆయన ప్రత్యేకంగా ఎవరినీ ప్రశంసించింది లేదు. తాజాగా లిబీరియా అధ్యక్షుడు జోసెఫ్ బొకాయ్‌పై ట్రంప్ ప్రశంసలు గుప్పించారు. ఇప్పటిదాకా వైట్‌హౌజ్‌కు వచ్చిన ఏ నేత కూడా ఇంత అందంగా ఆంగ్లంలో మాట్లాడలేదంటూ..అని ట్రంప్ వ్యాఖ్యానించారు. తనకు తెలిసిన అమెరికన్ల కంటే బాగా ఇంగ్లీష్ మాట్లాడారంటూ కితాబిచ్చారు.అయితే ఈ పొగడ్త వివాదాస్పదంగా మారింది. లిబీరియా అధికార భాష ఆంగ్లమే. పైగా బొకాయ్ లిబీరియాలోనే విద్యనభ్యసించారు. దీంతో ఆఫ్రికా అంతటా ట్రంప్ వ్యాఖ్యలు విమర్శలకు దారితీశాయి. ఆఫ్రికన్ యూత్ యాక్టివిస్ట్ ఆర్చీ హారిస్ స్పందిస్తూ.. ఆఫ్రికన్ యూత్ యాక్టివిస్ట్ ఆర్చీ హారిస్ స్పందిస్తూ.. మా దేశం ఆంగ్ల భాష మాట్లాడే దేశం. ఈ ప్రశ్నను ప్రశంసగా కాక, అవమానంగా భావించాను అని అన్నారు.దక్షిణాఫ్రికా రాజకీయ నాయకురాలు వెరోనికా మెంటే స్పందిస్తూ.. ట్రంప్ అలా అన్నాక కూడా బొకాయ్ ఎందుకు అక్కడి నుంచి వెళ్లిపోలేదు? అని ప్రశ్నించారు. అయితే ఈ విమర్శలపై వైట్ హౌస్ స్పందించింది. ట్రంప్ వ్యాఖ్యను హృదయపూర్వక ప్రశంసగా, ట్రంప్ ఆఫ్రికా దేశాలకు మిత్రుడిగా అభివర్ణించింది.లిబీరియా.. 1822లో అమెరికన్ కాలనైజేషన్ సొసైటీ ద్వారా స్థాపించబడింది. 1847లో స్వతంత్ర దేశంగా ప్రకటించుకుంది. ఆంగ్ల భాష అధికార భాషగా ఉంది, కానీ అనేక స్థానిక భాషలు కూడా మాట్లాడబడతాయి.

## 'మాజీ అధ్యక్షుణ్ణి అవమానిస్తారా?'..

**బ్రెజిల్‌కు ట్రంప్ సుంకాల షాక్**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోకు మద్దతు పలుకుతూ, ఆ దేశానికి 50 శాతం భారీ సుంకాన్ని ప్రకటించారు.బోల్సోనారోపై కొనసాగుతున్న అవినీతి కేసుపై విమర్శలు గుప్పించారు. ఇది అంతర్జాతీయ అవమానంగా అభివర్ణించారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వాకు ట్రంప్ రాసిన లేఖలో ఈ కేసును కొనసాగించవద్దని కోరారు. బ్రెజిల్ వాణిజ్య విధానాలపై వాషింగ్టన్ దర్యాప్తు ప్రారంభిస్తుందని హెచ్చరించారు. భారత్ మాదిరిగానే బ్రెజిల్ 'బ్రిక్స్' భాగస్వామ్య దేశం.బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సోనారో తనకు బాగా తెలుసని, ఆయనతో కలిసి తాను పనిచేశానని ట్రంప్ పేర్కొన్నారు. ఆయన పదవీకాలంలో ప్రపంచ నేతలు ఆయనను ఎంతో గౌరవంగా చూశారని ట్రంప్ పేర్కొన్నారు. అయితే అతని విషయంలో ప్రస్తుతం బ్రెజిల్ అనుసరిస్తున్న విధానం అవమానకరమని ట్రంప్ ఆ లేఖలో పేర్కొన్నారు. బోల్సోనారో తిరుగుబాటు కేసుపై ట్రంప్ గతంలో చేసిన విమర్శలపై బ్రెజిల్ ఇటీవల ఘాటుగా స్పందించిన దరిమిలా ట్రంప్ భారీ సుంకాలతో బ్రెజిల్‌కు షాకిచ్చారు.బ్రెజిల్ ప్రస్తుత అధ్యక్షుడు లూలా నుంచి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు బోల్సోనారో కుట్ర పన్నారనే ఆరోపణలున్నాయి. అయితే సైన్యం నుంచి ఆయనకు మద్దతు అందకపోవడంతో ఆ కుట్ర విఫలమైందని చెబుతారు. అయితే బోల్సోనారో ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. కాగా ఆగస్టు ఒకటి నుంచి బ్రెజిలియన్ వస్తువులపై 50 శాతం అమెరికా సుంకం అమల్లోకి వస్తుందని ట్రంప్ ఆ లేఖలో పేర్కొన్నారు.

# ట్రంప్‌ను చంపేస్తాం

యూఎస్ పెద్దఎత్తున దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన నేపథ్యంలో ఈ బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది.ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సలహాదారు జావద్ లారిజాని ఈ హెచ్చరికలు చేశారు. స్థానిక మీడియాలో ఆయన వ్యాఖ్యలు ప్రసారమయ్యాయి. ట్రంప్‌నకు ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో రిసార్ట్ కూడా ఇకపై సురక్షితం కాదని లారిజాని పేర్కొన్నారు. అధ్యక్షుడు సన్‌బాత్ చేస్తున్న సమయంలో ఒక డ్రోన్ ఆయన్ను ఢీకొట్టవచ్చని హెచ్చరించారు. ఇది చాలా సులభమైన పని అని వ్యాఖ్యానించారు. 2020లో ఇరానియన్ టాప్ జనరల్ ఖాసిం సులేమానీ హత్యలో ట్రంప్ పాత్ర ఉందని ఆరోపిస్తూ ఆయన ఈ హెచ్చరికలు చేశారు.ట్రంప్‌నకు రివార్డు ఇవ్వాలని బ్లడ్ పాక్ట్ అనే ప్లాట్‌ఫామ్ క్రౌడ్ ఫండింగ్ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఇలాంటి బెదిరింపులు రావడం గమనార్హం. బ్లడ్ పాక్ట్ లేదా అహ్దే ఖౌన్ అని పిలిచే ఈ ప్లాట్‌ఫామ్ ఇరాన్ నాయకత్వానికి శత్రువులుగా భావిస్తున్న వారిపై, ఖమేనీని అమర్యాదగా సంబోధించడం లేదా బెదిరింపులకు పాల్పడే వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు అవసరమైన నిధులను సేకరిస్తుంది. జులై 8 నాటికి ఇది 27 మిలియన్ డాలర్లను సేకరించింది.

## అమెరికా.. మీకు ఇదే మా సందేశం: తాలిబన్లు

**జనంసాక్షి:**మార్పును బట్టే సమాజం ముందుకు పోతోంది. కానీ, కొన్ని దేశాల్లో మాత్రం మతం, ఆచార వ్యవహారాల పేరిట వెనక్కి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ జాబితాలో అఫ్గనిస్తాన్‌కు చోటు ఉంది.అమెరికా వదిలి వెళ్లిన ఆయుధాలతో వీధుల వెంట విచ్చలవిడిగా తిరుగుతుండడం, విద్యపై నిషేధం, మహిళలపై అక్కడ అమలు చేస్తున్న కఠిన ఆంక్షల సంగతి సరేసరి. ఇలాంటి తరుణంలో తాలిబన్ల నుంచి కలలో కూడా ఊహించని వీడియో ఒకటి విడుదలై ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేస్తోంది.ఓపెన్ చేయగా.. ముసుగులో ఉన్న కొందరు వ్యక్తుల చుట్టూ ఏకే 47 తుపాకులతో, మారణాయుధాలతో తాలిబన్లు కనిపిస్తారు. అమెరికా ఇదే మా సందేశం అంటూ ఓ వ్యక్తి చెబుతున్నాడు. ఆ వెంటనే కింద ఉన్న వ్యక్తికి ఉన్న ముసుగు తొలగించగానే.. చిరునవ్వుతో ఆహ్వానిస్తాడు. అక్కడి నుంచి అసలు కథ మొదలవుతుంది.అఫ్గన్ నేలపై ఉన్న ప్రకృతి సుందర దృశ్యాలు, అక్కడి ఆహారం.. ఇలా అన్నింటినీ అందులో చూపించారు. పాశ్చాత్య టూరిస్టులు అక్కడి సంప్రదాయ పఠాన్ దుస్తులను ధరించి.. స్థానిక వంటలు ఆస్వాదిస్తూ, జలపాతాల్లో ఈతలు కొడుతూ, స్థానికులతో నవ్వుతూ కనిపిస్తారు. ఇవన్నీ మాంచి ఫన్ మ్యూజిక్ బ్యాక్‌గ్రౌండ్‌లో సాగుతాయి. ఈ వీడియోను తాలిబన్ ప్రభుత్వం అధికారికంగా విడుదల చేయలేదు. కానీ, తాలిబన్లకు సంబంధించిన పేజీల్లో జోరుగా చక్కర్లు కొడుతోంది. సాధారణంగా.. ఉగ్రవాదులు విదేశీయులను అపహరించి.. వాళ్ల పీకలు కోస్తూ వీడియోలు తీసి బయటకు వదలడం గతంలో జరిగేది. ఆ ఫార్ములానే ఇప్పుడు టూరిజం ప్రమోషన్ కోసం తాలిబన్లు వాడుకుంటున్నారు. మీ నుంచి(అమెరికా) మేం స్వేచ్ఛను దక్కించుకున్నాం. ఇప్పుడు మీరు మా దేశానికి అతిథులుగా రండి అంటూ ఆ వీడియోలో చెప్పడం ఉంది.ప్రశాంతమైన వాతావరణం, అందులో విదేశీ పర్యాటకులతో స్థానికుల సందడి.. పైగా డమ్మీ తుపాకులపై %ూతీశీజూవతీు శీట ఖూ +శీజవతీఅఎవత్% అని రాసి ఉండడం వాళ్ల వెటకారాన్ని బయటపెట్టింది. వెరసి అఫ్గనిస్తాన్‌ను ఆతిథ్యభరిత దేశంగా చూపించే ప్రయత్నమిదనే విషయం ఈ వీడియోతో స్పష్టమవుతోంది. అయితే..అఫ్గనిస్తాన్‌ను అమెరికా బలగాలు వీడాక.. 2021 అగస్టులో తాలిబన్లు ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఇది తాత్కాలికమే అయినప్పటికీ అంతర్జాతీయంగా ఆ ప్రభుత్వానికి గుర్తింపు దక్కకపోవడంతో రాజకీయ అస్థిరత కొనసాగుతోంది. పైగా ఈ దేశం ఇంకా ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాల జాబితాలోనే ఉండడంతో.. అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు ఇప్పటికీ అఫ్ఘానిస్థాన్‌కి ప్రయాణించవద్దని హెచ్చరిస్తున్నాయి. ఈ క్రమంలో పర్యాటకులను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది ఆ దేశం.ప్రపంచానికి తాము మారిపోయామని తాలిబన్లు చూపించిన ఈ ప్రయత్నం ఒకవైపు ఆశ్చర్యంతో పాటు వీడియోపై విమర్శలు అదే స్థాయిలో వెల్లువెత్తాయి.

# స్టాలిన్ చొరవ.. సమసిన గొడవ!

### తమిళనాడు సీఎం జోక్యంతో మారన్ బ్రదర్స్ మధ్య కుదిరిన సయోధ్య



**జనంసాక్షి:**తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ మరోసారి చక్రం తిప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తలనొప్పిగా మారిన కుటుంబ వివాదాన్ని చక్కదిద్దారు.డీఎంకే పార్టీకి ఇబ్బందికరంగా మారిన మారన్ సోదరుల ఆస్తి గొడవకు ముగింపు పలికారు. సరైన సమయంలో కల్పించుకుని అన్నదమ్ముల వివాదాన్ని పరిష్కరించారు. తమ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ద్రవిడర్ కజగం అధ్యక్షుడు కె వీరమణి, హిందూ దినపత్రిక మాజీ సంపాదకుడు ఎన్ రామ్ సహాయంతో మారన్ సోదరుల మధ్య సయోధ్య కుదిర్చారు. మారన్ కుటుంబంతో పాటు డీఎంకేలోనూ అలజడి రేగకుండా కాచుకున్నారు.ఆస్తుల్లో తనకు రావాల్సిన వాటా కోసం అన్న కళానిధి మారన్‌పై కోర్టుకెక్కిన డీఎంకే ఎంపీ దయానిధి మారన్‌కు భారీగానే నిధి దక్కినట్టు తెలుస్తోంది. దాదాపు రూ. 800 కోట్ల నగదు.. అంతే విలువైన చెన్నైలోని ఎలైట్ బోట్ క్లబ్ ప్రాంతంలో ఎకరం భూమిని పొందారని మారన్ కుటుంబం, డీఎంకే ఉన్నత వర్గాలు వెల్లడించినట్టు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' తెలిపింది. మొత్తానికి దయానిధి మారన్ (%ఖుఖుఅఅన్త్రఱ ఖీతీఖుఅ%) తాను అనుకున్నది సాధించారని సన్నిహిత వర్గాలు గుసగసలాడుతున్నాయి. ఎందుకంటే ఆస్తుల వివాద పరిష్కారానికి తనకు రూ. 1500 కోట్లు ఇవ్వాలని అంతకుముందు ఆయన డిమాండ్ చేసినట్టు తెలిసింది.తన అన్నయ్య కళానిధికి జూన్ ప్రారంభంలో దయానిధి లీగల్ నోటీసు పంపడంతో మారన్ సోదరుల వివాదం బయట ప్రపంచానికి తెలిసింది. సన్ టీవీ నెట్‌వర్క్ షేర్లను అక్రమంగా తన పేరు మీద బదలాయించుకున్నారని దయానిధి ఆరోపించారు. సన్ టీవీ నెట్‌వర్క్ ఒక ప్రైవేట్ కంపెనీగా ఉన్నప్పుడు.. మోసపూరిత వాటా కేటాయింపులు, కార్పొరేట్ దుష్పరిపాలన, ఏకపక్ష నిర్ణయాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ అన్నపై దావా వేశారు. అయితే దయానిధి రూ.1500 కోట్లు చెల్లించాలని కోరగా, కళానిధి రూ.500 కోట్లు మాత్రమే ఇస్తానని చెప్పడంతోనే ఆస్తుల గొడవ రచ్చకెక్కిందని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. కాగా, తనపై తమ్ముడు చేసిన ఆరోపణలను కళానిధి కొట్టిపారేశారు. జూన్ 20న స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు అధికారికంగా వివరణ ఇచ్చారు. పబ్లిక్ లిస్టింగ్‌కు ముందు సన్ నెట్‌వర్క్ కంపెనీకి చెందిన లావాదేవీలన్నీ చట్టబద్ధంగానే జరిగాయని తెలిపారు. వ్యక్తిగతంగానే తనపై తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు.మారన్ సోదరుల మధ్య ఆస్తుల వివాదం ముదిరి పాకాన పడక ముందే పరిష్కరించాలని భావించిన సీఎం స్టాలిన్.. వారిద్దరి మధ్య సయోధ్య కుదర్చడానికి స్వయంగా రంగంలోకి దిగారు. తాను చేసిన ప్రయత్నం విఫలం కావడంతో ఆయన రూటు మార్చారు. తమ కుటుంబానికి అత్యంత సన్నిహితులైన వీరమణి, ఎన్. రామ్‌లతో మంత్రాంగం నడిపించారు. ఇందులో భాగంగా మూడు దఫాల చర్చలు జరిగాయని.. వాటిలో రెండు వ్యక్తిగతంగా, ఒకటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగాయి. అయితే అన్నదమ్ముల మధ్య ఒప్పందం కుదిరిన తర్వాత ఈ చర్చలు జరిగినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.'మొదట మారన్ కుటుంబానికి వీరమణి ఫోన్ చేశారు. ఆ తర్వాత ఇతరులు కూడా చేరారు. జూన్ చివరి వారం నుంచి జూలై మొదటి వారం వరకు మూడు రౌండ్ల చర్చలు జరిగాయి. వివాదం గురించి ఇరు వర్గాలు మీడియాతో మాట్లాడకుండా ఉండాలని, సమస్య పరిష్కార దిశగా ముందుకు సాగాలని మధ్యవర్తులు సూచించార'ని ఆ వర్గాలు తెలిపాయి. ఈ వివాదం కారణంగా డీఎంకే, మారన్ కుటుంబానికి ప్రతిష్టకు కలిగే భంగం.. ఎక్కువ కాలం వ్యాజ్యం కొనసాగడం వల్ల కలిగే నష్టం, కోర్టు ఖర్చుల గురించి కూడా చర్చల్లో పెద్దలు ప్రస్తావించినట్టు సమాచారం.మారన్ సోదరుల ఆస్తుల గొడవ పరిష్కారానికి ఎంకే స్టాలిన్ వ్యూహాత్మకంగా రాజకీయ కురు ద్ధుడైన వీరమణి, ప్రఖ్యాత జర్నలిస్ట్ ఎన్. రామ్‌లను ఎంచుకున్నారు.

## శశిథరూర్ 'చిలక పలుకుల'పై కాంగ్రెస్ సెటైర్లు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌పై.. ఆ పార్టీ తమిళనాడు ఎంపీ మాణిక్యం ఠాగూర్ పేరు ప్రస్తావించడకుండా సెటైర్లు వేశారు.ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో 1975-77 మధ్య విధించిన ఎమర్జెన్సీని చీకటి అధ్యాయంగా అభివర్ణిస్తూ ప్రాజెక్ట్ సిండికేట్‌లో ఎంపీ శశిథరూర్ గెస్ట్‌కాలమ్ రాశారు.అందులో ఇందిరా గాంధీ పాలనలో జరిగిన బలవంతపు స్టెరిలైజేషన్, స్లమ్ తొలగింపు, అధికార దుర్వినియోగం వంటి అంశాలను తీవ్రంగా విమర్శించారు. దీనిపై మాణిక్యం ఠాగూర్ స్పందిస్తూ 'పక్షి చిలుకైందే' అంటూ శశి థరూర్ బీజేపీ లైన్‌ను అనుసరిస్తున్నారా? అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. 'పక్షి చిలుకైందే' అంటే స్వేచ్ఛగా ఎగిరే పక్షి.. ఇతరుల మాటలు యథాతథంగా పలికే చిలుకలా మారింది. పక్షులు ..చిలుకల్ని అనుకరిస్తే అందంగా ఉండొచ్చేమో.. కానీ రాజకీయాల్లో అది సాధ్యం కాదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.1975లో విధించిన ఎమర్జెన్సీని చీకటి అధ్యాయంగా పేర్కొన్న శశిథరూర్ నాటి దుర్భర పరిస్థితుల్ని గెస్టు కాలంలో ప్రస్తావించారు. ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ ఆధ్వర్యంలో జరిగిన బలవంతపు వాసెక్టమీ కార్యక్రమాలు నిర్వహించారు.పేదలు నివసించే గ్రామీణ ప్రాంతాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తూ వారిపై దాడులు చేయడం, న్యూఢిల్లీలాంటి నగరాల్లో మురికి వాడల్లో నివాసాల్ని కూల్చివేయడం, అక్కడ నివసించే వారిని ఖాళీ చేయించారు. ఫలితంగా వేలాది మంది నిట్ట నిలువ నీడలేక నిరాశ్రయులయ్యారు. వారి సంక్షేమాన్ని కూడా పట్టించుకోలేదని గుర్తు చేశారు.ఇలా ఇప్పుడే గతంలో కూడా కాంగ్రెస్ నాయకత్వాన్ని విమర్శిస్తూ శశిథరూర్ పలు కామెంట్లు చేశారు.





# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

- ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేసుకోవాలి
- పల్లె దావఖానాల్లో అన్ని రకాల మందులు సిద్ధంగా పెట్టుకోవాలి
- ముత్తారం మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ముత్తారం జులై 10(జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువా రం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ముత్తారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముత్తారం మండలం మచ్చుపేట గ్రా మంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు, పల్లె దవాఖానా (సబ్ సెంటర్), మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, లకా ్కరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం. పారుపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశ ల అంగన్వాడీ కేంద్రం, చెంచుల శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, అడవి శ్రీరాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖమ్మం పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఓడేడు ఖమ్మం పల్లి బీటీ రోడ్డు నిర్మాణ పనులు, ముత్తారం మండల కేంద్రంలోని త హశీల్దార్ కార్యాలయం, ఐకేపీ కేంద్రంలోని చిల్లి సెంటర్ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, మచ్చుపేట గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పల్లె దవాఖాన ద్వారా గ్రామంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రాథమిక వైద్యానికి అవసరమైన అన్ని రక ల మందులు సిద్ధంగా పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. పారుపల్లి గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాలలో నూతన అడ్మి షన్లు కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులు తీసుకున్నారు. పాఠశాలలో నూతన ప్రీ ప్రైమరీ క్లాసును ప్రారంభించారు. అభివ ృద్ధి కోసం అవసరమైన అదనపు నిధుల ప్రతిపాదనలు అందించాలని అన్నారు. పారుపల్లి ఎంపియుపిఎస్ పిఎం శ్రీ క్రింద ఎంపికైందని, దీని అభివృద్ధికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అన్నారు. చెంచుల ఎస్టీ కాలనీలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను పరిశీలించిన కలెక్టర్ అర్హత ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. అడవి శ్రీరాంపూర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్లను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా గ్రామాలలోని డిజిటల్ క్లాసుల పనితీరు, ఉ పాధ్యాయులు బోధించే బోధనా సరళిని పరిశీలించి విద్యార్థులతో డిజిటల్ క్లాసులపై విద్యార్థులు నేర్చుకున్న వాటిని డిజిట ల్ క్లాసుల ద్వారా వివరించారు. ఐకేపి కార్యాలయంలో ఏర్పాటు చేసే చిల్లి సెంటర్ను లాభసాటిగా నడపాలని, మహిళా సంఘాల ద్వారా కారంపొడి తయారు చేసి విక్రయించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట డిఆర్డిఓ కాళిందిని,ముత్తారం ఎంపిడిఓ సురేష్. ఐకేపి ఎపిఎం పద్మ. ఎఈ పంచాయతీ రాజ్ జగదీష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్డింగ్ జోన్లు గుర్తించాలి

### అదనపు కలెక్టర్ అరుణ శ్రీ..

**గోదావరిఖని, జనంసాక్షి :** వీధి వ్యాపారులు సౌలభ్యర్థం వెండింగ్ జోన్లు గుర్తించాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) అండ్ రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె . అరుణ శ్రీ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ రామగుండం నగర పాలక సంస్థలో నూతన గ్రామాలు విలీనమైన నేపథ్యంలో మెప్మా, పట్టణ ప్రణాళికా విభాగం, ట్రాఫిక్ పోలీస్ శాఖ సంయుక్తంగా సర్వే చేసి చేసి అరవై డివిజన్ల వారీగా రెడ్, గ్రీన్, అంబర్ వెండింగ్ జోన్లు గుర్తించాలని అన్నారు. గుర్తించిన జోన్ లలోనే వీధి వ్యాపారులు విక్రయాలు జరిగేలా ట్రాఫిక్ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వీధి వ్యాపారుల సౌకర్యార్థం కామన్ ఇంటరెస్ట్ గ్రూప్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే ప్రభుత్వం కల్పించే భీమా పథకాలలో వారిని భాగస్వాములను చేయాలని అన్నారు. వీధి వ్యాపారుల జాబితాలో అనర్హులను గుర్తించి తొలగించడంతో పాటు అర్హులను చేర్చాలని అన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల బారిన వీధి వ్యాపారులు పడకుండా బ్యాంకుల సహకారంతో పి ఎం స్వనిధి రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, ఎసిపి శ్రీహరి, టిపిఓ నవీన్, ఆర్ఓ ఆంజనేయులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సిహెచ్ వెంకటేశ్, మెప్మా టిఎంసి మౌనిక సిఓలు ఊర్మిళ, ప్రియదర్శిని, శమంత, రామగుండం పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నూనె లతా మోహన్, వీధి వ్యాపారుల



సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్వశక్తి మహిళలు, ఆర్పిలు, మున్సిపల్ సిబ్బంది కలిసి గాంధీ చౌరస్తా వద్ద మానవ హారం నిర్వహించారు. మార్కండేయ కాలనీ లక్ష్మీ పురం, ఎం ఆర్ ఓ కార్యాలయం వద్ద పిచ్చి చెట్లు, పొదలు తొలగించారు. ఎయిట్ ఇంక్ లైన్ కాలనీలో స్థానికులకు తడిచెత్త పొడిచెత్త వేరు చేయడంపై, వీధి వ్యాపారులకు పిఎం స్వనిధి, తదితర పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో సానిటరీ ఇన్స్పెక్టర్లు కిరణ్, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. రోడ్లపై తిరుగుతున్న పశువులను గోశాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఎసి) జె. అరుణ శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. యజమానులు రోడ్లపై తిరుగుతున్న తమ పశువులను మూడు రోజుల్లోగా తరలించుకుపోవాలని ఆమె కోరారు.




# 3 కోట్ల రుణ మోసం

### ప్రియాంక డయగ్నొస్టిక్స్‌పై క్లిస్ కంపెనీ ఫిర్యాదు

**చౌటుప్పల్, జూలై 10(జనం సాక్షి ):** రుణం తీసుకుని మోసం చేసిన ఘటనపై క్లిస్ కంపెనీ మేనేజర్ మంద్రా జ్ఞానానంద కుమార్ గురువారం ప్రియాంక డయగ్నొస్టిక్స్ సెంటర్ పై ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం క్లిస్ కంపెనీ నుండి ఎమ్ఆర్ఐ మెషిన్, ఇతర వైద్య పరికరాల కోసం దాదాపు రూ. 3 కోట్ల వరకు రుణంగా తీసుకున్నారన్నారు. ఈ మేరకు ప్రియాంక డయగ్నొస్టిక్స్ సెంటర్, మామిడి శివరాణి, గుండరపు శివశంకర్, శ్రీ మణికంఠ మెడికల్ అండ్ జనరల్ స్టోర్, జియో మెడికల్ సిస్టమ్స్ ప్రొప్రైటర్ సూర్యప్రకాశ్ లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారం భించారు. పూర్తి వివరాలు త్వరలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# అమ్మకానికి.. హెచ్ పిటి హిందీ టీచర్ పోస్ట్?

- నాలుగు పోస్టులు భర్తీకి అవకాశం.. ఒక్క పోస్ట్‌కి దరఖాస్తు ఆహ్వానం
- తనకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే అవకాశం?
- గతంలో నిధుల దుర్వినియోగంపై దుమారం



**మర్రిగూడ, జులై 10( జనం సాక్షి)** నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ఖాళీ గా ఉన్న హిందీ సబ్జెక్టులు బోధించ డానికి గంటల ప్రతిపాదికన హిందీ సబ్జెక్టు బోధించడానికి హెచ్‌పిటి టీచర్ కోసం గురువారం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ దరఖాస్తులు ఆహ్వానించడంపై మర్రిగూడ మండలం వ్యాప్తంగా తీవ్ర దుమరం రేగింది. హెచ్‌పిటి హిందీ టీచర్ పోస్ట్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అమ్మకానికి పెట్టినట్లు తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి, తమకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నారని సమస్యలపై నిలదీస్తే కక్షగట్టి మరి వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భర్తీ చేస్తే నాలుగు పోస్టులను భర్తీ చేయాలి కానీ కక్షపూరితంగా వ్యవహరించి ఒకరిని మాత్రమే తొలగించడంపై మండల వ్యాప్తంగా చర్చ జరుగుతుంది, స్కూల్ సమస్యలపై ప్రిన్సిపల్ నిలదీస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వ్యవహారం తమకు అర్థం కావడం లేదని స్కూల్ అభివృద్ధికి నోచుకోలేదని కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రిన్సిపల్ పూర్తిగా విఫలమయ్యారని, గతంలో స్కూల్ అభివృద్ధి నిధులను దుర్వినియోగం చేయడంపై మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పై అనేక ఫిర్యాదులు వచ్చాయి. ప్రిన్సిపల్ పై ఎలాంటి విచారణ జరగలేదని రాజకీయ పలుకుబడితోనే ప్రిన్సిపల్ పై జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండల వాసులు ఆరోపిస్తున్నారు,ఏళ్ల తరబడి ఒకే చోట విధులు నిర్వహిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వెంటనే బదిలీ చేయాలని మండల వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు,

# రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలలో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు ప్రథమ స్థానం పతకాలు

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 10 (జనంసాక్షి) :** అబాకస్ ద్వారా విద్యార్థులకు చాలా లాభాలు కలుగుతాయని ముఖ్యంగా వారి మేధస్సు పెరుగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో ప్రథమ బహుమతులు రావడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ... పురాతన కాలం నుండి కొనసాగుతున్నటువంటి అబాకస్ పాఠశాలల్లో సైతం చక్కటి ప్రణాళికల ద్వారా రూపొందించడం జరుగుతుందని చెప్పారు. దీనిని సాధన చేసిన వారికి విశ్లేషణాత్మక ఆలోచన ధోరణి ఉంటుందని, జ్ఞాపకశక్తి, పోటీ తత్వాన్ని పెంచుకుంటారని అభిప్రాయపడ్డారు. నేటి కాలంలో అబాకస్ కు చాలా క్రేజ్ ఉన్నదని దేశ విదేశాల్లో సైతం ఈ అబాకస్కు చాలా విశిష్టత ఉందని చెప్పారు.

ప్రస్తుతం భారత దేశంలో సైతం చాలామంది విద్యార్థులు ఈ పురాతన పద్ధతి ద్వారా గణిత శాస్త్రంలో నైపుణ్యాన్ని సాధిస్తూ.. వివిధ పోటీ పరీక్షలలో విజయాన్ని చాలా సులభంగా సాధిస్తున్నారని, అబాకస్ విశిష్టతను దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు వారి పిల్లలకు దీనిపై దృష్టి సారింప చేసే విధంగా శ్రద్ధ పెట్టాలని కోరారు. ముఖ్యంగా అబాకస్ ద్వారా ఏకాగ్రత పెంపొందించవచ్చని, విద్యార్థులకు నేర్చుకునేటువంటి ఆసక్తిని సైతం దీని ద్వారా కల్పించవచ్చని చాలా విలువైనటువంటి ఈ పరికరం




ద్వారా విద్యార్థులకు పలు విషయాలను సైతం చాలా లోతుగా అర్థమయ్యే విధంగా నైపుణ్యాన్ని ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో హైదరాబాదులో నిర్వహించిన టువంటి ఎస్ఐపి అబాకస్ అకాడమీ రాష్ట్రస్థాయి పోటీలలో పాఠశాలకు చెందినటువంటి ఇ.అన్విత, 7వ తరగతి, మొదటి స్థానంతో పాటు నగదు బహుమతి, సర్టిఫికేట్, మెడల్, జి మ.హర్షిత్, రజిత పతాకాన్ని, సర్టిఫికేట్, ఎండీఏ ఇస్లాం, 6వ తరగతి, మొదటి రన్నర్రోప్ పాటు మెడల్లను, సర్టిఫికెట్ తీసుకున్నారు.రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి విశిష్టంగా రాణిస్తున్న విద్యార్థులకు పుష్పగుచ్చాలతో పాటు అభినందన సర్టిఫికెట్లను ప్రదానం చేసి భవిష్యత్తులో నిర్వహించబడేటువంటి పలు పోటీలలోపై చేయి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఆ నాలుగు విద్యా సంస్థలకేనా?

- అధికారుల తనిఖీలు కొన్ని ప్రైవేట్ స్కూళ్లకేనా?
- ఒక పేరుతో అనుమతి..మరొక పేరుతొ నిర్వహణ
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 10 (జనంసాక్షి) :** వేములవాడలో ప్రైవేటు విద్యా సంస్థలు చేస్తున్న విద్యా మాయాజాలం అంతా ఇంత కాదు. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నత్మాకంగా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టా రాజ్యంగా విద్యాసంస్థలు నిర్వహిస్తూ, వ్యాపార కేంద్రాలుగా మారుస్తూ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు.సొమ్ము ఒక్కడిది సోకు ఇంకొకరిది అన్న చందంగా అనుమతి పత్రాలలో ఒక పేరు,విద్యాసంస్థల బోర్డు పైన ఇంకొక పేరు పెట్టుకొని నిర్వహిస్తున్న తీరు చూస్తుంటె స్పష్టం అవుతుంది. దీనికి తోడు కొన్ని పాఠశాలలలో అర్హులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యా భోధన, ఐఐటీ,నీట్ ఫౌండషన్ కోర్సులు, స్పోర్ట్స్, ఆర్ట్స్ అంటూ మాయ మాటలు చెబుతూ, తల్లి దండ్రుల నుండి అధిక ఫీజులు చేస్తున్నారని విమర్శ లు వస్తున్నాయి. మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశా లతో ఓ నాలుగైదు ప్రైవేట్ స్కూల్లలొ మాత్రమే తనిఖీలు నిర్వహించి, 24 గంటలలో సరియైన ధృవీకరణ పత్రాలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మరికొన్ని ప్రయివేట్ పాఠశాలలను మాత్రం వదిలేయడంపై పలు అనుమనాలు వ్యక్త మవుతున్నా యి.వాటిపై చర్యలు ఉంటాయా...? లేదా అనేది వేచి చుడాల్సిందే..? వేములవాడలో మరి కొన్ని విద్యా సంస్థలు ఎలాంటి అనుమతులు లేకుండానే గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.



కొందరి ప్రజా ప్రతినిధుల అండ దండలు ఉండడం వల్లే, వాటిపై అధికారు లు చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారని ప్రజలు నుండి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అంతే కాకుండా నిబంధనలకి విరుద్ధంగా పాఠశాలలో పుస్తకాలు, యూనిఫామ్స్ అధిక రెట్లకు విక్రయిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అందిన కాడికి దండుకుంటున్నారని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. కొన్ని స్కూల్లలో కనీస విద్యార్హతలు లేని ఉపాధ్యాయులచే విద్యా భోధన నిర్వహిస్తున్నారని వినికిడి.ఇక స్కూల్లలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే, విద్యార్థుల భద్రతకు సౌకర్యాలు శూన్యంగా కనిపిస్తున్నాయి.అసలే అనుమతు లు లేని విద్యా సంస్థలు, పైగా విద్యను వ్యాపారం చేస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని,ఇదిలా ఉంటే కొన్ని స్కూల్లలోనే అధికారులు తనిఖీలు నిర్వహించడంలో మతలబు ఏంటనే చర్చ పట్టణంలో సాగుతుంది.ఇంత తతంగం నడుస్తున్నప్పటికీ విద్యా శాఖ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి, చేతులు దులుపు కుంటున్నారని ప్రజలు మండిపడు తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో దృష్టి సారించి,అనుమతులు లేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకొని, విద్యార్థుల బంగారు భవిష్యత్తును కాపాడాలని కోరుతున్నారు.

# నిజామాబాద్ డిపో అర్ఎం రిలీవ్ చేయట్లేదు

### ఎలుకల మందు తాగి ఆర్టీసీ బస్ డ్రైవర్ ఆత్మహత్యయత్నం



**ఆర్మూర్, జూలై 10 ( జనం సాక్షి):** నిజామాబాద్ 2 ఆర్టీసీ డిపోలో బస్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ ఇమామ్ సాహెబ్ బస్సును ఆర్మూర్ బస్టాండ్‌లో ఆపి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగ ట్టాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లాలో ఆర్టీసీ డిపోలో సిబ్బంది అధికంగా ఉండడంతో షేక్ ఇమామ్ సాహెబ్ ను మూడు సంవత్సరాల క్రితం నిజామాబాద్ డిపోకు ట్రాన్స్ఫర్ చేశారు. కేవలం 6 నెలలకే అని చెప్పి సుమారు మూడు సంవత్సరాలు గడుస్తున్న నిజామాబాద్ డిపోలోనే ఆర్టీసీ బస్ డ్రైవర్‌గా విధులు కొనసాగిస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధి కారి ఖమ్మం జిల్లాలో విధుల్లో చేరాలని బదిలీ ఉత్తర్వులు పంపించారు. కాగా ఆర్టీసీ నిజామా బాద్ డిపో ఆర్ఎం రీలీవ్ చేయట్లేదని కలత చెందాడు. దీంతో నిజామాబాద్ నుండి నిర్మల్ వైపుగా విధుల్లో భాగంగా ప్రయాణిస్తున్న ఆర్టీసీ డ్రైవర్ ఆర్మూర్ బస్టాండ్‌లో బస్సును ఆపి, కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్నానని కలత చెంది ఎలుకల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన డ్రైవర్లు,ఆర్టీసీ కార్మికులు హుటాహుటిన షేక్ ఇమామ్ సాహెబ్ ను ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



# పారమిత పాఠశాలలో గురుపూర్ణిమ వేడుకలు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 10 (జనంసాక్షి) :** స్థానిక నగరంలోని మంకమ్మతోటలోని పారమిత లిటిల్ జీనియస్ , పారమిత ఉన్నత పాఠశాలలో గురుపూర్ణిమ వేడుకలు నయనానందకరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పారమిత పాఠశాలల అదినేత డా. ఇనుగంటి ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వ్యాస మహా ముని పుట్టిన రోజు పురస్కరించుకుని ఈ రోజు హిందువులు ప్రతి సంవత్సరం ఆషాడ శుద్ధ పౌర్ణమి రోజున గురు పౌర్ణమి జరుపుకుంటారు. ఈ సంధర్భంగా పారమిత పాఠశాలల అదినేత డా. ఇనుగంటి ప్రసాద రావును విద్యార్థులు, ఉపాద్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ నేపద్యంలో ప్రసాదరావు మాట్లాడు తూ... గురువులు మనందరికీ మార్గదర్శకులు ఉపాధ్యాయులను గౌరవించడం వారి ఆశీర్వాదాలు తీసుకోవడం మన కర్తవ్యం. ఈ క్రమంలో మనం చేసిన తప్పులను ఎత్తి చూపిస్తూ మనలను సక్రమ మార్గంలో నడిపే ప్రతి గురువుకి మనం ఋణపడి ఉండాలి అలాగే వారు చూపించిన మంచి మార్గంలో నడుచుకుంటూ మన జీవితానికి సార్థకత చేసుకోవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గురువు ప్రాధాన్యాన్ని తెలిపే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకు న్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అనుకర్ రావు, వినోదరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత సమన్వయకర్తలు పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి) :** వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అర్హులైన వారిని ముఖ మంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నా మని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ఏదో రకంగా సహాయం అందే విధంగా కృషి చేస్తున్నామని ప్రజల ఇబ్బందులు తొలగించడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. చెక్కులు పొందిన వారిలో దానవేణి రమేష్, కటకం దేవయ్య, కుర్ర రాజేశ్వరి, గాజుల తిరుపతి, సాయికిరణ్, మహమ్మద్ యూసుఫ్, అస్మాసుల్తానా ఉన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ వద్దిరాజు



**ఖమ్మం, జులై, 10(జనం సాక్షి) :** అనారోగ్యం పాలై ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన బాధితులకు తన సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గురువారం పంపిణీ చేశారు. బుర్హాన్ పురంలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 13 మంది బాధితులకు వీటిని అందజేశారు. అనంతరం ఆయన చెక్కులు పొందిన లబ్ధిదారులను పరామర్శించా రు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమ ంలో కార్పోరేటర్లు శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకట రమణ, పగడాల నరేందర్, నేలకొండపల్లి మండలం రాజారాంపేట సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఖమ్మం గాంధీచౌక్ వద్ద కొలువైన వరప్రదాత షిర్డీసాయి మందిరంలో 15వ గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి.



ఈ వేడుకలకు ఆలయ కమిటీ ఛైర్మన్,ప్రముఖ వ్యాపారవేత్త వేములపల్లి వెంకటేశ్వర రావు ఆహ్వానం మేరకు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర భక్తిశ్రద్ధల తో సాయిబాబాకు దీపారాధనతో ప్రత్యేక పూజలు చేశారు.వేడుకలకు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు ఎంపీ రవిచంద్ర అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు.ఎంపీ రవిచంద్ర కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర రావు-సామ్రాజ్యలక్ష్మీ దంపతులను శాలువాతో సత్కరించి గురుపౌర్ణమి శు భాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకలకు హాజరయ్యేందుకు వచ్చిన ఎంపీ వద్దిరాజు,ఆయన సన్నిహితులు ఆకుల గాంధీ,శీలంశెట్టి వీరభద్రం, మహంకాళి రాజశేఖర్ తదితరులకు వెంకటేశ్వర రావుతో పాటు కమిటీ సభ్యులు నిరంజన్,జగన్, ప్రసాద్, నాగేశ్వరరావులు సాదర స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు,దేవుళ్ల చిత్రపటాలను బహుకరించారు.



ఖమ్మం సిటీ స్పెషల్ బ్రాంచ్ ఏసిపిగా టి. మహేష్ గురువారం భాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఖమ్మం (జనంసాక్షి) :



ఆల్ ఇండియా ఐఐటీ ర్యాంకర్ ఆదర్శను అభినందించిన వద్దిరాజు చెన్నై ఐఐటి లో సీటు సాధించిన సామాజిక ఉద్యమ నేత లింగాల రవికుమార్ కుమారుడు లింగాల ఆదర్శను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అభినందించారు ఐఐటీలో మరింత కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. ఖమ్మం(జనం సాక్షి) :



# టీ20 సిరీస్ సొంతం

## చరిత్ర సృష్టించిన భారత మహిళల జట్టు

### ఇంగ్లాండ్‌పై భారత మహిళల సంచలన విజయం

**మాంచెస్టర్, జులై 10, 2025 (జనంసాక్షి):**
భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే 3-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. నాల్గవ టీ20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 127 పరుగుల లక్ష్యాన్ని భారత్ 17 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. స్మృతి మంధాన (32 పరుగులు), షఫాలీ వర్మ (31 పరుగులు), జెమీమా రోడ్రిగ్స్ (24 పరుగులు నాటౌట్), మరియు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (26 పరుగులు) అద్భుత బ్యాటింగ్‌తో రాణించారు.

అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసింది. భారత బౌలర్ల ధాటికి ఇంగ్లాండ్ బ్యాటింగ్ విలవిల్లాడింది. సోఫియా డంక్లీ (22 పరుగులు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లలో రాధా యాదవ్ (4 ఓవర్లలో 15 పరుగులు ఇచ్చి 2 వికెట్లు), శ్రీ చరణి (2 వికెట్లు), అమన్‌జోత్ కౌర్, మరియు దీప్తి శర్మ (ఒక్కో వికెట్) రాణించారు. ఈ విజయం భారత మహిళల జట్టుకు చారిత్రాత్మకమైనది. ఇంగ్లాండ్‌పై టీ20 సిరీస్ గెలవడం భారత్‌కు ఇదే తొలిసారి. గతంలో ఇరు జట్ల మధ్య జరిగిన ఆరు ద్వైపాక్షిక సిరీస్‌లను ఇంగ్లాండ్ గెలిచింది. 2006లో డర్బీలో జరిగిన ఏకైక టీ20 మ్యాచ్‌లో మాత్రం భారత్ విజయం సాధించింది. మొదటి రెండు టీ20ల్లో గెలిచిన టీమ్ ఇండియా, మూడో మ్యాచ్‌లో 5 పరుగుల స్వల్ప తేడాతో ఓడిపోయింది. అయితే, నాల్గవ మ్యాచ్‌లో అద్భుత పునరాగమనం చేసి సిరీస్‌ను ఖాయం చేసింది. ఐదో టీ20 మ్యాచ్ జులై 12న ఎడ్జ్‌బాస్టన్‌లో జరగనుంది, ఇది లాంఛనప్రాయంగా మారింది.

కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ మ్యాచ్‌లో చరిత్ర సృష్టించింది. ఆమె భారత్ తరపున 333 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి, మిథాలీ రాజ్ రికార్డును సమం చేసింది. మరో మ్యాచ్ ఆడితే, భారత మహిళల క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన క్రీడాకారిణిగా నిలుస్తుంది. 36 ఏళ్ల హర్మన్‌ప్రీత్ 2009లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసింది. ఆమె ఆల్‌రౌండర్‌గా రాణిస్తూ, 6 టెస్టుల్లో 200 పరుగులు, 12 వికెట్లు, 146 వన్డేల్లో 3943 పరుగులు (6 సెంచరీలు, 19 అర్ధ సెంచరీలు), 31 వికెట్లు, మరియు 181 టీ20ల్లో 3639 పరుగులు (1 సెంచరీ, 14 అర్ధ సెంచరీలు), 32 వికెట్లు సాధించింది. ఆమె అత్యుత్తమ వన్డే స్కోరు 171 నాటౌట్.

ఈ సిరీస్ విజయం భారత మహిళల క్రికెట్ జట్టు బలాన్ని, సమిష్టి కృషిని ప్రపంచానికి చాటింది. జులై 12న జరిగే చివరి టీ20 తర్వాత, ఇరు జట్లు మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తలపడనున్నాయి.

**భారత మహిళల క్రికెట్ జట్టు కొత్త చరిత్ర సృష్టించింది. నాలుగో టీ20లో చిరస్మరణీయ విజయంతో ఇంగ్లండ్ (%జుఅస్త్రశ్రీుఖఅస%) గడ్డపై తొలిసారి సిరీస్ విజేతగా అవతరించింది టీమిండియా. మ్యాచ్ ఆసాంతం ఆధిపత్యం చెలాయించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఆతిథ్య జట్టును ఆరు వికెట్ల తేడాతో ఓడించి మరో మ్యాచ్ ఉండగానే 3-1తో సిరీస్ కైవసం చేసుకుంది. తెలుగమ్మాయి శ్రీచరణి (2/30), ఆల్‌రౌండర్ రాధా యాదవ్(2/15).. షఫాలీ వర్మ(32) భారత జట్టు అద్భుత విజయంలో కీలక పాత్ర పోషించారు.**

## లార్డ్స్ టెస్టుకు బుమ్రా

లార్డ్స్ : భారత్‌తో జరుగుతున్న మూడవ టెస్టులో టాస్ గెలిచిన ఇంగ్లండ్ ఫస్ట్ బ్యాటింగ్ ఎంచుకున్నది. భారత జట్టులోకి మళ్లీ బుమ్రా వచ్చేశాడు. బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో బుమ్రాకు రెస్ట్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ టెస్టులో టీమిండియా భారీ విజయాన్ని నమోదు చేసింది. ఫస్ట్ టెస్టును ఇంగ్లండ్ గెలిచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అయిదు టెస్టుల సిరీస్‌లో 1-1 సమంతో ఉన్నాయి. ప్రసిద్ధకృష్ణ స్థానంలో బుమ్రాను తీసుకున్నారు. వరుసగా మూడోసారి బెన్ స్టోక్స్ టాస్ గెలిచాడు. టెస్టు సిరీస్ ఆసక్తికరంగా మారిందని, లార్డ్స్‌లో గెలిచి సిరీస్ లో 2-1 ఆధిక్యాన్ని సాధించాలనుకుంటున్నట్లు చెప్పాడు. ఇంగ్లండ్ జట్టు ఒక మార్పు చేసింది. ఆ జట్టులోకి ఫాస్ట్ బౌలర్ ఆర్చర్ వచ్చాడు. నాలుగేళ్ల తర్వాత అతను టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. జోష్ టాంగ్ స్థానంలో అతన్ని తీసుకున్నారు.

## కన్నతండ్రి చేతిలో హతమైన టెన్నిస్ ప్లేయర్



టెన్నిస్ ఆటలో గొప్పగా రాణించాలనుకున్న ఓ యువ క్రీడాకారిణి జీవితం అర్థాంతరంగా ముగిసింది. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధిస్తూ.. జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో మెరవాలనుకున్న ఆమె కన్నతండ్రే కడతేర్చాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తుందనే కోపంతో ఏకంగా ఐదు రౌండ్లు కాల్పులు జరిపి ఆమెను పొట్టనబెట్టుకున్నాడు. రాకెట్‌నే ప్రాణంగా భావించి.. అద్భుత విజయాలతో పలు ట్రోఫీలు సాధించిన ఆ అమ్మాయి పేరు రాధికా యాదవ్. టెన్నిస్ తారగా పేరొందని రాధిక కుటుంబంతో కలిసి గురుగ్రామ్‌లోని సుశాంత్ లోక్ ఫేజ్‌లో నివసించేది. ఆమె అందరూ టీనేజర్ల మాదిరిగానే స్మార్ట్ ఫోన్లో.. ముఖ్యంగా ఇన్‌స్టాలో ఎక్కువ సమయం గడిపేది. అయితే.. ఎన్నిసార్లు వారించినా ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేయడం మానడం లేదనే నెపంతో రాధిక తండ్రి గురువారం తుపాకీతో ఆమెను కాల్చి చంపాడని పోలీసులు తెలిపారు. కన్న కూతురిని అమానుషంగా హత్య చేసిన అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు.

చిన్న వయసులోనే రాకెట్ అందుకున్న రాధికా యాదవ్ రాష్ట్ర స్థాయి టెన్నిస్ ప్లేయర్. పలు టోర్నీల్లో విజేతగా నిలిచిన ఆమె జాతీయ స్థాయిలో రాణించాలని ఎన్నో కలలు కన్నది. కానీ, ఆ యువకెరటం కలల్ని ఆమె తండ్రి కల్లలు చేశాడు. కూతురు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ మాయలో పడిందని.. ఎంత చెప్పినా వినిపించుకోవడం లేదని రాధికపై అతడు కోపం పెంచుకున్నాడు. అంతే.. అతడిలో ఆమెపై మమకారం వదిలేసి.. తుపాకీతో కాల్చి చంపాడు. ప్రతిభావంతురాలైన రాధిక హత్యకు గురైందనే వార్త తెలిసి అందరూ షాక్‌కు గురవుతున్నారు.

## కుశాల్, నిశాంక మెరుపుల్..

### తొలి టీ20లో బంగ్లా ఓటమి

సొంత గడ్డపై శ్రీలంక చెలరేగిపోతోంది. ఇప్పటికే టెస్టు, వన్డే సిరీస్ కైవసం చేసుకున్న ఆతిథ్య జట్టు పొట్టి సిరీస్‌ను విజయంతో ఆరంభించింది. పల్లెకెలె స్టేడియంలో గురువారం జరిగిన తొలి పోరులో బంగ్లాదేశ్‌పై లంక 7 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. స్పిన్నర్ థీక్షణ(2-37) ప్రత్యర్థిని దెబ్బకొట్టగా.. కుశాల్ మెండిస్(73) సూపర్ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించాడు. దాంతో, లంక మూడు మ్యాచ్‌ల దూసుకెళ్లింది. వన్డే సిరీస్ గెలిచిన ఉత్సాహంలో ఉన్న శ్రీలంక టీ20 సిరీస్‌ను విజయంతో మొదలుపెట్టింది. బంగ్లాదేశ్‌ను తక్కువకే కట్టడి చేసిన చరిత అలసంక బృందం స్వల్ప ఛేదనను ధాటిగా ఆరంభించింది. ఓపెనర్లు పథుమ్ నిశాంక(42) మెరుపు బ్యాటింగ్‌కు కుశాల్ మెండిస్(73) మెరుపులు తోడవ్వడంతో వేగంగా లక్ష్యానికి చేరువైంది. ఈ ఇద్దరు ఔటయ్యాక అవిష్క ఫెర్నాండో తో కలిసి కెప్టెన్ అసలంక విరుచుకుపడ్డాడు. వీరిద్దరి జోరుతో మరో ఓవర్ ఉండగానే ఊదిపడేసింది లంక. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ భారీ స్కోర్ చేయలేక పోయింది. టాపార్డర్‌లో పర్వేజ్ హొసేన్ (38), తంజిద్ హసన్(16)లు రాణించినా మిడిలార్డర్‌ను థీక్షణ, వాండర్సే క్రీజులో నిలువనీయలేదు. దాంతో, బంగ్లా నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి154 పరుగులు మాత్రమే చేసింది. ఇరుజట్ల మధ్య రెండో టీ20 జూలై 13న జరుగనుంది.



## వరల్డ్ నంబర్ 1ను చిత్తు చేసిన అమందా



### వింబుల్డన్ ఫైనల్‌లో చరిత్ర

**లండన్, జులై 10, (జనంసాక్షి):**
వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మరో సంచలనం! వరల్డ్ నంబర్ 1, టాప్ సీడ్ అరీనా సబలెంకాకు అమెరికా సంచలనం అమందా అనిసిమోవా షాకిచ్చింది. గురువారం జరిగిన మహిళల సెమీఫైనల్ మ్యాచ్‌లో 13వ సీడ్ అమందా, సెంటర్ కోర్టులో సబలెంకాను చిత్తు చేసి తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలి రౌండ్ నుంచి టాప్ సీడ్‌ల నిష్క్రమణతో ఆసక్తికరంగా సాగుతున్న వింబుల్డన్‌లో ఈ విజయం అమందాను సూపర్‌స్టార్‌గా నిలిపింది. మ్యాచ్ ఆదిలోనే అమందా దూకుడుగా ఆడి సబలెంకాకు ఒత్తిడి తెచ్చింది. తొలి సెట్‌ను 6-4తో కోల్పోయిన సబలెంకా, రెండో సెట్‌లో పుంజుకుని గెలిచి ఆశలు రేపింది. అయితే, నిర్ణయాత్మక మూడో సెట్‌లో అమందా అద్భుత ప్రదర్శనతో సబలెంకాను మట్టికరిపించింది. ఈ విజయంతో అమందా తన తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు చేరుకుంది. టైటిల్ కోసం ఆమె రెండో సెమీఫైనల్ విజేత (ఇగా స్వియాటెక్ లేదా బెలిండా బెన్సిక్)ను ఎదుర్కొననుంది.

**17 ఏళ్లలోనే స్టార్‌గా రాణించిన అమందా**

అమందా అనిసిమోవా పేరు నెట్టింట ట్రెండింగ్‌లో నిలిచింది. న్యూ జెర్సీలో జన్మించి, ఫ్లోరిడాలో పెరిగిన ఈ 22 ఏళ్ల అమెరికన్ టీనేజ్ నుంచి టెన్నిస్‌లో సంచలనం సృష్టించింది. 17 ఏళ్ల వయసులో 2019 ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనల్‌కు చేరి భవిష్యత్ స్టార్‌గా ప్రశంసలు అందుకుంది. అయితే, మానసిక ఆరోగ్య సమస్యలతో ఏడాది విరామం తీసుకుంది. ఆ సవాళ్లను అధిగమించి, రాకెట్‌ను వదలకుండా తిరిగి రంగంలోకి దిగిన అమందా, వింబుల్డన్‌లో వరల్డ్ నంబర్ 1ను ఓడించి సత్తా చాటింది. "సబలెంకా నాకు స్ఫూర్తి. ఆమె చాలామందికి రోల్ మోడల్. ఈ విజయాన్ని వర్ణించడానికి మాటలు సరిపోవు," అని అమందా ఉద్వేగంతో చెప్పింది. ఈ సంచలన విజయం అమందాను టెన్నిస్ ప్రపంచంలో కొత్త శిఖరాలకు చేర్చనుంది.

## సారాతో సందడి చేసిన శుభమన్



భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తన యువీక్యాన్ ఫౌండేషన్ కోసం జులై 8, 2025న లండన్‌లో ఒక ఛారిటీ డిన్నర్‌ను ఏర్పాటు చేశాడు. ఈ విందులో క్రికెట్ ప్రపంచంలోని అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించడానికి, చికిత్స కోసం నిధులు సేకరించడానికి ఈ డిన్నర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విందుకు భారత టెస్ట్ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన టీమ్ మొత్తంతో కలిసి వచ్చాడు. ఈ నేపథ్యంలో శుభమన్ గిల్ ఒక ఫోటో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ గిల్‌తో కలిసి కనిపించడం మళ్ళీ చర్చకు దారితీసింది. క్యాన్సర్ మహమ్మారిని జయించిన తర్వాత యువరాజ్ సింగ్ 2011లో యువీక్యాన్ ఫౌండేషన్‌ను స్థాపించాడు. ఈ ఫౌండేషన్ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడానికి, ముందుగానే గుర్తించడాన్ని ప్రోత్సహించడానికి, రోగులకు ఆర్థిక సహాయం అందించేందుకు పనిచేస్తుంది. దానిలో భాగంగానే లండన్‌లో జరిగిన ఈ ఛారిటీ డిన్నర్ లక్ష్యం ఫౌండేషన్ కోసం నిధులను సేకరించడం. ఇప్పుడు ఈ కార్యక్రమంలో శుభ్‌మన్ గిల్, సారా టెండూల్కర్ కనిపించిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వైరల్ అవుతున్న ఫోటోలో శుభ్‌మన్ నవ్వుతూ కనిపించాడు. సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ అతని ముందు కూర్చుని ఉంది. అయితే, ఈ ఫోటో గిల్ తన జట్టుతో విందుకు వచ్చినప్పుడు, సారా అప్పటికే అక్కడ ఉన్నప్పుడు తీసినది అని చెబుతున్నారు. సారా టెండూల్కర్ ఈ ప్రోగ్రాం ఫోటోను తన సోషల్ మీడియా అకౌంట్లో షేర్ చేసింది. అందులో ఆమె తన ఫ్రెండ్స్‌తో కనిపించింది. శుభ్‌మన్ గిల్ పేరు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్‌తో చాలాసార్లు వినిపించింది.

ఒకానొక సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ సంబంధం ఉన్నట్లు వదంతులు ప్రచారంలోకి వచ్చాయి. దీనికి బలం చేకూర్చేలా ఇద్దరూ గతంలో సోషల్ మీడియాలో ఒకరినొకరు ఫాలో అయ్యేవారు. అలాగే, పరస్పరం పోస్ట్‌లకు లైక్ చేయడం, కామెంట్ చేయడం కూడా జరిగేది. కానీ ఆ తర్వాత ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం ద్వారా వదంతులకు తెర దించారు. అయితే, శుభ్‌మన్, సారా ఈ వదంతుల గురించి ఇప్పటివరకు బహిరంగంగా నోరు విప్పలేదు.

# ఇంగ్లాండ్ నడ్డి విరిచాడు



### లార్డ్స్ టెస్టులో నితీశ్ కుమార్ రెడ్డి సంచలనం

లార్డ్స్ టెస్టులో టీమ్ ఇండియా యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఇంగ్లాండ్ బ్యాటింగ్‌ను తొలి సెషన్‌లోనే బెదరగొట్టాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్‌ను నితీశ్ తన బౌలింగ్ ధాటితో కట్టడి చేశాడు. ఓపెనర్లు జాక్ క్రాలీ (18 పరుగులు) మరియు బెన్ డకెట్ (23 పరుగులు)ను పెవిలియన్‌కు చేర్చి, భారత జట్టులో ఉత్సాహం నింపాడు. దీంతో ఇంగ్లాండ్ 50 పరుగులలోపే రెండు కీలక వికెట్లు కోల్పోయింది.

డ్రింక్స్ బ్రేక్ వరకు 14 ఓవర్లలో ఇంగ్లాండ్ 39-0తో నిలిచింది. బ్రేక్ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నితీశ్‌కు బంతిని అప్పగించాడు. తన రెండో బంతికి డకెట్ ఫోర్ కొట్టినప్పటికీ, తదుపరి బంతితో నితీశ్ అద్భుత షార్ట్ బాల్ వేసి డకెట్‌ను ఔట్ చేశాడు. బంతి డకెట్ బ్యాట్‌కు ఎడ్జ్ అయి వికెట్ కీపర్ రిషబ్ పంత్ చేతుల్లో పడింది, దీంతో ఇంగ్లాండ్ 43 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. అదే ఓవర్‌లో ఆఖరి బంతితో నితీశ్ మరో సంచలనం సృష్టించాడు. స్లో డెలివరీతో జాక్ క్రాలీని మభ్యపెట్టి, బంతిని బ్యాట్ ఎడ్జ్‌తో పంత్ చేతుల్లోకి పంపాడు. 43 బంతులు ఆడిన క్రాలీ 18 పరుగులతో ఔటయ్యాడు. నాలుగు బంతుల వ్యవధిలో ఇద్దరు ఓపెనర్లను పెవిలియన్‌కు పంపి నితీశ్ ఇంగ్లాండ్ డగౌట్‌ను నిశ్శబ్దం చేశాడు.

ప్రస్తుతం 22 ఓవర్లకు ఇంగ్లాండ్ 73-2 స్కోర్‌తో ఉంది, క్రీజులో జో రూట్ (19) మరియు ఒలీ పోప్ (7) ఉన్నారు. నితీశ్ ప్రదర్శనకు ఫిదా అయిన కెప్టెన్ గిల్, "బాగుందిరా మామా" అంటూ తెలుగులో ప్రోత్సహించాడు. ఈ ఆడియో స్టంప్ మైక్‌లో రికార్డై, "చ%ద్ఘుఖుస్త్రబఅఎఅతీఖుమీఖుఎఖు%" హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అలాగే, "వాట్ రా రెడ్డి" అనే ఫ్రేజ్ కూడా ట్రెండింగ్‌లో నిలిచింది. టీమ్ ఇండియా ఈ టెస్ట్ సిరీస్‌లో వరుసగా మూడోసారి టాస్ ఓడినప్పటికీ, నితీశ్ బౌలింగ్ దాడితో మ్యాచ్‌లో ఆధిపత్యం చెలాయించింది. జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్‌లతో ప్రారంభించిన బౌలింగ్‌లో వికెట్లు రాకపోవడంతో, గిల్ నితీశ్‌ను రంగంలోకి దించాడు. కెప్టెన్ నమ్మకాన్ని నితీశ్ సమర్థవంతంగా నిరూపించాడు. ఐపీఎల్ ప్రభావంతో క్రికెటర్లు స్థానిక భాషల్లో ప్రోత్సహించే ట్రెండ్‌కు ఈ సంఘటన మరో ఉదాహరణ. "తగ్గేదేలే" వంటి డైలాగ్‌లు ఐపీఎల్‌లో వైరల్ అయినట్లే, నితీశ్‌ను ప్రోత్సహించిన గిల్ తెలుగు డైలాగ్ క్రికెట్ అభిమానుల్లో జోష్ నింపింది.

## బ్రూక్ బౌల్డ్..

లార్డ్స్‌లో జరుగుతున్న మూడో టెస్టులో ఇంగ్లండ్ వరుసగా వికెట్లు కోల్పోతోంది. తొలి సెషన్లో రెండు వికెట్లు తీసిన భారత బౌలర్లు.. మూడో సెషన్‌లో మరో రెండు వికెట్లతో ఆతిథ్య జట్టును దెబ్బకొట్టారు. ఓపెనర్లు వెనుదిరిగాకా జిడ్డులా క్రీజను అంటుకుపోయిన ఓలీ పోప్ (44)ను టీ బ్రేక్ తర్వాత రవీంద్ర జడేజా (1-12) వెనక్కి పంపగా.. కాసేపటికే హ్యారీ బ్రూక్(11)ను బుమ్రా బౌల్డ్ చేశాడు. అంతే.. 172 వద్ద ఇంగ్లండ్ నాలుగో వికెట్ పడింది. సహచరులు పెవిలియన్‌కు క్యూ కడుతున్నా జో రూట్(62 నాటౌట్) అర్ధ శతకంతో జట్టును ఆదుకున్నాడు.

## కుల్దీప్ యాదవ్‌కు మళ్లీ నిరాశే

టీమిండియా స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు మళ్లీ నిరాశే ఎదురైంది. ఐదు టెస్టుల అండర్సన్-సచిన్ ట్రోఫీలో భాగంగా లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులోనూ కుల్దీప్ యాదవ్‌కు చోటు దక్కలేదు. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఒకే ఒక్క మార్పుతో బరిలోకి దిగింది. జస్‌ప్రీత్ బుమ్రా కోసం తొలి రెండు టెస్టుల్లో విఫలమైన ప్రసిధ్ కృష్ణపై టీమిండియా మేనేజ్‌మెంట్ వేటు వేసింది. వాస్తవానికి ఈ మ్యాచ్‌కు కుల్దీప్ యాదవ్ తీసుకుంటారని ప్రచారం జరిగింది. అతని వేరియేషన్, వికెట్ టేకింగ్ సామర్థ్యం జట్టుకు ఉపయోగపడుతుందని అంతా భావించారు. అంతేకాకుండా తొలి రెండు టెస్టుల్లో స్పిన్నర్లు దారుణంగా విఫలమయ్యారు. దాంతోనే కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని మాజీ క్రికెటర్లు సూచించారు. కానీ టీమిండియా మేనేజ్‌మెంట్ మాత్రం కుల్దీప్ యాదవ్‌ను పట్టించుకోలేదు. బ్యాటింగ్ డెప్త్ కోసమే వాషింగ్టన్ సుందర్‌ను జట్టులో కొనసాగించింది. అయితే కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడాన్ని నెటిజన్లు, మాజీ క్రికెటర్లు తప్పుబడుతున్నారు. టాస్ సందర్భంగా శుభ్‌మన్ గిల్ కూడా కుల్దీప్ యాదవ్ గురించి ఏం చెప్పలేదు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో శుభ్‌మన్ గిల్ టాస్ ఓడిపోయాడు. టాస్ గెలిస్తే బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని గిల్ తెలిపాడు. అయితే నేను ముందుగా బౌలింగ్ ఎంచుకునేవాడిని. తొలి సెషన్‌లో పిచ్ నుంచి బౌలర్లకు సహకారం ఉంటుంది. గత మ్యాచ్‌లో అందరూ రాణించారు. బౌలర్లు రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ఎడ్జ్‌బాస్టన్ వికెట్‌పై 20 వికెట్లు తీయడం సులువైన పనికాదు. మేం ఒకే ఒక్క మార్పుతో బరిలోకి దిగుతున్నాం. ప్రసిధ్ కృష్ణ స్థానంలో జస్‌ప్రీత్ బుమ్రా తుది జట్టులోకి వచ్చాడు.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు.

## భారత షాట్‌పుట్ క్రీడాకారిణి జాస్మిన్ కౌర్‌పై సస్పెన్షన్

భారత ప్రముఖ షాట్‌పుట్ క్రీడాకారిణి జాస్మిన్ కౌర్ డోపింగ్ పరీక్షలో విఫలం కావడంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ ఆమెను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. నాడ్ విడుదల చేసిన సస్పెండ్ చేయబడిన క్రీడాకారుల జాబితాలో జాస్మిన్ కౌర్ పేరు కూడా ఉంది. 22 ఏళ్ల జాస్మిన్ కౌర్.. ఈ ఏడాది డెహ్రాడూన్‌లో జరిగిన క్రీడల్లో 15.97 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ త్రోతో బంగారు పతకం సాధించింది. పంజాబ్‌కు చెందిన ఈ క్రీడాకారిణి గత ఏడాది జరిగిన విశ్వవిద్యాలయాల మధ్య పోటీలలో 14.75 మీటర్లు త్రో చేసి రెండో స్థానంలో నిలిచింది. ఆమెకు దగ్గు మందులలో సాధారణంగా కనిపించే టెర్బుటాలినే అనే ఉత్ప్రేరకం డోపింగ్ పరీక్షలో కనుగొనబడింది. ఇదిలా ఉండగా.. 20 ఏళ్ల లోపు ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో రజత పతకం సాధించిన రెజ్లర్ నితికపై 4 సంవత్సరాల నిషేధం విధించబడింది. ఈ నిషేధం గత ఏడాది మే 28 నుంచి అమల్లోకి వచ్చింది. పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంతో పాటు ఆసియా ఛాంపియన్ షిప్‌లో రజత పతకం సాధించిన జూనియర్ ప్రపంచ ఛాంపియన్ రెజ్లర్ రితిక హుడాకు కొన్ని రోజుల క్రితం విధించిన నిషేధాన్ని అనుసరించి, ఇప్పుడు మరో ఇద్దరికి నిషేధం విధించబడింది. రితిక హుడాకు జులై 7న తాత్కాలిక నిషేధం విధించబడింది. ఢిల్లీలో జరిగిన ఎంపిక పోటీల సందర్భంగా నాడా సేకరించిన మూత్ర నమూనాలో డోపింగ్‌కు పాల్పడినట్లు కనుగొనబడటంతో ఈ చర్య తీసుకున్నారు. ఈ వరుస సంఘటనలు భారత క్రీడా ప్రపంచంలో పెద్ద సంచలనం సృష్టించాయి. డోపింగ్ వాడకం పట్ల క్రీడాకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెల్చి చెప్పారు.

## పంత్ చూపుడు వేలికి గాయం

ఇంగ్లండ్ పర్యటనలో అద్భుతంగా రాణిస్తున్న భారత జట్టు వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ గాయపడ్డాడు. లార్డ్స్ టెస్టు రెండో సెషన్ సమయంలో అతడి ఎడమ చేతి చూపుడు వేలికి బంతి బలంగా తాకింది. ప్రస్తుతం అతడు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. దాంతో, పంత్ మళ్లీ మైదానలోకి ఎప్పుడు వస్తాడు? అనేది తెలియడం లేదు. అసలేం జరిగిందంటే.. జస్ప్రీత్ బుమ్రా వేసిన 34వ ఓవర్లో లెగ్ సైడ్ పడిన బంతి బౌండరీ వెళ్లకుండా ఆపే ప్రయత్నంలో పంత్ ఎడమవైపు జంప్ చేశాడు. ఆ సమయంలో బంతి అతడి చూపుడు వేలిని తాకుతూ వెళ్లింది. బాల్ గట్టిగా తాకడంతో నొప్పితో విలవిలలాడిన పంత్‌ను ఫీజియో పరీక్షించాడు. తాత్కాలికంగా వైద్యం చేసినా నొప్పి తగ్గకపోవడంతో వైస్ కెప్టెన్ మైదానం వీడాడు. పంత్ ఆరోగ్యంపై బీసీసీఐ కీలక ప్రకటన చేసింది. 'మూడో టెస్టు సందర్భంగా వైస్ కెప్టెన్ పంత్ ఎడమ చేతి చూపుడు వేలికి గాయమైంది. ప్రస్తుతం అతడికి డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు. బీసీసీఐ వైద్య బృందం పంత్‌ను పర్యవేక్షిస్తోంది. అతడు డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితం కావడంతో బ్యాకప్ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ గ్లోవ్స్ అందుకున్నాడు' అని బీసీసీఐ పోస్ట్‌లో రాసుకొచ్చింది. తొలి సెషన్ ఆరంభంలోనే ఇంగ్లండ్ ఓపెనర్లను పెవిలియన్ చేర్చాడు పంత్. నితీశ్ కుమార్ రెడ్డి ఓవర్లో బెన్ డకెట్(23), జాక్ క్రాలే(18)లు ఇచ్చిన క్యాచ్‌ను ఒడుపుగా అందుకొని భారత్‌ను పోటీలోకి తెచ్చాడీ వికెట్ కీపర్.



**బర్మింగ్‌హామ్‌లో భారత బౌలర్ల ధాటికి చేతులెత్తేసిన ఇంగ్లండ్ బ్యాటర్లు లార్డ్స్‌లోనూ తడబడ్డారు. లార్డ్స్‌లో జరుగుతున్న మూడో టెస్టులో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి (2-15) విజృంభణతో ఆతిథ్య జట్టు ఆదిలోనే కష్టాల్లో పడింది. ఒకే ఓవర్లో ఓపెనర్లు పెవిలియన్ చేరిన వేళ.. అనుభవజ్ఞుడైన జో రూట్(24 నాటౌట్), ఓలీ పోప్(12 నాటౌట్) అండగా జట్టును ఆదుకున్నాడు. టీమిండియా పేసర్లను కాచుకుంటూ వికెట్ కాపాడుకున్న ఈ జోడీ మూడో వికెట్‌కు రన్స్ రాబట్టింది. లంచ్ సమయానికి ఇంగ్లండ్ 2 వికెట్ల నష్టానికి 83 పరుగులు చేసింది.**

## హెచ్‌సీఏ అధ్యక్ష ఎన్నికలో జగన్మోహన్ రావు మోసం: సీఐడీ అరెస్టు



**హైదరాబాద్, జులై 10, (జనంసాక్షి):**
హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహన్ రావు ఐపీఎల్ 2025 సీజన్‌లో టికెట్ల అక్రమాలు, నిధుల దుర్వినియోగం, మరియు ఎన్నికల్లో నకిలీ పత్రాలతో మోసం చేసిన ఆరోపణలపై సీఐడీ చేత అరెస్టయ్యారు. రావు హెచ్‌సీఏ అధ్యక్ష ఎన్నికల్లో శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ పేరుతో నకిలీ పత్రాలు సమర్పించి, గౌలిపుర క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు సి. కృష్ణ యాదవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసానికి శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్షురాలు జి. కవిత, ఆమె భర్త రాజేంద్ర యాదవ్ సహకరించినట్లు సీఐడీ దర్యాప్తులో తేలింది.

ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఫ్రాంచైజీపై జగన్మోహన్ రావు బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్‌కు దిగినట్లు ఆరోపణలు వచ్చాయి. మార్చి 27న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌కు ముందు, రావు ఎస్ఆర్‌హెచ్‌కు కేటాయించిన ఎఫ్3 కార్పొరేట్ బాక్స్‌ను తాళం వేసి, 20 అదనపు ఉచిత టికెట్లు డిమాండ్ చేశారని ఎస్ఆర్‌హెచ్ ఆరోపించింది. ఇది ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సీఏ, బీసీసీఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు ఫ్రాంచైజీ పేర్కొంది, ఇది హెచ్‌సీఏకు స్టేడియం సామర్థ్యంలో 10% (3,900 టికెట్లు) ఉచితంగా కేటాయిస్తుంది. రావు అదనంగా 10% టికెట్లు వ్యక్తిగత ఉపయోగం కోసం డిమాండ్ చేశారని, ఎస్ఆర్‌హెచ్ నిరాకరించడంతో బెదిరింపులకు దిగారని ఆరోపణ లు ఉన్నాయి. ఈ వివాదంతో ఎస్ఆర్‌హెచ్ హైదరా బాద్‌ను విడిచి వెళ్లే బెదిరికలు చేసింది, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజిలెన్స్ దర్యాప్తును ఆదేశించారు.

తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ధరమ్ గురవా రెడ్డి ఫిర్యాదు ఆధారంగా, సీఐడీ జూన్ 9, 2025న భారతీయ శిక్షాస్మృతి సెక్షన్లు 465, 468, 471, 403, 409, 420, మరియు 34 కింద కేసు నమోదు చేసింది. రావు, హెచ్‌సీఏ కోశాధికారి సి. శ్రీనివాసరావు, సీఈఓ సునీల్ కంటేలతో కలిసి 2.32 కోట్ల రూపాయల నిధులను అక్రమంగా ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. జులై 9, 2025న రావు, శ్రీనివాసరావు, సునీల్ కంటే, రాజేంద్ర యాదవ్, మరియు జి. కవితను సీఐడీ అదుపులోకి తీసుకుంది, తదుపరి జులై 10న వారిని అరెస్టు చేసింది. విజిలెన్స్ నివేదిక ఎస్ఆర్‌హెచ్ ఆరోపణలను ధృవీకరించింది. జగన్మోహన్ రావు 2010లో అక్షర ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించారు మరియు హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో అధ్యక్షుడిగా, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. హెచ్‌సీఏ గతంలోనూ అజహరుద్దీన్ అధ్యక్షతన నిధుల దుర్వినియోగ ఆరోపణలతో వివాదాల్లో చిక్కుకుంది. ఈ అరెస్టులతో హైదరాబాద్ క్రికెట్‌లో సంస్కరణల అవసరం మరింత స్పష్టమైంది.

## తుంగభద్రకు తగ్గిన ఇన్‌ఫ్లో

**కర్నూలు, జూలై10 (జనంసాక్షి) :** తుంగభ జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గడంతో 8 క్రస్ట్‌గేట్లు క్రిందకు దించి కేవలం 13క్రస్ట్‌గేట్ల గుండా మాత్రమే దిగువకు వరదనీరు విడుల చేస్తున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. తుంగభద్ర పై భాగం ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టటడంతో తుంగభద్ర జలాశయానికి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో బుధవారం అధికారులు 8 క్రస్ట్‌గేట్లను మూసేశారు. బుధవారం సాయంత్ర 4గంటల సమయానికి అధికారులు సేకరించిన సమాచారం మేరకు ప్రస్తుతం జలాశయం ఎత్తు 1624.78 అడుగులకు నీటి మట్టం చేరుకోగా, జలాశయానికి 46,270 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. వివిధ సాగునీటి కాలువలకు వదులుతుండగా, జలాశయం 13క్రస్ట్‌గేట్లలో ఒక్కో గేటు– 2.5అడుగులు చొప్పు ఎత్తి 36,699 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు– బోర్డు అధికారులు వివరించారు.

# కర్ణాటక చిన్నారికి మంత్రి దామోదర చేయూత

### నిమ్స్‌లో ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించిన మంత్రి

### సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన పాప కుటుంబం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తీవ్ర గుండె జబ్బుతో బాధపడుతున్న చిన్నారికి మంత్రి దామోదర చేయూతనందించారు. నిమ్స్‌లో ఆ పాపకు ఉచితంగా ఆపరేషన్ చేయించి ఔదార్యాన్ని చాటుకున్నారు. కర్ణాటకకు చెందిన చంద్రకాంత్ దంపతులు హైదరాబాద్‌లోని మలక్‌పేట్ ప్రాంతంలో నివసిస్తూ, అక్కడే ఓ హెూటల్‌లో పని చేసుకుంటున్నారు. చంద్రకాంత్ దంపతుల 8 ఏండ్ల పాప ఐశ్వర్య తరచూ అనారోగ్యం బారిన పడుతుండడంతో, ఆమెను స్థానికంగా ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చూపించారు. పాపకు గుండె జబ్బు ఉన్నదని, ఆపరేషన్ చేయకపోతే పాప ప్రాణాలకు ప్రమాదం అని అక్కడి డాక్టర్లు తెలిపారు. ఆపరేషన్ కోసం కనీసం 5 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో చంద్రకాంత్ దంపతులు కుంగిపోయారు. కర్ణాటకకు చెందిన కుటుంబం కావడంతో వారికి ఆరోగ్యశ్రీ కార్డు, రేషన్ కార్డు లేవు. ఆధార్ కార్డు కూడా కర్ణాటకకు చెందినవే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గారిని కలిసి, పాప కండీషన్ గురించి తెలియజేసింది. దీంతో చలించిన మంత్రి, పాపను నిమ్స్‌లో అడ్మిట్ చేయించారు. వెంటనే ఆమెకు అవసరమైన ఆపరేషన్ చేయాలని, పూర్తి చికిత్స ఉచితంగా అందించాలని ఆదేశించారు. మంత్రి గారి ఆదేశాలతో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప పాప ఆపరేషన్‌కు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ నెల 4వ తేదీన గుండె వైద్య నిపుణులు గోపాల్, ప్రవీణ్ నేతృత్వంలోని డాక్టర్ల బృందం పాపకు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. పాప పూర్తిగా కోలుకోవడంతో పాపను డిశ్చార్జ్ చేశారు. చంద్రకాంత్ దంపతులు పాపతో వచ్చి గురువారం సెక్రటేరియట్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ గారిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పాప ప్రాణాలు కాపాడిన దేవుడంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా వారికి భరోసానిచ్చిన మంత్రి, పాపను అప్యాయంగా పలకరించారు. ఆమెను జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.



## స్కూలు బస్సులో మంటలు

### విద్యార్థులకు తప్పిన ముప్పు

**సంగారెడ్డి, జూలై10 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లాలో కిష్టారెడ్డిపేటలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సులో మంటలు చెలరేగాయి. ఔటర్ రింగ్ రోడ్డు కు సమీపంలో రెడ్లగడ్డలో విద్యార్థులను బస్సులోకి ఎక్కిస్తున్న క్రమంలో మంటలు అంటుకున్నాయి. వెంటనే విద్యార్థులను బస్సు డ్రైవర్, క్లీనర్ కిందకు దించేశారు. చూస్తుండగానే బస్సు మొత్తం మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశాయి. బస్సు పాక్షికంగా కాలిపోయిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రాణాపాయ తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్ తోనే బస్సులో మంటలు అంటుకున్నట్టు సమాచారం.

# ఓకే సినిమాగా బాహుబలి విడుదల

### అక్టోబర్ 31న విడుదలకు నిర్ణయం

### పదేళ్ల జ్ఞాపకాలపై రాజమౌళి సంచలన ప్రకటన



**హైదరాబాద్, జూలై10 (జనంసాక్షి) :** బాహుబలి సినిమాతో తెలుగు ఇండస్ట్రీని హాలీవుడ్ రేంజ్ కు తీసుకెళ్లిన దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి.. ఈ మూవీ అభిమానులకు సర్ ప్రైజ్ ప్రకటించారు. అద్భుతమైన విజువల్స్, పోరాట సన్నివేశాలు, భావోద్వేగాలతో సరికొత్త ప్రపంచాన్ని సృష్టించిన 'బాహుబలి' విడుదలై 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా రాజమౌళి సోషల్ మీడియా వేదికగా ఈ మూవీ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. రెండు భాగాలను కలిపి ఒకే మూవీగా తీసుకు రాబోతున్నట్లు వెల్లడించారు. 'బాహుబలి: ది ఎపిక్' – టైటిల్ తో ఈ మూవీని అక్టోబర్ 31న తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు– ప్రకటించారు. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, దగ్గుబాటి రానా,. అనుష్క శెట్టి, తమన్నా హీరోయిన్లుగా.. రమ్య కృష్ణ, నాజర్, సత్యరాజ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈమూవీ తొలి భాగం 'బాహుబలి: ది బిగినింగ్' జూలై 10, 2015న విడుదలైంది. రెండో భాగం 'బాహుబలి 2: ది కన్‌క్లూజన్' 2017లో విడుదలైంది. భారతీయ సినీ చరిత్రలోనే తొలిసారి రూ.వెయ్యి కోట్లు వసూల్ చేసిన చిత్రంగా ఈ మూవీ చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రెండు భాగాలు.. ఒకే సినిమాగా వస్తున్న 'బాహుబలి: ది ఎపిక్'ను చూసేందుకు ఎదురుచూస్తున్నట్లు– మూవీ లవర్స్, అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు.

## మహిళా ఓటర్ కార్డుపై సీఎం నితీశ్ ఫొటో



**పాట్నా (జనంసాక్షి) :** ఒక మహిళా ఓటరు కార్డుపై బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఫొటో ఉన్నది. ఇది చూసి ఆ మహిళ, ఆమె భర్త షాక్ అయ్యారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులపై వారు మండిపడ్డారు. ఓటరు కార్డుల్లో తప్పులపై విమర్శలు వెల్లువెత్తాయి. బీహార్‌లో తర్వలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మాధేపుర మున్సిపాలిటీకి చెందిన 30 ఏళ్ల అభిలాష కుమారి తన ఓటరు కార్డులో చిరునామా మార్పించుకున్నది. దీంతో పోస్ట్ ద్వారా కొత్త ఓటరు కార్డు ఆమెకు చేరింది. కాగా, కొత్త ఓటరు కార్డు చూసి అభిలాష కుమారి షాక్ అయ్యింది. అందులో ఆమె పేరు, చిరునామా సరిగానే ఉన్నాయి. అయితే ఆమె ఫొటో బదులు సీఎం నితీశ్ కుమార్ ఫొటో ఉన్నది. దీంతో కంగారుపడిన అభిలాష కుమారి తన భర్తతో కలిసి బూత్ స్థాయి అధికారిని కలిసింది. ఆ ఓటరు కార్డులో సీఎం నితీశ్ ఫొటో గమనించిన ఆయన ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని కోరాడు. ఈ పొరపాటుపై దర్యాప్తు జరుపుతామని చెప్పాడు.

## భార్యను తొక్కి చంపేసిన కిరాతకుడు

**బెంగళూరు, జూలై10 (జనంసాక్షి) :** ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దారుణానికి తెగించాడు. తన భార్య మెడపై కాలుతో తొక్కి చంపేశాడు. ఈ సంఘటన బెంగళూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీనివాసపూర్‌లో పద్మజ–హరీష్ కుమార్ అనే దంపతులు నివసిస్తున్నారు. దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తుండగా భార్య ఓ ప్రైవేటు– కంపెనీలో జాబ్ చేస్తోంది. హరీష్ గత కొన్ని నెలల నుంచి జాబ్ మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. దంపతుల మధ్య గత కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. షాపింగ్‌కు వెళ్లొచ్చిన భార్యతో భర్త గొడవకు దిగాడు. దంపతులు మధ్య ఘర్షణ తారాస్థాయికి చేరుకోవడంతో భార్య గొంతునులిమిన నెట్టేశాడు. ఆమె కిందపడిన వెంటనే మెడపై కాలుతో తొక్కడంతో ఊపిరాడక భార్య ఘటనా స్థలంలోనే చనిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఎసిబికి చిక్కిన నిమ్జ్ అధికారులు

**సంగారెడ్డి, జూలై10 (జనంసాక్షి) :** జిల్లాలో అవినీతి నిరోధక శాకు రెండు పెద్ద అవినీతి తిమింగళాలు చిక్కాయి. గురువారం జహీరాబాద్ లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మానుఫ్యాక్చరింగ్ జోన్(నిమ్జ్) అధికారులు ఎసిబి వలలో పడ్డారు. నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ సతీశ్ లు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. భూసేకరణ పరిహారం చెక్కులు ఇచ్చేందుకు లంచం అధికారులు డిమాండ్ చేయడంతో బాధితరులు ఎసిబిని ఆశ్రయించారు. దీంతో పక్క ప్లాన్ ప్రకారం.. బాధితుల నుంచి 65 వేల రూపాయలు లంచంగా తీసుకుంటుండగా అధికారులు రాజు, సతీశ్ లను ఎసిబి పట్టుకుంది. ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఎసిబి అధికారులు విచారిస్తున్నారు.

## ఏపీలో జనగణనకు ప్రభుత్వం పచ్చజెండా

### 2027 మార్చి1 నుంచి జనగణన ప్రక్రియకు ఉత్తర్వులు జారీ

**అమరావతి, జూలై10 (జనంసాక్షి) :** రాష్ట్రంలో జనగణన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 2027 మార్చి 1 నుంచి ఏపీ వ్యాప్తంగా జనగణన పక్రియ ప్రారంభంకానుంది. ఈ మేరకు గురువారం జీఎడీ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జనగణన గెజిట్ నోటిఫికేషన్‌ను సర్కార్ తిరిగి ప్రచురించింది. 2027లో దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం (ఈ।షసశ ఏ÷ఎష) నిర్ణయించిన విషయం తెలిసిందే. జనగణన కోసం ఈ ఏడాది జూన్ 16న కేంద్ర హోం శాఖ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. 2027 మార్చి 1 నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రారంభం కానుంది. అదేరోజు ఏపీ వ్యాప్తంగా కూడా జనగణన పక్రియ మొదలుకానుంది. కాగా.. భారత జనాభా లెక్కల పక్రియను రెండు దశల్లో నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. మొదటి దశ అక్టోబర్ 1, 2026 నుంచి మొదలుకానుంది. తొలిదశలో జమ్మూ కశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లో జనగణన జరుగనుంది. ఇక రెండవ దశ మార్చి 1, 2027 నుంచి దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో జనగణన పక్రియ ప్రారంభమవుతుంది.

# గురుగ్రామ్‌లో కుంభవృష్టి

### రహదారులు జలమయం.. ఇంటికే పరిమితమైన జనం



**న్యూఢిల్లీ, జూలై10 (జనంసాక్షి) :** భారీ వర్షాలతో గురుగ్రామ్ జలమయం అయింది. పలు ప్రాంతాలలో మోకాలి లోతు నీళ్లు నిలిచాయి. దీనితో వేలాది మంది ఇళ్లకు పరిమితం కావల్సి వచ్చింది. గురువారం గురుగ్రామ్‌లో అధికారులు జాగ్రత్త చర్యలకు సూచనలు వెలువరించారు. కార్పొరేట్ ఆఫీసులు, ప్రైవేటు– సంస్థల ఉద్యోగులు ఇంటి నుంచే పనికి దిగారు. ఈ ఆకాశహర్మాల నగరంలో అనేక చోట్ల నీరు నిలిచిపోయింది. ట్రాఫిక్ ఆగింది. నగరపు దక్షిణ ప్రాంతపు రహదారిపై బీరు సీసాలతో వెళ్లుతున్న ట్రక్కు గుంతలు పడ్డ రోడ్డులో కూరుకుపోయింది. దీనితో బీరు బాటిల్స్‌ను రక్షించుకునేందుకు డ్రైవర్ ప్రయత్నించాల్సి వచ్చింది. ఘటనలో ఎవరూ గాయపడలేదు. ప్రాంతానికి చేరుకున్న క్రేన్ సాయంతో అతి కష్టం మీద ట్రక్కును పైకి లాగారు. పలు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. కొన్ని ప్రైవేటు– విద్యాసంస్థలు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాయి. బుధవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో వర్షం ఆరంభం అయింది. రాత్రింతా పడుతూనే ఉంది. 12 గంటల వ్యవధిలో నగరంలో 133 మిమిల వర్షపాతం రికార్డు అయిందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రాంతానికి ఐఎండి ఆరంజ్ అలర్ట్ వెలువరించింది. ఇక్కడి జాతీయ రహదారులలో ఆరు ఏడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయింది. మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సరిగ్గా పనిచేయడం లేదని, అందుకే పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయని నగర ప్రజలు సామాజిక మాధ్యమాల ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు. దుస్థితిని తెలిపే ఫోటోలను పెట్టారు. హర్యానాలోని ఇతర ప్రాంతాలు అంబాలా, హిసార్, కర్నాల్ , రొహతక్ , భివానీలలో కూడా భారీ వర్షాలు పడ్డాయని అధికారులు తెలిపారు.

## నోయిడా కెమికల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

**నోయిడా, జూలై10 (జనంసాక్షి) :** నోయిడా సెక్టార్ 8లోని ఒక రసాయన కర్మాగారంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. దీంతో ఫ్యాక్టరీ ఆవరణ నుండి పెద్ద ఎత్తున దట్టమైన పొగలు ఎగసిపడటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురియ్యారు. భారీగా మంటలు చెలరేగుతుండటంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక దళాలు హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను ప్రారంభించాయి. అగ్నిమాపక దళం తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినట్లు– అధికారులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో నలుగురు కార్మికులు గాయపడ్డారు. పోలీసులు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన కార్మికులను చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## భద్రాద్రి అభివృద్ధికి చర్యలు ఏవీ?

**భద్రాద్రి, జూలై10 (జనంసాక్షి) :** యాదాద్రి తరహాలోనే భద్రాద్రిని కూడా అద్భుత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే సంకల్పానికి ముహూర్తం కుదరడం లేదు. మరోవైపు పోలవరంతో భద్రాద్రికి ముప్పు అన్న ఆందోళన వస్తోంది. ఈ రెడు విషయాలపై ఎలాంటి స్పందనా కానరావడం లేదు. మరోవైపు భద్రాద్రి రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్ రూపకల్పన పై గతంలో మంత్రి తుమ్మల అధికారులతో చర్చించారు. పలుసూచనలు చేశారు. ఆలయ అధికారులు, దేవస్థానం పండితులు, స్తపతులతో కలిసి భద్రాద్రి అభివృద్ధి మాస్టర్ ప్లాన్ గురించి చర్చించారు. కానీ అవన్నీ పక్కకుపోయాయి.

# తక్కువ ఖర్చుతో నడిచే సైకిల్ రూపకల్పన

### విద్యార్థి సిద్దూకు పవన్ ప్రశంసలు

### లక్ష రూపాయల నజరానా అందచేత



**అమరావతి, జూలై10 (జనంసాక్షి) :** అతి తక్కువ ఖర్చుతో, బ్యాటరీతో నడిచే సైకిల్‌ను రూపొందించిన విజయనగరం జిల్లాకు చెందిన ఇంటర్ విద్యార్థి రాజాపు సిద్దూని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. వినూత్న ఆలోచనతో సరికొత్త ఆవిష్కరణకు రూపం ఇచ్చిన సిద్దూ గురించి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పవన్.. అతణ్ని మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారు. అతని ఆలోచనలు తెలుసుకుని అబ్బురపడ్డారు. సిద్దూ రూపొందించిన గ్రాసరీ గురూ వాట్సప్ సర్వీస్ బ్రోచర్ చూసి ప్రత్యేకంగా అభినందించారు. అతని ఆలోచనలకు మరింత పదును పెట్టాలని ఆకాంక్షిస్తూ రూ.లక్ష ప్రోత్సాహకం అందించారు. ఆ సైకిల్‌పై సిద్దూని కూర్చోబెట్టుకొని నడిపారు. సిద్దూది విజయనగరం జిల్లాలోని జాడవారి కొత్తవలస గ్రామం. తన ఇంటి నుంచి దూరంగా ఉన్న కాలేజీకి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డ సిద్దూ.. స్వయంగా ఒక బ్యాటరీ సైకిల్‌కు రూపకల్పన చేశాడు. ఈ సైకిల్‌ను మూడు గంటలు పాటు ఛార్జ్ చేస్తే 80 కిలోమీటర్లు ప్రయాణించగలదని సిద్దూ పేర్కొన్నాడు.

# చైనాలో అధికార మార్పిడి తప్పదా?

### కొంతకాలంగా అజ్ఞాతంలోకి జిన్‌పింగ్

### జిన్‌పింగ్‌ను తప్పించేపనిలో కమ్యూనిస్టులు

### ప్రపంచవ్యాప్తంగా చైనా రాజకీయాలపై చర్చ



**బీజింగ్, జూలై10 (జనంసాక్షి) :** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగిపోతున్నారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆయన అధికారం నుంచి తప్పుకోబోతున్నారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. కొంతకాలంగా జిన్‌పింగ్ బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, బ్రిక్స్ సమావేశానికి హాజరు కాకపోవడం ఈ అనుమానాలకు బలం చేకూర్చాయి. ఈ క్రమంలో చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ అధికారాన్ని వీడబోతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. నియంతృత్వ పోకడలతో చైనా మొత్తాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్న జిన్‌పింగ్ ఇప్పుడు ఎందుకు అనూహ్యంగా తప్పుకుంటున్నారన్నది అంతు చిక్కట్లేదు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధికారాన్ని వీడబోతున్నారనే ఊహాగానాలు, అంతర్జాతీయ మీడియా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దశాబ్దానికి పైగా చైనా రాజకీయాలను శాసిస్తున్న జిన్‌పింగ్, తన పాలనా పగ్గాలను నెమ్మదిగా కమ్యూనిస్టు పార్టీలోని కీలక విభాగాలకు బదిలీ చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో జిన్‌పింగ్ పలు కీలక అంతర్జాతీయ సమావేశాలకు, దేశీయ అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండటం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సుకు ఆయన గైర్హాజరయ్యారు. గత 12 ఏళ్లలో ఆయన బ్రిక్స్ సమావేశానికి హాజరుకాకపోవడం ఇదే మొదటిసారి. చైనాలో జిన్‌పింగ్ తనదైన ముద్ర వేశారు. ఓ నియంతగా పేరు తెచ్చుకున్నారు. అదే సమయంలో చైనాను అగ్రస్థానంలో నిలిపేందుకు అనేక సంస్కరణలు చేపట్టారు. షీ జిన్‌పింగ్ 2012లో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుండి ఆయన తన అధికారాన్ని పటిష్టం చేసుకోవడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. తన పాలన ప్రారంభంలోనే అగ్రశ్రేణి నాయకుల నుంచి చిన్న ఉద్యోగుల వరకు అందరినీ లక్ష్యంగా చేసుకున్నారు. భారీ ఎత్తున అవినీతి వ్యతిరేక ప్రచారాన్ని ప్రారంభించారు. ఇది పార్టీలో తన ప్రత్యర్థులను తొలగించి, తన పట్టు నిలుపు కునేందుకు సహాయపడింది. జిన్‌పింగ్ తనకు అనుకూలంగా 2018లో రాజ్యాంగాన్ని సైతం సవరించారు. అధ్యక్ష పదవికి ఉన్న రెండు– పదవీకాలాల పరిమితిని తొలగించారు. ఇది ఆయనకు జీవితకాల అధ్యక్షుడిగా ఉండే అవకాశాన్ని కల్పించింది. ఈ చర్య ద్వారా ఆయన అధికారాన్ని తన గుప్పిట్లో శాశ్వతంగా ఉంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అర్థమైంది. అందుకే ఆయన ఓ నియంతలా పేరు తెచ్చుకున్నారు. చైనా చరిత్రలో మావో జెడాంగ్ తర్వాత అత్యంత శక్తివంతమైన నాయకుడిగా మారారు. శాశ్వత అధ్యక్షుడిగా ఉండేందుకు జిన్‌పింగ్ రాజ్యాంగ నిబంధనలను మార్చుకున్నప్పటికీ, ఇప్పుడు ఆయన అధికారాన్ని వదులుకునేందుకు సిద్ధమయ్యారనే వార్తలు ఆసక్తి రేపుతున్నాయి. అయితే దీని వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ప్రస్తుతం చైనా ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. నిర్మాణ రంగం సంక్షోభంలో ఉంది. యువతకు ఉద్యోగాలు లేవు. ప్రభుత్వ అప్పులు పెరిగిపోతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఆర్థిక సవాళ్లకు సమర్థవంతమైన పరిష్కారాలు కనుగొనడంలో జిన్‌పింగ్ విఫలమయ్యారనే విమర్శలు పార్టీలోనే పెరుగుతున్నాయి. జిన్‌పింగ్ అధికారాన్నంతటినీ కేంద్రీకృతం చేశారు. తన గుప్పిట్లో ఉంచుకున్నారు. ఇది పార్టీలో అసమ్మతి రాజేసింది. మాజీ నాయకులు, సీనియర్ పార్టీ సభ్యులు జిన్‌పింగ్ నిర్ణయాలపై అసంతృప్తితో రగిలిపోతున్నారు. పార్టీలోని వివిధ వర్గాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడం వల్లే, జిన్‌పింగ్ తలొగ్గి ఉండొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చైనాలో అధికార మార్పిడి ప్రపంచంలోని ఇతర ప్రజాస్వామ్య దేశాల్లో జరిగే సాధారణ ఎన్నికల పక్రియకు పూర్తి విరుద్ధంగా ఉంటుంది. అన్ని ప్రభుత్వ సంస్థలు, సైన్యం, న్యాయవ్యవస్థ, మీడియా... ఇలా అన్నీ పార్టీ నియంత్రణలోనే పనిచేస్తాయి. పార్టీ నాయకుల ఎంపిక, పదవీ విరమణ వంటి నిర్ణయాలు పార్టీలోని అత్యున్నత స్థాయి కమిటీలైన పొలిట్‌బ్యూరో, దాని స్టాండింగ్ కమిటీలే తీసుకుంటాయి. ఒకవేళ జిన్‌పింగ్ వైదొలిగితే ఆయన స్థానంలో ఎవరు బాధ్యతలు తీసుకుంటారనేదానిపై స్పష్టత లేదు. జిన్‌పింగ్ వారసుడిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నవాళ్లలో ప్రస్తుతం చైనా ప్రధానిగా లీ కియాంగ్ ముందున్నారు. జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడు, నమ్మకస్తుడు. లీ కియాంగ్ తో పాటు– డింగ్ జుయెజియాంగ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. చైనాలో అధికార మార్పిడి పక్రియ చాలా రహస్యంగా సాగుతుంది. ఒకవేళ జిన్‌పింగ్ అధికారం నుంచి తప్పుకుంటే, అది చైనా రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370